- పాటకు మరణం లేదు
- అమ్మ ఒడిలోని పసిపాప నవ్వు గద్దర్ పాట
- గద్దరన్నా... నిష్క్రమణ తెలిసే పాట రాయమన్నావా
- నాన్నంటే నా మదిలో
- ప్రజావాగ్గేయకారుడు - గద్దర్
- అగ్ని సరస్సున వెలసిన వజ్రం
- పాటల పరివ్రాజకుడు గద్దర్
- కలాన్ని జయించిన గద్దర్ పాట




# మూసీ

# MUSI

• Samputi : 26 • Sanchika : 11 • Pages : 64 • Rs. 20
• September 2023

UGC Care List
Approved Journal




## ప్రజావాగ్గేయకారుడు గద్దర్ స్మృతి సంచిక

Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 26 సంచిక : 11
సెప్టెంబర్ - 2023
'శోభకృత్' నిజ శ్రావణం మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

| | |
|---|---|
| పాటకు మరణం లేదు ... అమర్ (మిత్ర) | 5 |
| నాన్నంటే నా మదిలో ... వెన్నెల గద్దర్ | 6 |
| అగ్ని సరస్సున వెలసిన వజ్రం ... బి. నరసింగరావు | 7 |
| అమ్మ ఒడిలోని పసిపాప నవ్వు గద్దర్ పాట ... గోరటి వెంకన్న | 10 |
| ప్రజావాగ్గేయకారుడు - గద్దర్ ... విమలక్క | 12 |
| గద్దరన్నా ... నిష్క్రమణ తెలిసే పాట రాయమన్నావా ... అమర్ (మిత్ర) | 17 |
| పాటల పరివ్రాజకుడు గద్దర్ ... డా. నందిని సిధారెడ్డి | 19 |
| యుగకర్త గద్దర్ ... ప్రొఫెసర్ సి. కాశీం | 21 |
| కాలాన్ని జయించిన గద్దర్ పాట ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు | 27 |
| విప్లవ 'గీతా'కారుడు గద్దర్ ... డా. కోయి కోటేశ్వర రావు | 31 |
| శ్రామిక స్త్రీల ఆత్మగీతం, విప్లవోద్యమ మాతృగీతం 'సిరిమల్లె సెట్టుకింద..' .. డా.ఎస్.రఘు | 35 |
| గద్దరన్న అడిగిన ప్రశ్నలు ... డా. వెల్దండి శ్రీధర్ | 38 |
| విప్లవ వాగ్గేయకారుడు గద్దర్ ... డా. కె. సురేశ్‌కుమార్ | 41 |
| కల్చరల్ లెజెండ్ గద్దర్ ... డా. మహేందర్ బర్ల | 44 |
| గద్దర్ పాట అజరామరం ... డా. శివరాత్రి సుధాకర్ | 47 |
| ప్రజాగాయకుని సినీగేయ ప్రస్థానం ... డా. మాధవీలత రామరాజు | 54 |
| మహిళా చైతన్యపు మేల్కొలుపు గీతాలు - గద్దర్ పాటలు ... సి.అనిత కుమారి | 56 |
| గద్దర్ సూర్యుడు ... డా. మంత్రి శ్రీనివాస్ | 59 |





ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11

హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**




## ప్రకృతి తత్త్వవేత్త

ప్రకృష్టమైన కృతి ప్రకృతి. పంచభూతాత్మకమైనది. నింగి, గాలి, నిప్పు, నీరు, నేలలతో కూడుకున్నది. ఈ ప్రకృతి భూమి చుట్టూ సక్రమంగా విస్తరించి ఉంది. మానవునికన్నా ఎన్నో రెట్లు శక్తివంతమైనది. మానవునిలోనూ, అన్ని జీవజాతులలోనూ ఈ ప్రకృతే వ్యాపించింది. జ్ఞానాలలో లోకజ్ఞానం కన్నా ప్రాకృతిక జ్ఞానం విశిష్టమైనది. లోకమంతా ప్రకృతితో నిండి ఉండాల్సిందే కానీ, ప్రకృతిలో సాధారణమైన మన ఆలోచనలతో కూడుకున్న లోకం ఉండదు. ఈ లోకంలో జీవించే జీవి తనకన్నా ఉన్నతమైన శక్తి గూర్చి మాత్రమే ఆలోచనలు చేస్తే, తాను శక్తి స్వరూపమై లోకానికి మార్గనిర్దేశనం చేయగలడు. తన శక్తికన్నా బలహీనతలను గుర్తు చేసుకుంటూ ఉంటే ఉన్న శక్తిని కోల్పోయి ఎవరికీ, ఏ రూపంలోనూ వినియోగపడడు. శక్తివంతుడు కావాలంటే శక్తి వద్ద మనస్సును కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఈ సమాజంలోని ఒక సమస్యను పూర్ణంగా అర్థం చేసుకోవాలన్నా మనలోని ప్రకృతి (పంచభూతాలు) శుద్ధమై, సహకరించాలి. అందుకే వేరు వేరు ధర్మాలలోని ప్రముఖులంతా ప్రకృతి చుట్టూనే మనస్సును కేంద్రీకరిస్తారు. సూర్యుడు, గాలి, నీరు, నిప్పు, నేల, నింగి, చెట్టు, పిట్ట మొదలైన శక్తివంతమైన ప్రాకృతిక జీవులను పరిశీలిస్తూ ఉంటారు. అవి మానవునికి ఇచ్చే సందేశాలను ఆలోచిస్తారు. వాటి శక్తిని నిరంతరం స్మరిస్తూ ఉంటారు. యోగులైనా, సిద్ధులైనా, బుద్ధులైనా, వైజ్ఞానికులైనా, రచయితలైనా, కవులైనా... ఎవరైనా ఆ ప్రకృతి తత్త్వాన్ని గమనించాల్సిందే. ఆ శక్తితో లోకాన్ని ప్రేమించాల్సిందే. అప్పుడు అపరిమితమైన శక్తి వారిని ఆవహిస్తుంది. వారు మార్గదర్శకులయ్యే అవకాశం ఇస్తుంది.

గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) విశిష్టమైన వ్యక్తి. లోకానికి తనదైన ప్రత్యేక మార్గాన్ని పరిచయం చేసినవాడు. తరువాతి తరానికి ఆదర్శంగా నిలిచినవాడు. ఎందరి హృదయాలలోనో నిలిచిపోయినవాడు. అందరినీ ప్రేమించగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్నవాడు. సహృదయుడు. పాటలను రాసి, తనదైన ప్రత్యేక బాణీలలో పాడి, ఆడి తన ప్రభావాన్ని సమకాలీన సమాజంపై వేసినవాడు. గద్దర్, తన పాటల ద్వారా కుళ్ళిపోతున్న సమాజాన్ని, ఇబ్బందులను, బాధలను ఎన్నింటిని వ్యక్తీకరించినా, వానికి ఎక్కడో ఒక దగ్గర తనకు తోచినట్లు పరిష్కారం కూడా తెలియజేస్తాడు. పరిష్కార శక్తి ఈ ప్రకృతితో మమేకమైనప్పుడే గద్దర్‌కు వచ్చింది. చేతిలోని దండమే అవసరమైనప్పుడు హెచ్చరించడానికి, సమస్యా పరమైన తాత్త్విక చింతనకు వినియోగ పడింది. సమస్య ఏదైనా తాను నేలమ్మతో, వానమ్మతో, నీరమ్మతో, గాలమ్మతో, పచ్చని పొలాలతో, అడవి తల్లితో, సెలయేళ్ళతో, ఎప్పటికప్పుడు చర్చలు చేస్తూనే ఉంటాడు. వాటితోనే ఎక్కడో ఒక దగ్గర పోలికలను ఏర్పరచుకుంటాడు. వాని శక్తినే మనకు పాటగా అందిస్తాడు.

లోకంలో నివసించే వ్యక్తి అందరికంటే భిన్నంగా ఏదైనా ప్రత్యేకమైన అంశంలో కృషి చేసి, సాధించి, తరువాత తరానికి తనదైన ముద్రను వేయగలిగే శక్తిని సంపాదించుకోవడం, కొన్ని తరాల వరకు అందరి హృదయాలలో నిలిచిపోయేలా ఉండడం వంటివి, కొద్దిమంది వల్లనే సాధ్యం అవుతున్నాయి. ప్రకృతి ప్రేమికులై, ప్రకృతిలోని శక్తిని నిరంతరం ఉపాసించిన వానికి ఆ ప్రకృతి అపరిమితమైన శక్తిని అందిస్తుంది. ఈ తరహాలో నిలబడిన గొప్ప పాటల వైజ్ఞానికుడు, ప్రకృతి ప్రేమికుడు, సమాజ విశ్లేషకుడు, అందరి హృదయాలలో పాటగా, ఆటగా నిలిచిపోయిన తాత్త్వికుడు గద్దర్. అత్యున్నతమైన ప్రజాదరణ పొందిన అరుదైన కవి. ఆ తాత్త్వికునికి మూసీ నివాళి.


గద్దర్‌పై విశేష సంచికను అతి తక్కువ సమయంలో వేయాలన్న సంకల్పానికి చేయూత నిచ్చి వ్యాసాలు, ఫొటోలు అన్నీ అందించి ఆదరించిన మిత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ... గద్దర్ స్మృతికి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ... ఈ సంచికను గద్దర్‌కు అంకితం చేస్తున్నాం.

# పాటకు లేదు మరణం

పాటకు లేదు మరణం
నీ ఆటకు లేదు మరణం
పాటకు లేదు మరణం
జనమాటకు లేదు మరణం
విప్లవ యుగాన గద్దర్ జననం
విప్లవ గీతపు పల్లవి చరణం ॥పాటకు॥

1. ఉరుముల మెరుపుల నగ్నల్బరికి
పుట్టిన బిడ్డర గద్దర్
అంటరాని ఆ ఆకలి కేకల
అర్తనాదమే గద్దర్
తెలంగాణ తెగింపు అబ్బిన
వీరంగణమే గద్దర్
మూడు స్రవంతుల మేలుకలయిక
నిన్నటి నేటి రేపటి ఉదయిక ॥పాటకు॥

2. రాలిన యోధుల వీపున మోసిన
అమ్మల ప్రేమర గద్దర్
వెన్నులో తూటను నెచ్చెలి జేసిన
నెమలి ఆటరా గద్దర్
నింగికెగిసిన తారల మెరుపుల
యుద్ధ నౌకరా గద్దర్
ఎర్ర జెండాను గుండెకద్దుకుని
పంచశీలయై ప్రభవించెను గద ॥పాటకు॥



3. నాటిన విత్తును పలకరించిన
వాన చినుకురా గద్దర్
చెలిమితో చిగురాకులు పంచిన
కోయిల రాగం గద్దర్
పంట రాశికి ప్రజారాసులకు
గొలుసు కట్టురా గద్దర్
చెమట దారకు గళం ఊటకు
ప్రజా సంస్కృతే ప్రగతి బాటకు

పాటకు ప్రాణం ప్రజలే
జన మాటకు మూలం శ్రమనే
గుమ్మడి విఠలుగా పుట్టినగాని
జన యుద్ధం బాటే పట్టిన పాట





అమర్ (మిత్ర)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11  UGC Care List Approved Journal
హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# నాన్నంటే మా మదిలో ....

**వెన్నెల గద్దర్** ఫోన్ : 837 405 7569






నాన్న అంటే నాకు ఓ ప్రియమైన పిలుపు,
నాన్న అంటే నాకు తన గుండె చప్పుడు వింటూ,
హాయిగా నిద్రించే చల్లని పాన్పు.
నాన్న అంటే అల్లరి చేస్తూ చిన్న పిల్లాడిలా
అందరినీ నవ్వించే చిరునవ్వు...
నాన్న అంటే ఎంత పెద్ద తప్పు అయినా, క్షమించి
తన ఒడిలోకి తీసుకొని సర్ది చెప్పే ప్రేమమూర్తి
నాన్న అంటే నువ్వు ఆడపిల్లవి కావు, అన్యాయాన్ని
ఎదిరించే శక్తివి అని ధైర్యాన్ని ఇచ్చే ఆయుధం
నాన్నను మా గుండెల్లో దాస్తూ, కన్నీళ్ళను కాగడాలుగా వెలిగిస్తూ ....
నీ కవితలో, పాటలో, మాటలో, ఆటలో, ఆశయంలో,
నిశ్శబ్ద విప్లవంగా ఉన్నాము, ఉంటాము.

... ఇట్లు ... నీ కుటుంబ సభ్యులు.







ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# అగ్ని సరస్సున వెలసిన వజ్రం

**బి. నరసింగరావు,** ప్రముఖ సినిమా దర్శకుడు, ఫోన్ : 9908010404

రాజకీయాల వేడికి సమాజం భగభగమంటున్నే రోజులు. విప్లవ భావజాలంతో కవులు, రచయితలు తమ కలాలను ఝళిపిస్తున్న కాలం. 'ఆర్ట్ లవర్స్' అనే సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించింది అబ్బూరి రామకృష్ణారావు గారి చేతుల మీదుగా... రవీంద్ర భారతిలో 1966లో పురుడు పోసుకున్న ఈ సంస్థ అనేక రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయమైంది. 'దిగంబర కవుల' కాలం తర్వాత 'విప్లవ కవుల' కాలం ఆవిర్భవించింది.

1970లో 'ఆర్ట్ లవర్స్' స్థావరం హైదరాబాద్ నుండి అల్వాలకు మారింది. అప్పటికే 'విరసం' తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఎనభై మంది విద్యార్థులతో మేమొక రాత్రి పాఠశాల ప్రారంభించాము. వారానికి ఐదు రోజులు స్కూల్లో చెప్పే పాఠాలే చెప్పేవాళ్ళం. శనివారం మాత్రం చిత్రకళ, అలాగే ఆదివారం ప్రస్తుత సామాజిక పరిస్థితులను తెలియజెప్పేవాళ్ళం. అంతేకాకుండా చుట్టుపక్కల గ్రామాలలో కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారం. పైన పేర్కొన్న కార్యక్రమాలన్నీ విప్లవ భావజాలంతో తొణికిసలాడుతూ ఉండేవి.

1971 చివర్లో మా యింటికి శేషగిరి అనే యువకుడు మరో యువకుడిని వెంట బెట్టుకుని వచ్చాడు. ఆ వచ్చిన అగంతకుని పేరు గుమ్మడి విఠల్‌బాబు. విఠల్‌బాబు ఇలా చెప్పుకుంటూ వచ్చాడు.

"నేను వెంకటాపురంలో ఉంటాను. తరచుగా చదువుకోవడానికి అల్వాల్ లైబ్రరీకి వచ్చి పోతుంటాను. ఈ శేషగిరి అనే మిత్రుడు మీ గురించి చెప్పాడు. అందుకే మిమ్మల్ని కలుద్దామని వచ్చాను".

**"ఏం చేస్తున్నావు"** – నేను.

**"స్టూడెంట్‌ని! అప్పుడప్పుడు ప్రభుత్వం వారి ఫీల్డ్ పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ వారి కోసం బుర్రకథలు చెపుతుంటాను. అవి కుటుంబ నియంత్రణ, చిన్న మొత్తాల పొదుపు అనే వస్తువుతో కూడుకుని ఉంటాయి. ఒక కార్యక్రమానికి అరవై రూపాయలు ఇస్తారు. ఐతే అవి మేం ముగ్గురం పంచుకుంటాం"** అని నవ్వాడు.

**"ఈ బుర్రకథలు ఏయే విషయాలపై ఆధారపడి ఉంటాయి..."** – నేను.

**"పౌరాణిక, చారిత్రక, సామాజిక అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఉదా: సీతారామ కళ్యాణం, పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, మహాత్మాగాంధీ మొదలైన కథలు చెప్తాం"** అన్నాడు విఠల్‌బాబు.

**"అంతేనా! ఇంకేమైనా ఉన్నాయా?"** – నేను.

**"అల్లూరి సీతారామరాజు కూడా చెబుతాం".**

**"బాగుంది. త్వరలో మా 'ఆర్ట్‌లవర్స్' వార్షికోత్సవం ఉంది. దాంట్లో సీతారామరాజు కథ చెప్పండి"** అన్నాను. సరే!నంటూ విఠల్‌బాబు నా చేతికో నోట్‌బుక్ అందించి, **"నేను రాసిన కవితలు. ఒకసారి చూడండి"** అన్నాడు. నేను



ఆ పుస్తకం అందుకుని సరేనన్నాను. వాళ్ళు వెళ్ళిపోయారు. కాసేపు నేను ఆ నోట్‌బుక్‌లోని పేజీలు తిరగవేశాను. అవి విఠల్‌బాబు రాసిన ప్రేమ కవితలు.

మా 'ఆర్ట్‌లవర్స్' వార్షికోత్సవం రానే వచ్చింది. విఠల్‌బాబు తన బృందంతో సీతారామరాజు బుర్రకథ చెప్పాడు. అంతా బాగానే ఉంది. కాని బుర్రకథ చివరన కథ చెప్పించినందుకు నన్ను పొగిడాడు. మరుసటి రోజు జరిగిన మా సంస్థ సమావేశంలో మా సభ్యులు నాతో అన్నారు. **"కథ బాగానే చెప్పాడు. కాని చివర్లో నిన్ను పొగిడాడేంటి?"** అని. **"అదే నాకర్థం కావడం లేదు!"** అన్నాన్నేను. మూడు రోజుల తర్వాత విఠల్‌బాబు వచ్చి **"కథ నచ్చిందా!"** అని అడిగాడు. **"కథ బాగానే ఉంది. కాని కథ చివర్లో నన్ను పొగిడారేంటి?"** అన్నాను. **"కథ చెప్పించిన వాళ్ళని చివర్లో పొగడడం మాకు ఆనవాయితే"** అన్నాడతడు. **"అలా పొగడకూడదు కదా"** – నేను. **"ఔనా! పొగడకూడదా!"** ఈసారి ఆశ్చర్యపోవడం విఠల్‌బాబు పనైంది. బహుశా అది అతనికి కొత్తగా ధ్వనించి ఉంటుంది. ఇక అప్పటి నుండి ఒక సంవత్సరంన్నర వరకు అతడు మా సంస్థకు వచ్చి పోతూనే ఉన్నాడు. అక్కడ జరిగే విషయాలన్నీ ఆసక్తితో గమనిస్తూనే ఉన్నాడు.

'ఆర్ట్‌లవర్స్'లో నగ్జల్‌బరి, శ్రీకాకుళ పోరాటాలపై, ఆ రకమైన విప్లవ భావజాలంపై చర్చలు జరుగుతూ ఉండేవి. అవన్నీ అతడికి కొత్తగా అనిపించేవి. విప్లవ భావజాలం తొణికిసలాడే సాంస్కృతిక ప్రదర్శనలు ఎలా ఇవ్వాలి అనేది ఆ చర్చల్లో ప్రధానాంశంగా ఉండేది. అదీ కాకుండా, సామాజిక, సాంఘిక



అంశాలపై శాస్త్రీయ దృక్పథంతో (మార్క్సిజం) కూడా ఆవేశపరమైన చర్చలు జరుగుతుండేవి. ఇవన్నీ విఠల్‌బాబు చాలా ఆసక్తితో గమనిస్తూ ఉండేవాడు. అలాగే పుస్తకాలు ఇచ్చి పుచ్చుకోవడం, సాంస్కృతిక రూపకాలు ప్రాక్టీసు చేయడం, ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమంతో 'ఆర్ట్‌లవర్స్' సంస్థ చాలా బిజీగా ఉండేది. 'ఆర్ట్‌లవర్స్' ఆదర్శాలతో మమేకమైన వారే ఆ సంస్థలో సభ్యులుగా ఉండేవారు. అది విఠల్‌బాబుకు స్పష్టంగా అర్థమైంది.

తన సామాజిక జీవనంలో ఎక్కడికెళ్ళినా 'కులం' తనను వెంబడించింది అని అతడు నాతో అన్నాడు. దానికి రెండు ఉదాహరణలు కూడా చెప్పాడు. 1. వాళ్ళ బుర్రకథల ప్రదర్శనల కోసం గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రదర్శన తర్వాత ఏ సర్పంచ్ ఇంట్లోనో భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఇక పడుకోవాల్సిన సమయంలో ఆ యింటి పెద్ద, వాళ్ళను (విఠల్‌బాబు బృందాన్ని) అడిగేవారు. **"ఏ వర్ణం బాబు మనది"** అని, దానికి సమాధానంగా ''దళితులం'' అనేవారు విఠల్‌బాబు బృందం. అది విన్న ఇంటి యజమాని ఒక మూడు చుట్టలు (బెడ్స్) తీసుకుని, అవి వాళ్ళకిచ్చి అలా దూరంగా పడుకోండి అనేవారు. 2. విఠల్‌బాబు క్లాస్‌మేట్ వీరేశం (కోమటి) తన షాపులో విఠల్‌బాబుకి ఉద్యోగం ఆఫర్ చేస్తాడు. దానికి అంగీకరించి అతడు దుకాణంలోకి అడుగు పెట్టగానే **"ఆ చీపురు తీసుకుని దుకాణం ఊడ్వు"** అన్నాడట. ఇలాంటి సంఘటనలు ఆయన మనసును ఎన్నోసార్లు గాయపర్చాయి.

ఆ రకంగా చూస్తే 'ఆర్ట్‌లవర్స్'లో కులం లేదు. ఇక్కడ ఎవ్వరికీ ఆ పట్టుదలలు ఉన్నట్టు కనిపించదు. కాని బి.నరసింగారావు (నేను) పెద్ద భూస్వామి బిడ్డ. పెద్ద బంగళాలు, పొలాలు కలిగిన వాడు. కాని ఆయన ఇక్కడికి వచ్చినప్పుడు మాత్రం గది ఊడుస్తున్నాడు. ఇతరులు ఏ పని చేస్తున్నారో ఆయన కూడా ఆ పనులన్నీ చేస్తున్నాడు. ఇది చాలా విచిత్రంగా తోచింది విఠల్‌బాబుకి. ఇది నటననా, నిజమా తేల్చుకోలేక పోతున్నాడతడు. ఆ అనుమానం అతడి బుర్రను ఎప్పుడూ తొలుస్తూనే ఉంది. ఒకసారి కొంతమంది ఆర్ట్‌లవర్స్ సభ్యులు హైదరాబాద్‌లో జరిగే విప్లవ రచయిత్రల సంఘం (విరసం) సభలకు వెళ్లాం. మాతో పాటు విఠల్‌బాబు కూడా వచ్చాడు. అక్కడ నా చిత్రకళా ప్రదర్శన కూడా జరుగుతుంది.

ఆ సభలలో ప్రఖ్యాత ప్రజా కళాకారుడు నాజర్ ఉపన్యాసం చాలా ఉత్తేజకంగా సాగింది. **"కథలు, నవలలు, వ్యాసాలు, కవితలు విప్లవ భావజాలంతో రాయడం మంచిదే. కాని వీటితో బాటు పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలలోకి మరింతగా చొచ్చుక పోతాయి. పాటని తిలకిస్తున్న ప్రేక్షకులు ఎంతో భావోద్వేగానికి గురవుతారు. ఆ రూపకాలు చాలా మేలైన ఫలితాలనిస్తాయి"** అన్నాడు నాజర్. దానికి మా 'ఆర్ట్‌లవర్స్' సభ్యులు ప్రభావితులై ఆయనతో ఒక ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సందర్భంలో ఆయన ఒక ప్రజా కళాకారునిగా తన వ్యక్తిగత అనుభవాలనెన్నో మా సభ్యులతో పంచుకున్నాడు.

ఈ సంఘటన జరిగిన వారం రోజులకు విఠల్‌బాబు ఒకసారి 'ఆర్ట్‌లవర్స్'కు వచ్చి నన్ను కలిసాడు. **"జానపద రీతిలో విప్లవగీతం రాయాలని అంటున్నారు. ఆ పద్ధతిలో వెలువడిన రచనలు యెంతో ప్రాచుర్యం పొందుతాయని కూడా అంటున్నారు కదా! అలాంటి పాటలు రాయడం ఎలా?"** అని విఠల్‌బాబు నన్ను ప్రశ్నించాడు. దానికి సమాధానంగా నేనన్నాను **"ఒక జానపద గీతం బాణీ పట్టుకుని దాన్ని మన విప్లవ కథా వస్తువుతో నిలిపి రాయగలిగితే నిజంగానే అది ప్రజలను బాగా ఆకట్టుకుంటుంది. దాంట్లో సందేహం ఏమీలేదు". "అయితే మీకు తెలిసిన, మీకు నచ్చిన ఒక జానపద గీతం వినిపించండి"** అన్నాడతడు. అప్పుడు నేను గొంతు సవరించుకుని ఇలా ఆలపించాను.

**"ఆపుర బండోడో బండెంట నేనొస్తా**
**నిలుపుర బండోడో బండిమీద నేనొస్తా**
**నువ్వురకా నేనురకా – నీ చెంప నేన్‌గొరక**
**చీర గట్టిందాకా – రైకా దొడిగిందాకా**
**ఆపుర బండోడో – బండెంట నేనొస్తా"**

"ఈ పాటబాణీకి విప్లవ రాజకీయ వస్తువును జోడించి నువ్వు నీ రచన కొనసాగించాల్సి ఉంటుంది" అన్నాన్నేను.

"ఇప్పుడు దీంట్లో ఏది ఉంచాలి, ఏది తీసేయాలి. అది చెప్పండి ముందు" అన్నాడు విఠల్‌బాబు.

"దీంట్లో పల్లవి ఉంచాల్సిందే 'ఆపుర బండోడో... బండెంట నేనొస్తా, నిలుపుర బండోడో... బండిమీద నేనొస్తా' అలాగే 'చెంప కొరకడమూ, చీర గట్టడమూ' మనకు అవసరం లేని విషయాలు..." అని అన్నాను.

"అయితే ఇప్పుడేం మిగిలింది! ఆపుర బండోడో బండెంట నేనొస్తా... అంతే కదా" అని నవ్వాడతడు.

నేనూ నవ్వుతూ "అవును. అంతే. అంతే మిగులుతుంది మరి. మిగతా చరణాలు నీవు రాయాల్సిందే" అన్నాను.

"సరే! అట్లనేగానీ, నువ్వన్నట్లే రాయడానికి ప్రయత్నిస్తా..." అన్నాడు విఠల్‌బాబు.

ఇక మరుక్షణం నుండి అదే ధోరణిలో ఉన్నాడతను. ఇందాక చర్చించిన పద్ధతిలో రాయాలి. ఇక అతడికి మానసిక సంఘర్షణ మొదలైంది. రకరకాల ఆలోచనలు అతడి బుర్రను ఆవహించాయి. తన పక్కన ఏ వస్తువున్నా దానిపై దరువేస్తూ "ఆపుర బండోడో... బండెంట నేనొస్తా" అలాగ రెండు మూడు రోజులు యాతన పడి, అంతిమంగా ఒక పాట రాసుకుని 'ఆర్టలవర్స్' ప్రాంగణంలోకి అడుగు పెట్టాడు విఠల్‌బాబు. నాతో అన్నాడు "పాట రాసాను. వింటావా?" "తప్పకుండా... వినిపించు" అన్నాన్నేను. "అల్వాల చుట్టుపక్కల స్థలాలన్నింటిని ఈ పాటలోకి దించిన" అన్నాడు నవ్వుతూ. ఆయనతో పాటు నేనూ నవ్వుతూ పాట వినడానికి ఉపక్రమించాను.

**"గోల్‌నాక కాద నీకు – గోల్ మిఠాయ్ దినిపిస్తా**
**సత్యా టాకీస్‌లోన – నీక్ సిన్మా జూపిస్తా**
**లాల్‌బజార్ కాద – లడ్డు మిఠాయ్ దినిపిస్తా**
**కార్ఖానా కాద – నీక్ కల్లు బోపిస్తా**
**ఆల్ఫా హోటల్‌లోన – ఆలు బిర్యాని దినిపిస్తా**
**ఆపుర రిక్షోడో – రిక్షెంట నేనొస్తా**
**నిలుపుర రిక్షోడో – రిక్షమీద నేనొస్తా....."** ఇలా సాగింది ఆయన పాట. పాట విన్నాక నేనన్నాను గదా..!

"లడ్డూలు ఏడికెల్లి దినిపిస్తవు, కల్లు ఏడికెల్లి పోపిస్తవు, సీన్మ యేడికెల్లి జూపిస్తవు, ఆలు బిర్యాని యేడికెల్లి దెస్తవు, అట్లకాదు! పేదవాడు పడే బాధలు రాయి. పేదల సంఘర్షణ, వాళ్ళ తలరాత మారే వైనం గురించి రాయి. దానికి విఠల్‌బాబు పగలబడి నవ్వుతూ... "ఈసారి నువ్వు అన్నట్టే రాసి తీసుకొస్తాను" అన్నాడు. మూడు రోజుల తరువాత గతంలో రాసిన పాటకు ఇంకొక వర్షన్ రాసి తీసుకొచ్చాడు.

**"రెక్కలాడితె గాని – డొక్క నిండది మనకు**
**కాయకష్టం జేశ్నా – కడుపే నిండది మనకు**
**ఈ కామందుల పాలనలో – మన కడుపు నిండదిరా;**
**కత్తులు బట్టన్న – కదనమందు దూకన్న**
**వర్గ పోరాటంలో – కన్నెర్ర జెయ్యన్న**
**నీకడ్డ మొచ్చినోళ్ళను – నడ్డి విరగ దన్నన్నా;**
**ఆపుర రిక్షోడో – రిక్షెంట నేనొస్తా**
**నిలుపుర రిక్షోడో – రిక్ష మీద నేనొస్తా...."**

ఈసారి చప్పట్లు కొడుతూ, నవ్వుతూ 'బాగుంది' అన్నాన్నేను. కాని ఈ పాటలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుంది నేను" అన్నాను. **"ఇగో గిది నాతోటయింది. ఇగ ఇప్పుడు దీన్ని నీ ఇష్టమొచ్చినట్టు చేసుకో"** అన్నాడు విఠల్‌బాబు. తరువాత కాలంలో కొత్తబస్తీలో, మరికొన్ని చోట్లల్ల సాంస్కృతిక ప్రదర్శనలిచ్చినప్పుడు విఠల్‌బాబుతో ఈ పాట పాడించాము. ప్రజలు ఈ పాట విని బాగా స్పందించారు. ఇంకొంత కాలానికి 'ఆర్టలవర్స్'లో ఈ పాటని ఏ పత్రికకైనా పంపిస్తే బాగుంటుంది అన్న చర్చ వచ్చింది. కవి పేరుతో కాకుండా కలం పేరుతో పంపడం మంచిదని ఒకరు సూచించారు. అందరూ దానికి సరేనన్నారు. ఇక కలం పేరు గురించి చర్చ... రకరకాల పేర్లు సూచించారు సభ్యులు... భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, చిట్టగాంగ్ వీరులు, గదర్ వీరులు..మొదలైనవి... అయితే గదర్‌ని



గద్దర్‌గా మార్చి, విఠల్‌బాబుని వి.బిగా మార్చి, అంతిమంగా విఠల్‌బాబు పేరును వి.బి గద్దర్‌గా మార్చి ఆ పాటను పిలుపు పక్ష పత్రికకు పంపడం జరిగింది. అది అతి త్వరలోనే పిలుపు పత్రికలో ప్రచురింపబడ్డది. కాని ఆ పాట ప్రచురింపబడ్డ వారం రోజులు తిరక్కుండానే ప్రభుత్వం దాన్ని నిషేధించింది. ఆలోగానే ఆ పాట అల్వాల్ చుట్టుపక్కల ప్రాంతంలో చాలా ప్రచారంలోకి వచ్చింది.

ఇక అప్పటి నుండి మరో దశాబ్దం వరకు గద్దర్ పాటలు రాయడం నేను వాటిని ఎడిట్ చేసి ప్రజలలోకి ప్రవేశ పెట్టడం పరిపాటయి పోయింది. 'ఆర్టలవర్స్'లోని ఇతర సభ్యులు కూడా అదే ధోరణిలో పాటలు, రూపకాలు, ఇతర కళా రూపాలు రాయడం, ప్రదర్శించడం ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాం. ఉత్తరోత్తర 'ఆర్టలవర్స్' జన నాట్య మండలిగా రూపాంతరం చెందింది. గత ఐదు దశాబ్దాలుగా గద్దర్ తన పాట, ఆటతో తెలుగు ప్రజలనే కాదు, మన దేశ ప్రజలను కూడా సమ్మోహితులను చేసి, ప్రజల ఆదర అభిమానాలను చూరగొన్నాడు. గొప్ప ప్రజా గాయకుడైన గద్దర్ అజరామరుడు. అతడి సాహిత్యం అజరామరం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (10) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# అమ్మ ఒడిలోని పసిపాప నవ్వు గద్దర్ పాట

**గోరటి వెంకన్న,** శాసనమండలి సభ్యులు, తెలంగాణ రాష్ట్రం, ఫోన్ : 9985872285



పాట తొలి సాహిత్య ప్రక్రియ. గేయం, గీతం, కీర్తన, పాట వేర్వేరు అనిపించినా పాదు ఒక్కటే. విమర్శకులు పాటకు సాహితీ గౌరవాన్ని ఏనాడో కల్పించారు. పాట్టికైనా, పద్యానికైనా, ఛందోబద్ధ గేయానికైనా "లయ" ప్రాథమిక లక్షణం. ఛందస్సుకు సంబంధించిన మౌలికాంశాలన్నీ పాట నుండి జనించినవే. తర్వాత విస్తృతి నొందవచ్చు.

ఈ స్థావర జంగమాత్మక జగత్తులో జరిగే ప్రతి ప్రాకృతిక చర్యలో క్రమబద్ధమైన శబ్దం జనిస్తుంది. శబ్దం కొందరు ప్రణవనాదం అంటారు. యోగులు, మత ప్రవక్తలు ఓంకారం, ఆదిధ్వని నాదం అని కూడా పేర్కొన్నారు. ఆదిమ మానవుడు(ని) తొలికేక నుండి నేటి ఆధునిక వచనం – గానం వరకు పాట ప్రవాహం సాగుతూనే ఉన్నది. ఈ పాటను విశ్వ వేదికపై ఎందరో గొంతెత్తినా ప్రజా యుద్ధనౌక గద్దరన్న స్థానం విశిష్ఠమైనది.

భారతీయ సాహిత్యంలో కబీరు, తులసీదాస్, నామదేవ్, తుకారాం, ఏక్‌నాథ్ మహారాజు, అక్క మహాదేవి, అల్లమప్రభు, దాసమదు, తెలుగునాట అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం, గురజాడ, దున్న ఇద్దాసు, గరిమెళ్ళ, దాశరథి వంటి సర్వజ్ఞులు ఈ గమనంలో సాగినవాళ్ళే. గద్దరన్న కంటే ముందు నాజర్, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, తిరునగరి రామాంజనేయులు, సుంకర, కర్నాటి లక్ష్మీనర్సయ్య వంటి ఎందరో పాటను ప్రజాహితం కోసం శక్తివంతంగా గానం చేసినవాళ్ళే. గద్దరన్నకు నాజర్‌తో సమానమైన గాత్రం వరం. స్వతఃసిద్ధంగా గ్రామీణ కళల సారం మెరిగినవాడు. తన సృజనాత్మకత ప్రదర్శనలో అత్యున్నత ప్రమాణాలను అందించిన వాడు. ఏ ప్రజా కవులకైనా మౌఖిక వారసత్వమే కుదురు. అధిపత్యాలను నిరసించి, ఎదురించే ప్రజా ఉద్యమాల కొనసాగింపు వల్ల పాటకు మరింత జీవశక్తి అబ్బింది.

తెలంగాణా సాయుధ పోరాటంలో ప్రజా నాట్య మండలి పాదుకొల్పిన దారిని వేగవంతం చేసిన మహా కళాకారుడు, మహాకవి గద్దర్.

సాంప్రదాయ మార్గ కవితా ప్రభావాలేం లేకుండా ప్రజల దేశీ జాను తెనుగులో, జానపదంలో పుట్టిన కవన గీతిక గద్దర్.

ఆదివాసీ నిదురలోని పలవరింత గద్దర్ పాట.

అమ్మఒడిలోని పసిపాప నవ్వు గద్దర్ పాట.

కమ్మరి కొలిమిలో ఎగిసే నిప్పు రవ్వల కోలాటం గద్దర్ పాట.

చింతచెట్టు రాల్చే రెక్కలు లేని పగటి మిణుగురు పూత గద్దర్ రాత.

ఒక్కోమారు ఉప్పెన ఉరుము, ఒకమారు సెలయేటి పరుగు కలబోసుకున్న ప్రవాహం గద్దర్.

దీపారాధనకు నోచుకోని పాత గుడి రాతి కొప్పున మొలిచిన రావి ఆకుల శబ్దములా జ్ఞానబోధ చేసుంటుంది. అట 'యోగి'ని మరిపించే రూపం గద్దర్.

కల్మషం లేని నవ్వు గద్దర్. కొమ్మల పైనుండి అలరించే పక్షుల కిలకిల గద్దర్ పదాల కళ.

అమాస చీకటిలో ఎవరూ లేని దీనురాలి నల్లతుమ్మ కింది శోకధార గద్దర్ కవనధార.

పునాస కార్తెలో నాగలి కర్రు గాయానికి విలపించే అరకటెద్దు మూగజీవి గోస గద్దర్ పాట.

ఇలా ఎన్ని విశేషణాలైనా, ఉపమానాలైనా గద్దర్ పాటకు సరిపోవు.

కుంచి పేలికలు కట్టి కూలికి పోయిన తల్లి లచ్చుమమ్మ బతుకు యాత్రకు అక్షరాలను పొదగడం తెల్సిన ఎర్రపూలకోడి పొదుగు గద్దర్.

పొడిబారిన పెదవులలో పగిలిపోయిన వెన్నెల శకలాలను కాంచినవాడు గద్దర్.

గ్యాంగోళ్ళ బతుకును రైలుపట్టాల నునుపును అక్షరీకరించిన వాడు గద్దర్.

షియా ముస్లిములు, సాధువులు మొహర్రంపు విషాద వారాలలో తమను తాము గాయపర్చుకుని శోకించే పీరీల రాగం గద్దర్.

అలాగు(హు)లో ఎగిసే నిప్పుల జ్వాల, శివరాత్రి ఆరాధనలో ఎగిసే వీరశైవుల అగ్ని గుండాలు, వీర వైష్ణవ రేచర్ల కన్నముని ఖడ్గ విన్యాసాలన్నీ కలిపితే గద్దర్ పాట.

**అన్ని శ్రేణుల కష్టజీవుల కన్నీటి 5 దశాబ్దాలు నిరంతరాయంగా గానం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్.**

**జన జీవితాన్ని లిపిబద్ధం చేసిన ఆధునిక తాళపత్రపు కవిలెకట్టి గద్దర్.**

**అమెరికా సామ్రాజ్య వాదాన్ని, అరిగోస పెట్టే భూస్వామ్యాన్ని ఏక కాలంలో ఎండగట్టిన వాడు గద్దర్.**

**బుద్ధ భగవానుడు, మార్క్స్ మహాశయుల కలగలసిన తత్వం గద్దర్.**

తన చూపు విలక్షణమైనది. ఆ చూపు నుండి ఏదీ తప్పించుకోలేదు. కల్లుముంత నుంచి కలర్ టి.వి దాకా, తానెంత గొప్ప కవో తనకే తెలియని సాధారణత్వాన్ని నిలుపుకున్న సృజనకారుడు. ఎన్.టి. రామారావు ఏ పాత్రలో అయినా ఒదిగిపోయినట్టు గద్దరన్న ప్రతి పాటలో తన ముద్ర నిలుపుకున్నాడు. రాజకీయ నేతను, పాలకుల దుర్నీతిని, చివరకు తనపైనే గన్నులెక్కుపెట్టిన పోలీసుల అవస్థలను గానం చేసినవాడు. వ్యక్తిగత వైరం లేనివాడు. అంగుళీమాలున్ని బుద్ధ భగవానుడు మార్చినట్టు ఓర్పు కలిగినవాడు. సిలువ వేసే వారిని సైతం క్షమించమని ప్రార్థించిన క్రీస్తు కరుణను నిలుపుకున్నవాడు. ఒక రూపంలో మహా తత్వవేత్త. జీవితపు క్రీడలో శిశువు. అందరికీ దగ్గరే, అందరికీ పడమే. ఎవరికి గాయమైనా విలవిలలాడే మనసున్న వాడు. అలంకార శాస్త్రాలపై ఏ మక్కువ లేనివాడు. పాటకు అద్భుత అలంకారాలను అద్దినవాడు. తానే ఓ అలంకారమై భాసిల్లిన వాడు. ప్రతి అంశాన్ని కవితామయం చేసి పల్కిన కాలజ్ఞాని. తన ముందు కవులకు దోసిలొగ్గిన వాడు. కాని అంతకంటే జానపదులకు తలవొంచిన వాడు. అందుకే ఆ పాటలో అంత కొత్తదనం, ఏ పాటకాపాట ఒక కళాఖండం. ఎక్కడా పునరుక్తి ఉండదు. వాడీ, వాడీ అరిగిపోయిన పద ప్రయోగాలుండవు.

**"నేను చదవకుంటే ఇంకా బాగా రాసేవాడినేమో అంటాడు"** చలం. గద్దరన్న చదవకుండా లేడు కానీ ఆ చదువునే మోసుకు రాకుండా బతుకు నుండి తీసుకు వచ్చిన భాషతో పదములల్లిన పాటల చెలిమె గద్దర్. రేపటికి చింతలేని బాటసారి తను. ఓడి గెలిచిన వాడు గద్దర్.

రేపటికి చింతలేని బాటసారి తను. ఓడి గెలిచినవాడు గద్దర్. ఓడడానికి సిద్ధపడ్డవాడు. నిందలను ఆనందంగా వరించినవాడు. మెప్పులెన్ని వున్నా పొంగిపోనివాడు. తప్పులెత్తి చూపితే సహించినవాడు. కవీ – కళాకారుడై వుండి తన స్వప్న ప్రపంచంలోనే అంతర్ముఖుడై వుండవలసినవాడు. అన్నిటినీ తలపై వేసుకొని లేని తప్పులకు శిక్షను అనుభవించినవాడు. తరగని గనిలాంటి తనపై చిల్లర రాళ్ళు విసిరితే మౌనంగా భరించినవాడు. ప్రజాయుద్ధంలో కాలు మోపినా, తలలో బుద్ధ భగవానున్ని జీవితమంతా మోసినవాడు. రామానుజుని విగ్రహం ఎవరు, ఏ ప్రయోజనాలకు నిలిపినా అలనాటి



ధనుర్దాసులా వెళ్ళి అతని పాదాల కడ శిరసు వంచి మోకరిల్లిన వాడు. అంటరాని వారికి అష్టాక్షరీ మంత్రోపదేశంతో పాటు అక్షరము ఇచ్చి అక్కున చేర్చుకున్న విశిష్టాద్వైతం ముందు వినమ్రంగా చేతులు జోడించిన వాడు. కానీ, మనువు క్రూర శాసనాలపై కడదాకా నిరసించినవాడు. భక్తికీ, జీవన్ముక్తికీ, సమతా దీప్తికీ జేజేలు పలికినవాడు. చివరిదశలో భారతీయ యోగులు ప్రబోధించిన నిరాకార, నిర్గుణ తత్వానికి, దానికి ఆలంబన అయిన బుద్ధ భగవానుని శరణాగతి అన్నవాడు. భయమెరుగని యోధుడు. మరణ ఘడియలో సైతం నవ్వే సోక్రటీసు రూపం. కులాలకు, మతాలకు, సరిహద్దులకూ అతీతమైన పూర్ణ మానవుడు గద్దర్.

వ్యక్తిగతంగా గద్దరన్న ప్రభావం చేతనే వచన కవితా ఓనమాలు దిద్దుకుంటున్న నేను పాటవైపు వచ్చాను. గురు దేవులకు ఏకలవ్య శిష్యుడనైన నేను గద్దరన్న తోవలో ప్రజా కవిత్వ దారికి వచ్చాను. పాట వైపు నన్ను మలిపింది గద్దరన్ననే. 36 ఏళ్ళ కిందనే పేరు, ఊరు లేని రోజుల్లోనే నా పాటల క్యాసెట్టుకు వ్యాఖ్యానం చెప్పి నన్ను ఎదపై ఎత్తుకున్నవాడు. ఆకలైనప్పుడు అన్నమైన వాడు, కళ్ళు తడిసినప్పుడు తుడిసిన వాడు. అన్న లేని నాకు తానే అన్న. ఇది వ్యక్తిగతం. అది మొదలెడితే ఒక రచనా సంపుటమవుతుంది. దాని విస్తారం నిడివి సరిపోదు. దానిని ఆపుతూ.... ఒక వేమన, శ్రీశ్రీ, జాషువా, శివసాగర్, గద్దర్ వీరి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారి వరుసలో గద్దరన్న ఉంటాడు.



# కుల – వర్గ జమిలి పోరాటాల సాంస్కృతిక పతాకై ఎగురుతున్న ప్రజావాగ్గేయకారుడు – గద్దర్

**విమలక్క**, గౌరవాధ్యక్షురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, తెలుగు రాష్ట్రాలు. ఫోన్ : 8886841280



అమెరికాకు పాల్ రాబ్సన్ పేరు విశ్వవ్యాపితమైనట్టు భారతదేశానికి గద్దర్ చిరునామా కావడం యాదృచ్ఛిక పరిణామం కాదు. తెలంగాణలోని తూప్రాన్ గ్రామంలో పుట్టిన గద్దర్ వాగ్గేయకారుడిగా, అంతకుమించి ఒక విప్లవ తుఫాన్‌గా సృష్టించిన ప్రభంజనం ఎలాంటిదో ఆయన అంతిమయాత్రలో తెలుగు ప్రజలు ప్రత్యక్షంగా, దేశ ప్రజలు పరోక్షంగా వీక్షించారు. అంటరాని కులంలో గుమ్మడి శేషయ్య–లచ్చుమమ్మలకు పుట్టిన గుమ్మడి విఠల్ గద్దర్‌గా రూపొందిన గుణాత్మక మార్పుకు ఇది తార్కాణం. ఆగస్టు 6 నాడు తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో మేధావి పాత్ర పోషించిన జయశంకర్ సార్ 89వ జయంతి సభలో నేను మా అరుణోదయ బృందం నిమగ్నమై ఉన్న సందర్భంలో గద్దర్ మరణ వార్త ఒకటి పిడుగుపాటులాగా వినిపించింది. హుటాహుటిన అమీర్‌పేట అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ కు వెళ్లి కుటుంబ సభ్యుల తర్వాత ఆయన పార్థివ దేహాన్ని దర్శించి తాకిన తొలి సాంస్కృతిక ఉద్యమ కుటుంబ సభ్యురాలిగా నిలిచానని గర్వంగా చెప్పగలను. అయితే అనూహ్యమైన ఈ పరిణామానికి కన్నీటి పర్యంతమై, రాత్రికి రాత్రే ఆయనపై కామ్రేడ్ మిత్ర రాసిన పాటను రికార్డు చేసే సమయం మినహా ఎక్కువగా పార్థివదేహంతోనే సమయంతా గడిపాను. జనసంద్రం లాగా మారిన ఆయన అంతిమయాత్ర వెంట ఉండి ప్రజల దుఃఖం, ఉద్వేగం, ఆవేశం, ఆవేదన, ఆటా–పాటా అన్నీ ప్రత్యక్షంగా గమనించాను. చివరగా గద్దర్ చిరకాల మిత్రుడు, ప్రజా ఉద్యమ సన్నిహితుడిగా గద్దర్ పార్థివ దేహం వెంట వచ్చిన సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ సంపాదకులు జహీరుద్దీన్ అలీఖాన్ గుండె నొప్పితో గద్దర్ స్వగృహం వద్దే కుప్పకూలడం, తొక్కిసలాటలో ప్రాణ రక్షణ కోసం అంతా పరిగెత్తడం లాంటి ఎన్నో ఘటనలను ఎదుర్కొంటూ, **"పాటకు లేదు మరణం – నీ ఆటకు లేదు మరణం"**అంటూ పాడుకుంటూ గడిపాను. వెల్లివిరిసిన ఈ ప్రజాస్పందనలో పాలక పార్టీల కోణం, ఉద్యమ కోణం రెండూ కనిపించినా ప్రజలకోణమే ప్రధానాంశం. విప్లవ సాంస్కృతిక ఉద్యమం పండితులను, పామరులను మెప్పించిం దనడానికిది నిదర్శనం. అయితే 40 ఏళ్ల పాటు విప్లవ సాంస్కృతిక సేనానిగా, ఆ తరువాత ఒక ప్రజాస్వామికవాదిగా ఆయన పదేళ్ల ప్రయాణాన్ని నెమరేసుకుంటూ పోరాటం–పాట, పాట–పోరాటం అంటూ సాగిన జుగల్ బందీని ఆయన నుండి స్వీకరిస్తాను. ప్రతి మనిషిలో మంచి–చెడు ఉన్నట్టు గద్దర్ నుండి కూడా మనం నేర్చుకునే పాఠాలు–గుణపాఠాలు రెండూ ఉంటాయి. ఈ సందర్భంగా కుల–వర్గ సాంస్కృతిక పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే గద్దర్‌కు నిజమైన నివాళి.

### గద్దరన్నతో పరిచయం

వెన్నులో తూటాతో, వెనకడుగులేని పోరాట పటిమతో, మట్టి వాసనల జీర గొంతుతో సాగిన గద్దర్ పాటతో, ఆయన పోరాట ప్రయాణంతో ఇప్పుడు పోల్చదగిన వాళ్లెవరం తెలుగు నేలలో లేము. నేను వయసులో అన్న కంటే దాదాపు 15 సంవత్సరాలు చిన్నదాన్నయినప్పటికీ, మా తండ్రి కామ్రేడ్ బంద్రు నరసింహులు వేలు పట్టుకొని బాల్యంలోనే ప్రారంభమైన నా పాటల ప్రయాణానికి దాదాపు 50 ఏళ్లు నిండాయి. కామ్రేడ్ గద్దర్ బ్యాంకులో ఉద్యోగం ప్రారంభించినట్టి భువనగిరిలోనే డిగ్రీ కళాశాల సాంస్కృతిక కార్యదర్శిగా ఎన్నికైన నాకు చిన్నతనం నుండి గద్దర్ పాటల పరిచయంతో పాటు నాపై వాటి ప్రభావం కూడా ఉంది. మా ఇరువురి గాత్రాలకు పూర్తి సారూప్యత లేకున్నా గద్దర్ పాటలెన్నో నేను పాడాను. అభినయం నేర్చుకున్నాను. ప్రత్యేకించి అనేక సభల ముగింపుల్లో **"ఆగదు ఆగదు ఆగదు – ఈ ఆకలి పోరు ఆగదు"** అనే పాట అభినయంతో పాడడం తప్పనిసరిగా సాగేది. అలాగే ఆహార్యం, అభినయంలో అరుణోదయపై గద్దర్ ప్రభావం ఉందని చెప్పక తప్పదు. గద్దర్ అయినా, మేమైనా రెండు ఉద్యమాలు పరస్పరం నేర్చుకునే అంశాలు చాలా ఉంటాయి. ఆ విధంగా భువనగిరిలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న కాలం నుండి మొదలైన గద్దరన్న పరిచయం, విప్లవ సాంస్కృతికోద్యమం పొడవునా కొనసాగింది. పరిచయం అంటే పరస్పరం నేర్చుకొనే ప్రక్రియ ఇది.

**గద్దరన్నతో ప్రయాణం**

గోదావరిలోయ విప్లవ స్రవంతిలో నాకు గురుతుల్యులైన కానూరు వెంకటేశ్వరరావు, రామారావులతో ప్రతి ఏటా విరసం సభల్లో జననాట్యమండలి, అరుణోదయలు కలిసి ఒకే వేదిక మీద ప్రదర్శనలిచ్చేవాళ్లం. ఇదే విరసం సభల్లో మా వైపు నుంచి హెచ్చార్కే, జయక్క, కాశీపతి, నమ్ము, రత్నమాల, పెద్ద విమలక్క, నారాయణస్వామి, సుధాకిరణ్ తదితరులు పాల్గొనేవారు. వీళ్ళతో కలిసి నేను పాల్గొన్నాను. ఇప్పటికీ అరుణోదయ బృందంతో నేను విరసం సభల్లో పాల్గొంటూనే ఉన్నాను. ఇప్పుడు అరుణోదయ కూడా ప్రజా కవులను వాగ్గేయకారులను తయారుచేస్తూంది.

ఆ విధంగా ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత అనేక ఉద్యమ వేదికల్లోనూ కలిసి పనిచేయడం జరుగుతూనే వచ్చింది. ఇవి రెండూ వేర్వేరు విప్లవ స్రవంతులకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున వీటి మధ్య తెలియకుండానే ఒక ఆరోగ్యకరమైన పోటీ కొనసాగేది. సమాజంలో పాతుకుపోయిన సాంప్రదాయిక భావజాలం, కుల వివక్ష, లింగ వివక్షత లను ఎదుర్కొంటూ, విప్లవ సాంస్కృతికోద్యమంలోనూ వాటి ప్రభావాన్ని తట్టుకొని యావత్ సమాజాన్ని మెప్పించే కళాకారులుగా, ప్రజా కళాకారులుగా ఎదగడం సాధారణ విషయం కాదు. జానపద పరిశోధకులు విశ్రాంత ఆచార్యులు జయధీర్ తిరుమలరావు గద్దర్ పైన విశ్లేషణ చేయడం, మరో విశ్రాంత ఆచార్యులు కంచె ఐలయ్య గద్దర్ లచ్చుమమ్మ పాటలను ఆంగ్లంలోనికి అనువదించడం లాంటి పరిణామాలు గద్దర్‌లోని నిగూఢమైన శక్తిని, అతని ప్రత్యేకతని లోకానికి మరింతగా పరిచయం చేశాయి. ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావుతో కలిసి ఆర్ట్ లవర్స్‌గా ప్రారంభమైన గద్దర్ సాంస్కృతిక ప్రస్థానం యుద్ధనౌకగా స్థిరపడడానికి విప్లవోద్యమం యొక్క ప్రతి మూలమలుపులో ఆయన కలం-గళం కొనసాగడం ఉంది. అంతకుమించిన కాయ కష్టం దాగి ఉంది. ప్రత్యేకించి 1992 తర్వాత గద్దర్ సాగుతున్న విప్లవ స్రవంతి పీపుల్స్‌వార్ పార్టీ, కొన్ని ప్రజా సంఘాలు నిషేధాలకు గురైనాయి. కాగితాలపై నిషేధాలు లేకున్నా జననాట్యమండలిపై 1985, 1992 సందర్భాల్లో అప్రకటిత నిషేధాలు కొనసాగాయి. ఆ తరువాత ఒక సాంస్కృతిక సంఘంగా JNM నిషేధించబడ్డ తర్వాత కూడా గద్దర్‌కున్న గుర్తింపు, ఆయన శక్తి తానే ఒక సంస్థ అన్నంత ప్రభావాన్ని, కలిగించాయి. కానీ జననాట్యమండలి లేకుండా గద్దర్ లేడని ఎన్నోసార్లు ఆయనే వినమ్రంగా ప్రకటించాడు. అందుకే విప్లవోద్యమంతో పాటు గద్దర్ కూడా రాజ్యానికి టార్గెట్‌గా మారాడు. ప్రత్యేకించి ఎన్‌కౌంటర్‌లో నేలరాలిన వారి పార్థివదేహాలను బంధువులకప్పగించడం, ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన వారిపై పోరాట ప్రజల్లో నెలకొన్న సానుభూతి విప్లవోద్యమాన్ని సజీవం చేశాయి. దానికి తోడు అలాంటి ఎందరో బిడ్డలను - వారి తల్లులను - ఆలు పిల్లలను ప్రత్యక్షంగా



చూసి తన పాటతో కూడా ప్రాణం బోసే ప్రయత్నం చేశారు. ఎర్రజెండాను పసిగుడ్డుగా, వీర యోధులుగా గుండెలకు అద్దుకుంటూ చేసిన ప్రదర్శన సజీవ అమరచిత్రణ (fiction). అది ప్రజలపై చెరగని ముద్ర వేయడం ఒక వంతయితే, మృతదేహాల స్వాధీనంతో ప్రజల్లో ఏర్పడ్డ భౌతిక స్పర్శ, పాటతో ఏర్పడ్డ బౌద్ధిక చలనం గద్దర్‌ను భౌతికంగా నిర్మూలించడానికి కూడా దారితీస్తుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. శరీరంలో తూటాలు దిగిన తరువాత ఆయన జీవిత కాలంలో అది రెండో ప్రస్థానంగానే మనం చూడొచ్చు. ఉద్యమం అందించిన అతి కొద్దిమంది వాగ్గేయకారులలో గద్దరొక్కడే యుద్ధ నౌకగా పేరొందడంలో ఇలాంటి అనేక కారణాలున్నాయి. గద్దర్ పైన సమగ్ర విశ్లేషణలు రావాల్సి ఉన్నా ఆయనతో ఉన్న విప్లవ అనుబంధానికే నేను పరిమితం అవుతాను.

గద్దర్ పైన జరిగిన కాల్పుల సందర్భంలో ఆ దాడికి నిరసనగా జరిగే ఆందోళనలో అరుణోదయగా నేను చురుకైన పాత్ర వహించాను. నేరస్థులెవరో తేల్చడానికి ప్రతి ఏటా ఏప్రిల్ 6న నిర్వహించే పలు నిరసన కార్యక్రమాలు కొన్నింట్లో భాగమయ్యాను. ఆ సమయంలో కామ్రేడ్ మిత్ర రాసిన **"కైగట్టి పాడుతుంటే కత్తి గొంతు మీదనో / గజ్జె కట్టి ఆడుతుంటే గన్నులెక్కిపెట్టిరో / గండాలు సృష్టించే గుండాల రాజ్యంలో / మండేటి కొలిమిలో గుండె మంట ఆగదో"** అంటూ పలు వేదికల్లో పాడాను. అయితే పాటలను గ్రంథస్థం చేయడమే గాకుండా డప్పు, డోలు, గజ్జెలతో రికార్డు చేయడమనే సంప్రదాయం కూడా జేఎన్‌ఎంతో ప్రారంభమైందని చెప్పవచ్చు. అది మేము కొనసాగించి స్టూడియోలో కూడా అరుణోదయ పాటలు రికార్డు చేశాము. కొన్ని వందల పాటలు రికార్డెడ్‌గా ఉండడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుకోవడానికి, చివరికి ఎలక్ట్రానిక్ మీడియాలోనూ పాటను ప్రజల దగ్గరికి చేర్చడం గద్దర్ ప్రారంభించిన ఒరవడే అని చెప్పవచ్చు.

**"మీ పాటనై వస్తున్నానమ్మో"** అంటూ టీవీ-5 లో గద్దర్ కొన్ని ఎపిసోడ్లు చేసిన తర్వాత నన్ను కూడా చేయమని కోరితే **"వస్తున్నా మీ పోరు పాటనై"** అంటూ నేనొక 75 ఎపిసోడ్లు చేశాను. పాలకుల

ప్రత్యక్ష, పరోక్ష ఒత్తిడిల తర్వాత ఇది ఆగిపోయింది. పాపులర్ మాధ్యమంగా ఉన్న సినిమా రంగంలో మాభూమి నర్సింగరావుతో గద్దర్ చేసిన ప్రయాణం **"తెలంగాణ సాయుధ పోరాటాన్ని"** నిత్య నూతనం చేసింది. ప్రజానాట్యమండలికి విప్లవాత్మక కొనసాగింపుగా జననాట్యమండలి, అరుణోదయలు ముందుకు వచ్చినప్పటికీ నాటి బండి యాదగిరి రాసిన **"బండెనుక బండి కట్టి / పదహారు బండ్లు గట్టి / ఏ బండ్లో పోతవు కొడుకో / నైజాము సర్కరోడా"** అనే పాట గద్దర్ పాడి దాన్ని అజరామరం చేశారు. చెరబండ రాజు **"ఒడ్డెరోల్లమండి మేము / ఇన్నాళ్లు గుడ్డిగా బతికినా ఎడ్డోల్లం"** అనే పాటైనా, గూడ అంజన్న మార్చింగ్ సాంగ్ **"ఊరుమనదిరా ఈ వాడ మనదిరా"** అనే పాట గానీ, **"భద్రం కొడుకో–కొడుకో కొమురన్న"** అనే పాట గానీ గద్దర్ గొంతులో ఇమిడిపోయాయి. అలాగే గూడ అంజన్న రాసిన **"అసలేటి వానల్లో ముసలెడ్ల గట్టుకుని మోకాటి మట్టుకు బురదలో దిగబడితే/ గరిసెలెవరియి నిండెరో గంగన్నా/ గుమ్ములెవరివి నిండెరో"; "ఊరిడ్సి నేబోదునా/అయ్యో ఉరి బోసుకొని సద్దునా"** అనే పాటలు గద్దర్, నేను కూడా పాడాము. అవి కొన్ని సినిమాల్లో కూడా పాడాము. సార్వజనీనమైన ఎన్నో పాటలు గద్దర్ భవిష్యత్తరాలకు నిల్వచేసి ఉంచారు. నిన్నటి తెలంగాణ సాయుధ పోరాట పాట, నేటి విప్లవోద్యమ పాట, రేపటి విజయ గీతంగా నిలుస్తాయని కామ్రేడ్ మిత్ర తన స్పందనలో **"నిన్నటి–నేటి–రేపటి ఉదయిక"** అంటూ గద్దర్ పై స్మృతి గీతంలో ముక్తాయించాడు.

### కులనిర్మూలనా పోరాట స్ఫూర్తి – దళితోద్యమం

కామ్రేడ్ జార్జిరెడ్డి హత్యగావించబడిన దినం, డా॥ బాబాసాహెబ్ జన్మదినం ఏప్రిల్ 14 రోజే గావడంతో ఇద్దరిని ఏకకాలంలో స్మరించుకోవడం ఎలా అనే మీమాంస డా॥ బాబాసాహెబ్, జ్యోతిరావు పూలేలను సామాజిక విప్లవకారులుగా గుర్తించడంతో కొంత పరిష్కారమైంది. 1985 కారంచేడు ఘటన నుండి దళితుల ఆత్మగౌరవోద్యమంలో ఇరు సంస్థలం పాల్గొనేవాళ్ళం. కారంచేడుపై గద్దర్ బృందం కళారూపం రూపొందించింది. మేము కారంచేడు, లక్ష్మీపురం, చుండూరుల పై పాటలతో పాటు అంబేద్కర్, పూలే, సావిత్రీ బాయి, గాడ్గే బాబాలతో పాటు, కుల హక్కులపై అనేక పాటలు రూపొందించాం. చుండూరు తీర్పుపై **'దళిత జన ధర్మాగ్రహం'** అంటూ మిత్ర రాసిన నృత్య నాటిక ప్రదర్శించాము. ప్రతి ఏటా హైద్రాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం దగ్గర గద్దర్, మేము తప్పక కలిసేది. అలాగే ఇటీవల అనేక గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభల్లో ఒకే వేదికను పంచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కులవాడలు – వెలివాడల గురించి గద్దర్ సాంస్కృతిక విశ్లేషణ అద్భుతంగా ఉంటుంది. ఇటీవల బహుజన బతుకమ్మను మేము వెలివాడల నుండి ప్రారంభిస్తూ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాట పిలుపునిచ్చాము. మా పిలుపుల్లో వెలివాడలు కాదు – తొలివాడలని ప్రకటించాము. అందుకేనేమో బహుజన బతుకమ్మ పట్ల గద్దర్ పాజిటివ్ స్పందనలు మాకు వినవచ్చినాయి. నిర్దిష్ట కుల నిర్మూలన కార్యక్రమాన్ని సాంస్కృతికోద్యమంలో విప్లవానంతరం కూడా కొనసాగించాల్సినంత తీవ్రంగా ఉంది. అంటరానితనం, అవమానాలను జన్మతః అనుభవిస్తున్న గద్దర్ నిష్క్రమణానంతరం, కుల నిర్మూలనా శక్తులను వేళ్ళపైనే లెక్కబెట్టుకోవాలేమో! మన దేశ ప్రత్యేక విలక్షణ లక్షణమైన (Unique feature) కులాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని విప్లవ స్రవంతుల్లో జరిగిన చర్చ కుల నిర్మూలనా పోరాటాల ప్రతిబింబం మాత్రమే. కావున కుల–వర్గ నిర్మూలనా పోరాట స్ఫూర్తిని గద్దర్ నుండి, ఆయన రచనలనుండి ప్రత్యేక అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని, బాధ్యతను గద్దరన్న మన భుజాలపై మోపి వెళ్ళాడు. అందుకే కుల పీడన – వర్గ పీడన నుండి విముక్తమయ్యే జమిలి కర్తవ్యాలు దళితోద్యమం గద్దర్ నుండి సంగ్రహిస్తుందని ఆశిద్దాం. దఫోడం ఏర్పాటు అనేది కూడా విప్లవ సాంస్కృతికోద్యమానికి కొత్త శక్తినిచ్చిందనేది కూడా వాస్తవం.

### మలిదశ తెలంగాణ ఉద్యమ గీతాలాపన

మలిదశ తెలంగాణ ఉద్యమానికి గీటురాయిగా నిలిచిన వరంగల్ డిక్లరేషన్‌లో భాగస్వామిగా గద్దర్ చాలా ముందుగా **"అమ్మా తెలంగాణమా – ఆకలి కేకల గానమా"** అంటూ రాయగలిగాడు. ప్రాంతీయ ప్రజాస్వామ్య ఆకాంక్షలతో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భావ ప్రచారంలో ఉపాధ్యాయులు, జన సమీకరణలో కళాకారులు, ఉద్యమంలో సకలజనులు పాత్ర వహించారు. రెండు విప్లవ స్రవంతుల ప్రధాన పాత్రలో అటు టి.పి.ఎఫ్ తెలంగాణ డిక్లరేషన్ వెలువడగా తెలంగాణ ఐక్యవేదికగా మేము లక్ష మందితో వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభ జరపడం ప్రత్యేకత. ఈ ఉద్యమంలో సాంస్కృతికోద్యమ నాయకులుగా అటు గద్దర్ టీ.పీ.ఎఫ్ లోను, నేను టఫ్ లోను కీలకంగా ఉన్నాము. టఫ్ నిర్వహించిన మిలిటెంట్ పోరాటాల్లో సీమాంధ్ర అగ్రకుల భూస్వాముల అక్రమాస్తులను టార్గెట్ చేస్తూ ల్యాంకో హిల్స్, ఎమ్మార్ ప్రాపర్టీస్‌ల స్వాధీనం కోసం జరిగిన పోరాటంలో నేను నిర్వహించిన కీలక పాత్రను గద్దరన్న పరోక్షంగా కీర్తించాడు. ఒక ఆడపిల్ల చేసిన సాహసం మనం చేయలేకపోయామని గద్దర్ వాపోయినట్టు నాకు సమాచారం. నేను తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఆ తర్వాత 20 సంవత్సరాలు వందల వేల సభల్లో పాల్గొంటూ పాడిన పాటలను, శ్రమను గద్దర్ **"పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా"** అనే పాట సమానం చేసినట్లయింది. ఈ పోరాటం తెలంగాణ ధూంధాం ఆవిర్భవించడం ముఖ్యమైన పరిణామం.

అయితే రెండు స్రవంతుల సాంస్కృతికోద్యమ సారథులుగా, ఒకే తెలంగాణ పోరాట వేదికకై మేము చేసిన ప్రయత్నాలు ఒకే ఐక్యవేదిక ఏర్పాటు దాకా పోయి ఆగిపోయాయి. రాజ్యాంగ ప్రక్రియ ద్వారా

ఏర్పడే తెలంగాణలో ఎన్నికల్లో పాల్గొనే వాళ్లు కూడా భాగస్వామ్యం కావడానికి అవకాశం ఉండాలనే వాళ్లు కూడా ఉన్నారు. **"పోరాటాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమవుతుందని"** ఇరువురం విశ్వసించినా ఇందులో ఎన్నికల్లో పాల్గొంటామన్న వారికి కూడా మినహాయింపు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని సమర్థించినందుకు దీన్ని తప్పుగా చిత్రించి కొందరు నాపై వ్యక్తిగత దూషణలకు పూనుకున్నారు. దాంతో రసాభాసగా మారిన ఐక్యవేదిక ను పునరుద్ధరించడానికి నేను, హన్మాండ్లు సార్ గద్దర్ నివాసానికి వెళ్ళాం. అవమానాలు ఎదుర్కొంటూ కూడా గద్దర్ ను మా అభిప్రాయాల కనుగుణంగా ఒప్పించాం. కానీ ఒకసారి చారిత్రిక సయోధ్యను సాధించిన ఏకైక తెలంగాణ వేదిక అనే కల కలగానే మిగిలింది. ఒక సాంస్కృతిక యోధుడిగా మనకంటే ఉన్నత స్థాయిలో గద్దరుండటం సహజం. కానీ కళాకారులకు ఉండే సహజ ఉద్వేగం, ఉదారత్వంతో పాటు వ్యక్తిగతంగా గద్దర్ ఆలోచనలు అతన్ని సయోధ్య వైపు కదలించినా, ఏదో అపోహతో కూడిన ఆదేశం గద్దర్ ను వెనక్కి నెట్టింది. ఫలితంగా దశాబ్దాల పోరాటం, ఆరాటం అసమాన త్యాగాలతో సాధించిన తెలంగాణలో తొలి బాధితులుగా మేమే మిగలాల్సి వచ్చింది. అందుకేనేమో మళ్లీ సాంస్కృతిక ఐక్య ఉద్యమం గురించిన ఆలోచనలతో, అనారోగ్యపు బంధనాల్లో సతమతమవుతున్న అతని అంతరంగం నిమ్స్‌లో ఆపరేషన్‌కు ముందు గద్దర్‌ను కలిసినప్పుడు మా ముందు ఆవిష్కృతమైంది. తన అంతరంగాన్ని పూర్తిగా విప్పి చెప్పలేక **"బహుజన బతుకమ్మ"** లో పాల్గొందామని ధూంధాం వ్యవస్థాపక అధ్యక్షుడు అంతడ్పుల నాగరాజుతో సందేశం పంపాడు. దానికి ప్రతిబింబంగా చివరి రోజుల్లో ఎంతో ఆత్మీయంగా వ్యవహరించాడు. అంతేకాదు, నన్ను ఆదర్శంగా తీసుకొని సాగాలని గద్దరన్న తన కూతురు వెన్నెలతో అన్నట్లు ఆమెనే నాతో స్వయంగా చెప్పింది.

### శాంతి చర్చల్లో కల్సి పంచుకున్న వేదికలు

తెలుగు నేలపై జరిగిన మరొక చారిత్రక ఘట్టం నక్సలైట్లకు– ప్రభుత్వానికి మధ్య 2004 అక్టోబర్‌లో జరిగిన శాంతి చర్చలు. ఇందులో రెండు విప్లవ స్రవంతులు ఐక్యంగా ఉంటూ ఉమ్మడిగా ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగావడం అనేది చెప్పుకోదగ్గ అంశం. **"దున్నేవారికి భూమి - శాంతి - స్వావలంబన"** అనే అంశాల ప్రాతిపాదికన జరిగిన చర్చలను అరుణోదయ స్వాగతించి వీటిని ఊరువాడా రాష్ట్రమంతా ప్రచారం చేసింది. గద్దర్ శాంతి చర్చల మధ్యవర్తి బృందంలో సభ్యుడిగా ఉన్నప్పటికీ నిజాం కళాశాల, గుత్తికొండ బిలం, మణుగూరు, వేములవాడ, రుద్రారం, ఎనుమాముల (వరంగల్) తదితర అనేక సభల్లో కల్సుకుని ఒకే వేదికపై ఆడి పాడాము. లక్షలాది మంది పోరాట ప్రజల్లోకి శాంతి– పోరాటం సందేశాన్ని తీసుకుపోయినాము. ఈ సందర్భంగా గద్దర్



శాంతి చర్చల్లో నిమగ్నమై ఉండడంతో అమరుడు డప్పు రమేష్ తో కలిసి ప్రధానంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాము. శాంతి చర్చల వేదికలో ప్రభుత్వ ప్రతినిధుల కోరిక మేరకు గద్దర్ చర్చల టేబుల్ పైననే పాటలు పాడాడు. అదే ప్రతినిధి బృందంలో జనశక్తి తరుపున నాయకత్వం అందించిన అమర్ (మిత్ర) కూడా తను రాసిన పాట పాడాడు. ఆనాటి బూటకపు ఎన్‌కౌంటర్లను అభివర్ణిస్తూ నీళ్లకు బదులు తెలంగాణలో నెత్తురు పారుతుందని చెప్పే **"పాట పాటకు పరవశించి /అడవిలో నెమలి ఆడినట్లు / పైరగాలికి తలలు ఊపి / కొమ్మలు రెమ్మలు ఊగినట్లు / ఊగిరి ఉయ్యాలలు ముగ్గురు తమ్ములూ / పాడెర జంపాలలు చిన్ని చెల్లెలు"**అంటూ సాగే ఈ పాటను మణుగూరులో నేను, అమర్ ఇద్దరం కలిసి పాడాము. ఏదైనా శాంతి చర్చల సందర్భంగా దాదాపు ఏడాది పాటు సాగిన మా ఐక్య ప్రయాణం ప్రభుత్వమే ఉల్లంఘనలకు పాల్పడి నెత్తురుటేర్లు పారించే దాకా కొనసాగింది.

### రెండు పాయలు–ఏకమయ్యే దారులు

నక్సల్బరి వసంత మేఘగర్జనల ప్రేరణ శ్రీకాకుళం – గోదావరి లోయ పోరాటాల స్ఫూర్తితో 1972లో జననాట్యమండలి ఏర్పడితే, 1974లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ACF) ఏర్పడ్డది. వీటి రెండింటి అభివృద్ధి సిరిసిల్ల– జగిత్యాల రైతాంగ పోరాటాలతో, సింగరేణి ఉద్యమంతో, విప్లవ విద్యార్థి ఉద్యమాలతో, ఆదివాసి స్వయంపాలనా పోరాటాలతో, మహిళా హక్కుల, కుల నిర్మూలన ఉద్యమాలతో పునాది వర్గాలతో ముడివేసుకున్నాయి. ఈ ఉద్యమాల

ఉప ఫలితమే సాంస్కృతిక ఉద్యమం. అయితే ఆ విప్లవ సాంస్కృతికోద్యమాలు తిరిగి పునాది వర్గాల ఉద్యమాలకు దోహదపడ్తూ సాధికారతను కలిగిస్తున్నాయి. విద్యార్థి – యువశక్తులను ఆలోచింపజేస్తున్నాయి. అయితే దోపిడి వ్యవస్థను కాపాడేలా ఆ వ్యవస్థ కల్పించిన ఆచారాలు – సంప్రదాయాలు ఒక్కసారి ఉద్వేగపూరితమైన మత భావజాలాన్ని, కుల విభజనను, వస్తు వ్యామోహ భావాలను పరివ్యాప్తం చేస్తున్నాయి. దోపిడికి ఉక్కు కవచం లాగా పనిచేస్తున్నాయి.

అలాంటి సాంస్కృతిక సామ్రాజ్యవాదం – మతజాతీయవాదాల పేరిట కార్పోరేట్ల గుత్తాధిపత్యం పెరుగుతున్న కాలమిది. అయితే విప్లవోద్యమం సృష్టించుకున్న ఎంతోమంది పెన్ను–గన్ను పట్టుకున్న యోధుల త్యాగాలతో నిర్మాణమైన సుదీర్ఘ ప్రయాణంలో గద్దర్ రూపొందాడు. వ్యవస్థీకృతమైన వర్గ–కుల పీడనకు బాధితుడిగా, వాటిపై తిరగబడ్డ యోధుడిగా ఒక చారిత్రక పాత్రలోనే గద్దర్ పరిణామం జరిగింది. అది ప్రభుత్వాధికారాన్ని మించిన పీడిత ప్రజల రాజ్యాధికార భావనతో ముడివడినందున సుదీర్ఘకాలం రాజీ లేకుండా పయనించింది. ఆ ప్రయాణంలో ఆటుపోట్లు, విజయాలు–వైఫల్యాలు ఎన్ని ఉన్నా గద్దర్ నిర్వహించిన చారిత్రక పాత్రనుండే గుమ్మడి విఠల్, గద్దర్ గా పరిణామం చెందిన ప్రక్రియ కొనసాగింది. ఇందులో మేము ఐక్యంగా కలిసి నడిసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ అవి అంతిమంగా ఐక్యంగా నిలబడలేక తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటున్నాయి.

గద్దర్ తాను చివరి ఘడియల్లో ఎదుర్కొన్న అంతర్గత సంఘర్షణను ఆయనను దగ్గరగా చూసిన వాళ్లు మాత్రమే చెప్పగలరు. గద్దర్ తన జీవితకాలంలో తన యవ్వనం, మేధోశక్తి అంతా విప్లవోద్యమానికి అంకితం చేసి నైతిక విలువలతో జీవించాడు. పరిస్థితులకు తగ్గట్టు కొంతకాలం రహస్య జీవితంలో కూడా ఉన్నాడు. అక్రమ కేసులను ఎదుర్కొంటున్నాడు. తన జీవితకాలంలో తను కలలు కన్న వ్యవస్థను చూడలేకపోయాననే అన్న బాధతో పాటు, తాము సాధించిన విజయాలు కొంత తృప్తినిచ్చినట్లు ఉన్నాడు. దళితుల ఆత్మగౌరవం, గులాపోన్ని అంటూ బతికిన ఉత్పత్తి శక్తులు పొందిన స్వేచ్ఛ, పీడిత వర్గాలు



సెక్షన్ల స్వీయ విశ్వాసం సాధించుకున్న తృప్తి రెండూ కనిపించాయి. పరిస్థితులను శాసించిన వ్యక్తి పరిస్థితుల వెంట పరిగెత్తాల్సిన స్థితికి సంబంధించిన వైరుధ్యం అతని పొడిపొడి మాటల్లోనూ కనబడ్డది. నేను కనబడ్డప్పుడు ఏదైనా చేద్దామన్న మాటలు ఆ మనో నిబ్బరం నుండి వచ్చినవే. బలాబలాలు బేరీజు వేసుకొని మాట్లాడినవి కాదు. కావున గద్దర్ బలానికి, బలహీనతలకు అతడే ప్రధాన కారణం కావచ్చు గానీ, అతడే ఏకైక కారణం కాదు. అతడెంచుకొని నడిచిన ఉద్యమం, అందులో భాగమైన మనందరం ఏదో మేరకు కారణం. అయితే ప్రజా సాంస్కృతికోద్యమ మిత్రులు నా నలభై ఏళ్ళ పాటల ప్రస్థానాన్ని నిర్వహించి దానికి కామ్రేడ్ గద్దర్‌ను ఆహ్వానించారు. ఆ సందర్భంగా గద్దరన్న మాతో కల్సి ఆడి పాడాడు. ఈ సందర్భంగా ఎర్రజెండా కట్టిన కర్రను నావైపు విసరడం, నేను దాన్ని అందుకోవడం రెండూ యాదృచ్ఛికంగా జరిగాయి. ఇది సింబాలిక్‌గా మిగిలిపోవడం చెదిరిపోని జ్ఞాపకంగా ఉంటుంది.

తన జీవితకాలం ముగిసినట్టు తెలుసుకొని చివరగా గద్దర్ తనపై పాట రాయమని కామ్రేడ్ అమర్ ను కోరాడు. చివరకు గద్దర్ మరణాంతరం తనపై తాను రాసుకున్న పాట కూడా బయటకు వచ్చింది. తన గానం, ఆహార్యం, వాద్యాల గురించే కాకుండా వేలాది అమరుల స్వప్నాలను పూర్తిచేసే వాళ్ళ కోసం ఆయన పాట వెతికింది. వార్ధక్యంలోనూ నడుస్తూ, మాట్లాడుతూ చివరికి ఎవరి శరణు కోరకుండానే హాస్పిటల్ నుండే తాను సెలవు తీసుకున్నాడు. ఆయన పార్థివ దేహాన్ని మోయడానికి వేలాది మంది పోటీ పడ్డారు. ఆయన పార్థివదేహం చూడడానికి లక్షల మంది ఎదురొచ్చారు. ఈ సందర్భంగా గుండె ఆగి ఒక సోదరుడు సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ ప్రాణం కూడా పోయింది. ఇప్పుడు సమస్య అంతా ఆయన పాటకు చాలామంది వారసులొచ్చారు. కానీ గద్దరన్న పాడినట్టు తన పార్థివదేహంలోని తూటాను గుప్పెట్లో దాచి పెట్టేది ఎవరు!? అని బౌద్ధం పద్ధతుల్లో కర్మకాండ పూర్తి చేసుకున్న గద్దర్ మనల్ని అడుగుతున్నాడు. ఎందుకంటే అతను **'బుద్ధం శరణం గచ్ఛామి'** అన్న పదాన్ని **'యుద్ధం శరణం గచ్ఛామి'** అంటూ అభివర్ణించాడట.


**"సత్యాన్ని సత్యంగాను, అసత్యాన్ని అసత్యంగాను తెలుసుకోవాలన్న"** గౌతమ బుద్ధుని సూక్తితో గద్దర్ స్వయంగా రాసుకున్న పాట సారాంశాన్ని సంగ్రహిద్దాం. **"చరిత్ర అనేది మనిషి తన లక్ష్యాలను సాధించే కార్యాచరణ తప్ప మరొకటి కాదు. మానవులు తమ కార్యాచరణలో ప్రపంచంతో పాటు తమను తాము మార్చుకుంటారన్న"** మార్క్స్ మహాశయుని మాటలను, గద్దర్ చివరి పాటతో అన్వయించుకుందాం.

**జోహార్ కామ్రేడ్ గద్దరన్నా – నీకివే అరుణోదయ విప్లవ జోహార్లు.**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 17 హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# గద్దరన్నా ... నిష్క్రమణ తెలిసే పాట రాయమన్నావా !?

**అమర్ (మిత్ర)**



పాటెంత మహా అయితే వంద, రెండొందల పదాల కలయికే కావచ్చు. కానీ ఆ పాట కోసం పాట వస్తువుతో ఎంతగానో తాదాత్మ్యం చెందాలి. బాణీ సమకూర్చుకోవాలి. దాన్ని కవిత్వీకరించడానికి సలసల కాగాలి. అది అమరుల పాటయితే జలజల కన్నీళ్లు రాల్చాలి. అలా రూపొందినది ప్రజల పాట అయినప్పుడు ఎంతోమందిని కరిగించవచ్చును. మరెంతో మందిని కదిలించవచ్చును. వాగ్గేయకారుడిగా, యుద్ధనౌకగా పేరుగాంచిన గద్దర్ ఎంతోమందిని కదలించి, ఉద్యమాన్ని ఉధ్రృతలూగించి, అందుకు ప్రతిగా నిర్బంధాలను, ఆఖరికి ప్రాణాంతక దాడులను ఎదుర్కొన్న వ్యక్తి. విప్లవ కార్యాచరణలో సుదీర్ఘకాలంగా నిమగ్నమైన శక్తి. పోరాటపాటకు ప్రతిరూపమైన ఒక ఐకాన్. అలాంటి వ్యక్తి నాకు ఎదురై మొదటిసారి తన పైన పాట రాయాలని కోరాడు. ఇది ఒకసారి కాదు, రెండుసార్లు. అదే విషయం నా సహచరి విమలక్క తోనూ పదేపదే చెప్పాడు. ఇది యథాలాపంగా చెప్పడం కాదని తన నిష్క్రమణ గురించి తెలిసే ఇలా చెప్పాడా అని ఇప్పుడు అనిపిస్తుంది. ఎన్నో ప్రజాసమస్యలపై స్పందించిన గద్దర్ తనపైన పాటరాయాలని కోరాడు. కానీ గద్దర్ యాదిలో వందల పాటలు వచ్చాయి. జరగాల్సిందేమంటే ఆయన వదిలి వెళ్ళిన కర్తవ్యాలను పూర్తిచేయడం.

మొదటిసారి జూలై 8, 2023న మంచిర్యాలలో అంతడుపుల నాగరాజు చెల్లె పెళ్లిలో కలిసినప్పుడు పట్టు పంచె కట్టుకొని ఎంతో అందంగా, ఆత్మీయంగా కనిపించాడు. ఎంతో ఆప్యాయంగా పలకరించి, ఫోటోలు దిగి మరీ తనపై పాట రాయాలని కోరాడు. అప్పుడది యాదృచ్ఛికమేమోనని భావించాను. పెళ్లికి ఇంకా సమయం ఉండడంతో మళ్ళీ కలుద్దామని తను పృథ్వీరాజుతో వెళ్ళగా నేను విమలక్క ఏదో పనిమీద బయటకు వెళ్లి మళ్ళీ అక్కడ కలుసుకోలేక పోయాం. మళ్లీ రెండవసారి జూలైలోనే నిమ్స్ హాస్పటల్లో కలిశాం. ముఖంపై నవ్వు చెరిగిపోలేదు కానీ మనిషి కొంత దిగాలుగా ఉన్నాడు. కలిసింది నాలుగు గోడల మధ్య కావడంతో మరింత ఆప్యాయంగా పలకరింపులు జరిగాయి. తొలిసారిగా ఆయనే 'మనం ఫోటో దిగాలంటే' ముందుగా మేమిద్దరం, ఆ తర్వాత విమలక్క, డాక్టర్ నిమ్మ సత్యనారాయణలము కలిసి ఫోటోలు దిగాము. అక్కడే భోజనాలు చేశాము. ఆఫీస్ స్టాఫ్ రోజా గారు చాలా ఇష్టంగా వడ్డించింది. ఆ తర్వాత తను మీటింగులో కళ్ళు తిరిగి పడిపోయిన విషయం ప్రస్తావించి మెడికల్ చెకప్‌లో గుండె కవాటాల్లో నాలుగు బ్లాకులున్నాయని గుర్తించారని చెప్పాడు. ఆ విషయమే మాట్లాడడానికి వచ్చానని చెబుతూ మళ్లీ తనపై పాట రాయాలని కోరాడు. అప్పుడు పరిస్థితి కొంత గంభీరంగా ఉందని అర్థమైంది. ఎప్పటినుండో నీ మీద రాస్తూనే ఉన్నానని, నీపై జరిగిన కాల్పులను ఖండిస్తూ **"కైగట్టి పాడుతుంటే కత్తి గొంతు మీదనో – గజ్జె గట్టి ఆడుతుంటే గన్నులెక్కిపెట్టిరో"** అంటూ రాసిన పాట గుర్తు చేశాను.

2000 సంవత్సరంలో వచ్చిన **"ఆడుదాం డప్పుల్ల దరువెయ్ రా – పల్లె తెలంగాణ పాట పాడరా"** పాటలో కూడా **"ఊరురా గద్దరై ఉరిమిందిరా –తరగని జనగానమై ఊరిందిరా"** అంటూ ఉన్న చరణాలను గుర్తు చేశాను. అయినా నువ్వు నా మీద పాట రాయాల్సిందేనన్నాడు. తప్పకుండా రాస్తానని హామీ ఇచ్చాను. ఇప్పుడు ఇవన్నీ నెమరేసుకుంటే తన జీవిత చరమాంకం గురించి మామూలు విషయాలుగా కాకుండా తన నిష్క్రమణ గురించి అర్థమై మాట్లాడిన విషయాలుగా అనిపించాయి. గద్దర్‌కు ఆపరేషన్ జరిగిన తర్వాత అంతా బాగైందనుకొని డాక్టర్ దాసరి ప్రసాద్‌రావుకు రెండు రోజుల ముందే గద్దర్‌ను కలుస్తామని ఫోన్ చేశాము. "ఇప్పుడే వద్దు తర్వాత కలవండి" అన్నారు. పోస్ట్ ఆపరేషన్ జాగ్రత్తలు కావచ్చనుకున్నాం. తీరా ప్రొఫెసర్ జయశంకర్ సంస్మరణలో ఆయన 89వ జయంతి సభలో ఉన్న విమలక్కకు గద్దర్ మరణ వార్త మధ్యాహ్నం 2:30 గం॥లకు తెలియగానే ప్రొఫెసర్ రమా మేల్కొటెతో కలిసి తన బృందం సభ్యులను వెంటేసుకుని మూడు గంటలకల్లా అపోలో స్పెక్ట్రాలో ఉంది. గద్దర్ పార్థివదేహాన్ని చేతులతో నిమిరింది. నాకు సమాచారం ఇచ్చింది. నేను ఆటోలో వస్తూ అన్న చెప్పిన పాట గురించే ఆలోచించాను. అన్న హస్పిటల్ నుండి వచ్చిన తర్వాత నింపాదిగా రాద్దామనుకున్న పాట గద్దర్ స్మృతి గీతంగా మారింది. అప్పటికప్పుడే ఒక పల్లవి, చరణం రాసుకున్నాను.

ఎందుకంటే ఇప్పుడు గద్దర్‌ను కోల్పోయిన ప్రపంచానికి ముందుగా ఓదార్పును, విశ్వాసాన్నివ్వాలి. అందుకే ఆటోలో వస్తూనే **"పాటకు లేదు మరణం / నీ ఆటకు లేదు అంతం /విప్లవ యుగాన గద్దర్ జననం / విప్లవ గీతం పల్లవి చరణం"** అంటూ రాసుకుంటూ పోయాను. ఆరోజు రాత్రి ఆ పాట రికార్డు కూడా చేశాము.

అయినా కామ్రేడ్ గద్దర్ కోరిక తీరినట్టు కాదు. నేను మొదలు పెట్టిన విధంగా ఒక పాటలోనే గద్దర్ జీవిత సంఘర్షణ రాయగలమా? కొందరు దళిత మేధావులు గద్దర్‌ను ప్రభుత్వ అధికారంలో చూడాలను కున్నారు. మరికొందరు విప్లవ బాటను మధ్యలో వదలాల్సింది కాదంటున్నారు. అటు నక్సల్బరీ ఉద్యమంలోనూ, ఇటు కుల నిర్మూలన ఉద్యమాల్లోనూ, చివరికి తెలంగాణ ఉద్యమంలోనూ అతని జీవితం వృథా అయిందని కొందరి అభిప్రాయం. కానీ ఆ మూడు ఉద్యమాల కలయికనే గద్దర్. వాటితో పెనవేసుకుని ఆయన సాగించిన కార్యాచరణలోనే పాటకు సృజనాత్మకత అబ్బింది. అందుకే ఇంత ప్రజాస్పందన వచ్చింది. దానిని గుర్తించకుంటే గద్దర్‌ను యాంత్రికంగా చూసినట్టే అవుతుంది. ఆయన కవిగానే కాదు యుగ కవిగా, కార్యశీలిగా పయనించాడు. అందుకే గద్దర్ గురించి రాయాలంటే ఒక పాట సరిపోదు. ఒక కావ్యమే రాయాల్సి ఉంటుంది.

అయితే గద్దరన్న కోరిక మేరకు

**“నీ మీద పాట రాస్తా / నీ పాట లోతు జూస్తా**
**నీకు నాకు బంధము / విప్లవానుబంధమని**
**నా కలము సరిపోతే / లోకానికి వెల్లడిస్త**
**నువ్వు విని చెప్పాలన్నే - మా గద్దరన్నా**
**నీ నవ్వులు విరబూయాలన్నే - ఓ గద్దరన్నా”**

అని అప్పుడు మొదలుపెట్టిన. ఆ పాట పూర్తి కాకముందే గద్దర్ నిష్క్రమణ జరిగిపోయింది.

50 ఏళ్లుగా గద్దర్ మేము రెండు సమాంతర విప్లవ పాయలుగా పయనిస్తున్నాం. ఆ సమయంలో గానీ, ఆ తర్వాత గాని గద్దర్ రచనలు, తరగని గని లాంటి ఆయన అనుభవాలు, గద్దర్ పై వచ్చిన థీసెస్‌లు ఏవి పూర్తిగా చదవలేదు. యుద్ధనౌకగా పేరొందిన గద్దర్‌ను 2004లో శాంతిచర్చల్లోనే నేను ప్రత్యక్షంగా చూడడం జరిగింది. శాంతి చర్చల టేబుల్ మీద గద్దర్, నేను చెరొక పాట పాడాము. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒకసారి దోమలగూడ అరుణోదయ కార్యాలయంలోకి గద్దర్ వచ్చాడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ నాయకత్వాన ఒకే పోరాట ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి నేను జైల్లో ఉన్న కాలంలో ప్రయత్నాలు జరిగి విఫలమైనాయి. ఆ తరువాత అడపాదడపా పలు సందర్భాల్లో కలవడం జరిగింది. ఇటీవల ఆయన విప్లవ సాంస్కృతికోద్యమం నుండి కొంత దూరంగా ప్రజాతంత్రవాదిగా ఉంటున్నారు. అనారోగ్యం, కేసులతో సతమతమవుతూ కొంత తన సహజశైలికి భిన్నంగా వ్యవహరించారు. అయినా ఆయన నిష్క్రమణాంతరం ప్రజల్లో గద్దర్‌కు దక్కిన గౌరవమంతా విప్లవ సాంస్కృతికోద్యమానికి దక్కినట్లే. ఆ విధంగా గద్దర్ తన జీవితంలోని సింహభాగం విప్లవానికి అంకితం చేశాడు. అందుకే మావోయిస్టు పార్టీ సైతం ఆయన 40 సంవత్సరాల విప్లవ జీవితాన్ని ఎత్తి పట్టింది. విప్లవ సాంస్కృతికోద్యమంతో గద్దరుకున్న అనుబంధం రీత్యా ఆ రెండు రోజులు ఆయన పార్థివ దేహం వెంటే ఉండిపోయాము. అయితే ఒకనాడు గద్దరును మట్టుపెట్టడానికి రాజ్యం చేత ఆయన దేహంలోకి దిగిన తూటాలు మరొక రూపంలో అధికారిక లాంఛనాల పేరిట గాల్లోకి పేలడానికి సిద్ధమవుతుండగా మేము మౌనంగా నిష్క్రమించి రావడం జరిగింది. ఎందుకంటే అపార త్యాగానికి చిహ్నంగా గద్దరన్న ఒంట్లో మిగిలిన తూటాకంటే ఏదీ విలువైన గౌరవం కాదు కాబట్టి.

**(గద్దర్ తనపై పాట రాయాలని చేసిన ప్రస్తావన గురించి...)**

జనం గొంతు మూగవోదు

పల్లవి : జనం గొంతు మూగవోదు
జనగానం ఆగిపోదు
భుజమ్మీద గొంగడి
సిన్నబోదు సితికిపోదు
మెడలోని కండువా
ఎగిరే ఎర జెండగా
ఘల్లు ఘల్లు గజ్జెల మోతా... మా గద్దరన్న
గర్జించెను దేశమంతా... మా యుద్ధనౌక ॥జనం॥

1. కొండోలె మొగులొస్తే సీకటైనట్టు కాదు
కుండపోత వానలై నేల తల్లి ముర్సినట్టు
కప్పల బెకబెకరా
పక్షుల పకపకరా
ప్రకృతి చిరునవ్వురా
ప్రతిజీవి పరవశించెరా
వరుసబెట్టి రైతుకూలి
పొలం బీట పట్టురా
బండెనుక బండిగట్టినట్టురా - మా గద్దరన్నా
నీ జన జాతర సాగుతుందిరా - మా యుద్ధనౌక

2. జీరగొంతు వింటూ ఊరువాడ మేలుకొంది
నువ్వమర జీవివంటూ జేజేలు పలుకుతుంది
వాగ్గేయకారుడంటూ
నీతో వరుస గల్పుకుంటూ
నీ కవనం గమనిస్తూ
నీ గమనం నెమరేస్తూ
నీ కర్ర గుత్పనంటూ
సాము దిప్పుకుంటూ
సై అంటే సై అంటున్నరూ - ఈ గాయిదోల్లు
గంద్ర గొడ్డలవుతున్నరూ - ఈ గరీబోల్లు
నీ సమరం సాగిస్తమంద్రు - ఈ గులాపోల్లు
ఆ సమర భేరి పాటలైరి - ప్రజాకళాకార్లు

# పాటల పరివ్రాజకుడు గద్దర్

**డా. నందిని సిధారెడ్డి,** కవి, సాహితీ విమర్శకులు. ఫోన్ : 9440381148




బసవనను వర్ణిస్తూ **'ఒడలెల్ల భక్తి'** అంటాడు పాల్కురికి సోమన. 'ఒల్లెడల భక్తి' కలవాడు బసవన అయితే **'ఒల్లెడల పాట'**యిన వాడు గద్దర్. గొంతుతో పాడటం కొందరి పద్ధతి. సమస్త శరీరంతో పాడటం గద్దర్ పద్ధతి. హృదయం గొంతులోంచి దుంకుతుంటే కాళ్లు, కాళ్లకు కట్టిన గజ్జెలు, వొయ్యారపు అడుగుల్లో సవ్వడులు, చేతులు, చేతుల్లో దస్తీ అవతారాలు, హొయలొలికే విన్యాసాలు, భుజం మీద ఎర్రంచు నల్ల బొంత, ముఖ కవళికలు, నయగారపు హావభావాలు, ఎగిరే జులపాలు, కళ్లలో జాలువారే భానవలు, స్వర మూర్ఛనలు, హెచ్చుతుగ్గులు, అభినయాలు, భిన్నభిన్న సన్నివేశాలు రక్తి కట్టించే సమ్మోహన కళా ప్రదర్శన పేరు గద్దర్. కన్నీళ్లు పాడుతుంటే పరిసరాలు తడిసిపోవటం, కోపం పాడుతుంటే వాతావరణం వేడెక్కటం, మరిగిపోవటం, ప్రేమ ఆలాపిస్తుంటే మనసులు సున్నితమై పరవశించటం.... ఆ పాట ప్రత్యేకత. ఆ ప్రదర్శన ప్రత్యేకత. అసలు సంగీతానికే శిశువుల్నీ, పశువుల్నీ, నాగుల్నీ ఆడించే మహత్తు ఉందని ఆలంకారికులు చెప్పే ఉన్నారు. సంగీతం, నృత్యం, సాహిత్యం మూడు కళలు సమ్మిళితమైన హృద్యకళ మహత్తు ఎంత మనోహరం. ఆ హృద్యకళ, ఉద్యమకళ గద్దర్.

అర్ధశతాబ్ది తెలుగు సమాజాన్ని అర్థవంతంగా ప్రేరేపించిన కళాశక్తి గుమ్మడి విఠల్‌ను ఆవహించింది. స్థల కాలాలతో సంబంధం లేకుండా కళ వికసించదు. ఒక నేల మహత్తు అది. ఒక కాల మహిమ అది. మామూలు మనుషుల్ని మహనీయులుగా మలిచే సందర్భాలుంటాయి. అట్లాంటి ఒక నేల, ఒక కాలం, ఒక సందర్భం విఠల్ని గద్దర్‌గా తీర్చిదిద్దింది. తూప్రాన్ ఒడిలో పుట్టిన తుఫాన్. దళితవాడలో ఎదిగిన గానం. గద్దర్‌ను **'తుఫాన్ తుమ్మెద'**గా వర్ణించాడు దేవిప్రియ. **'ప్రజాయుద్ధనౌక'** అని ప్రశంసించాడు ఖాదర్. **'పాటల వేగుచుక్క'**గా ఎత్తి పట్టింది విప్లవోద్యమం. **'పులిబిడ్డ'**గా పిలిచింది దళిత ఉద్యమం. **'గాథా పురుషుడు'**గా హత్తుకొని గర్వించింది తెలంగాణ ఉద్యమం.

గద్దర్ కేవలం కవి మాత్రమేనా? గాయకుడు మాత్రమేనా? నటుడు కావొచ్చునా? **'వాచం గేయంచ కురుతే వాగ్గేయకారకః'** అన్నాడు కదా శార్ఙదేవుడు. తుప్పు వదిలే శబ్దం సృష్టించాడు. మనసు కరిగే కవిత్వం రచించాడు. బొమ్మ కట్టే మాటలు సృష్టించాడు. దృశ్యాలు కదిలే స్థాయీభావాలు అభినయించాడు. ఎట్లా అంచనా వేయాలి గద్దర్‌ను. సాహిత్యంలోనైనా, సాంస్కృతిక రంగంలోనైనా ఎట్లా స్థిరీకరించాలి మరి. **'వాగ్గేయకారుడు'** సరిపోతుందా? గద్దర్ ఉద్యమకారుడు కూడా కదా! వేల పాటలు రాశాడు. వేల ప్రదర్శన లిచ్చాడు. లక్షలమందిని బహిరంగ సభ నుంచి సంభాళించాడు. ఉత్తేజపరిచాడు. కోట్లమందిని చేరుకున్నాడు. గూడాలు, గుడిసెలు, గుండె గుండె పెదవితో మీటాడు కదా – ఆర్ట్ లవర్స్ నుంచి జన నాట్యమండలి నుంచి, అజ్ఞాత జీవితం నుంచి, శవ స్వాధీన కమిటీ నుంచి, అమరుల బంధుమిత్రుల సంఘం నుంచి, భారతీయ జాతుల నుంచి, సంస్కృతుల నుంచి, తెలంగాణ యాత్ర దాకా ప్రయాణిం చాడు కదా – తన పాటతోని ప్రభుత్వాల్ని వణికించాడు గదా – నిజమేనా – ఎవరైనా పాటతో వణికించగలరా? ప్రభుత్వం వణుకుతుందా? వణుకకపోతే కాల్పులు జరిపిస్తుందా? జరిపించక పోతే నేరస్థుల్ని ఎందుకు దాపెడుతుంది? ఇన్ని ప్రశ్నలు... ఇంత చరిత్ర... ఇన్ని పాటలు, ఇంత జీవితం... ఇన్ని మలుపులు... ఇన్ని భావోద్వేగాలు... ఉద్వేగభరితం గద్దర్. రస సమన్విత సారం గద్దర్.

**"దసర పండుగ వచ్చె దమ్మిడీ లేదాయె**
**దీపావళి వొచ్చె దీపమే లేదాయె**
**శివరాత్రి వొచ్చింది ఉపవాసముండాలె**
**నీ బుతకంత శివరాత్రి లచ్చుమవ్వో లచ్చుమమ్మా**
**నీ బతుకంత అమవాస లచ్చుమవ్వో లచ్చుమమ్మా" (సిరిమల్లె చెట్టుకింద)**

ప్రజల వ్యవహారంలో ఉన్న చిన్న చిన్న పదాల్లో తన తల్లిలాంటి ఎందరో తెలంగాణ తల్లుల దయనీయ జీవితాన్ని ఆర్ద్రంగా చిత్రించాడు గద్దర్. 'బతుకంత శివరాత్రి' 'బతుకంత అమవాస' మాటలకు అర్థాన్ని వివరించటానికి వ్యాఖ్యానం సరిపోదేమో.

గద్దర్ వర్ణనలు జానపద హృదయానికి దగ్గరగా ఉంటాయి. అలంకారాలు జీవితం నుంచి ఎంచుకున్నంత సహజంగా ఉంటాయి. వెంట వెంట రూపుకడతాయి. తెలంగాణ తల్లి చిత్రణ జిల్లాల ప్రత్యేకతల్ని అద్దుకుని ఆకర్షిస్తుంది.



**"ఖమ్మంమెట్టు అడవులతోని కట్టుకున్నది పచ్చని చీర**
**ఆదిలాబాదు ఆకు నలిపి పెట్టుకున్నది నొసటి బొట్టు**
**నాగారం అడవి తుమ్మతో దిద్దుకున్నది కండ్ల కాటుక"** **(అమ్మా తెలంగాణమా)**

పచ్చని చీర, నొసట బొట్టు, కండ్ల కాటుక జానపద స్త్రీ తయారు కావటంలో భాగం. సహజ విధానం. ప్రకృతితో కలిసి సాగిన జీవన సంస్కృతి. గద్దర్‌లోని భావుక సౌకుమార్యం అందంగా గానం చేస్తూ తెలంగాణతనాన్ని లోకానికి చాటుతుంది. తన ప్రదర్శనతో భావం మరింత గాఢంగా హత్తుకుంటుంది.

అట్లా రమణీయంగా వర్ణిస్తూ ఆగిపోడు. చెప్ప దలుచుకున్న భావాన్ని సూటిగా ఎక్కించటం గద్దర్ శైలి. సాగుతున్న వర్ణన ఆగుతుంది. పాట ఆగుతుంది. వాద్యనాదం ఆగుతుంది. నిశ్శబ్దంలో వొత్తి వొత్తి ఒక్కసారిగా అసలు భావాన్ని పేలుస్తాడు.

**"కోటి దేవుండ్లకు దండం బెట్టిన (మళ్లా అని) ... కూటికి లేని తల్లిని జూడు...."** ఒక్కసారిగా భావం, నాదం, అడుగులు, అభినయం, గద్దర్ సాధించిన ఆకర్షణ. చరణం చరణానికి ఇట్లాంటి కుదుపులు, మెరుపులు, అరుపులు ప్రేక్షకుల్ని సంలీనం చేసుకుంటాయి. పాటలో ఒక చరణం అలంకారం, రెండో చరణం ఆభరనాలు, మూడ చరణ దేవతల మొక్కులు, నాలుగో చరణం భిక్షుక జానపద గాయకులు, ఐదో చరణం నదులు, నీళ్ల గోస, ఆరోది గోదారి, ఏడోది ఆదివాసీ గూడాలు మొత్తం తెలంగాణ ఆవిష్కరణ.



**"పోరగాళ్లకు బడులే లేవు/ బడులే ఉంటే భవంతి లేదు**
**ఎండకాలము చెట్టుకింద/ నీడ తిరిగినట్టు తిరుగుతుంటరు"**
**(నా తెలంగాణ)**

ఉన్న జీవమంతా 'నీడ తిరిగినట్టు' తిరగటంలో వున్నది. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిని, ఇంతకంటే బలంగా చెప్పటం అసాధ్యం. ఎంత పరిశీలన ఉంటే కవి నీడను పట్టుకోగలడు. అది గద్దర్ నిశిత దృష్టి.

గద్దర్ మూడు దశాబ్దాలు విప్లవోద్యమంలో తలమునకలై జీవించాడు. ఎన్‌కౌంటర్లలో చనిపోయిన 'అన్న'లను స్మరించుకుంటూ రకరకాలుగా గానం చేశాడు. పరిపరి దండాలు పెడతాడు. మెల్లమెల్లగా ఎదుటి హృదయాల్ని ద్రవింపచేస్తాడు. సహజోక్తులతో చేరువ చేస్తాడు.

**"కన్ను దెరిసి కన్ను మూస్తె కండ్లల్ల కదులుతుండ్రు**
**కాలు దీసి కాలువేస్తె కాళ్లల్ల మెదులుతుండ్రు**
**సక్కనైన కొడుకులమ్మ వోళీ శెమ్మ కేళిలవోళి**
**సుక్కలల్ల కలిసిరమ్మ వోళి శెమ్మ కేళిలవోళి"**

ఆలపిస్తూ, అభినయిస్తూ అడుగులేస్తుంటే ప్రాంగణమంతా ఆర్ద్రమవుతుంది. హోళి పండుగకు పాడే జానపదస్త్రీల బాణీలో సమాజాన్ని మర్చాలనుకొన్న పోరాట అమరుల త్యాగాన్ని చాటుతాడు.

గద్దర్ పాటల్లో జానపదుల పలుకుబడులు, భావనలు, అలంకారాలు, పదాలు జాలువారుతాయి. జానపదుల హృదయమెంత ఉదాత్తంగా అల్లుకుంటుందో గద్దర్ పాట అట్లా అల్లుకుంటుంది.

**"కొమ్మల్లో వాన సినుగు కోలాటమాడింది",**
**"కంది సేలు నీళ్లు పోసుకున్నాయి",**
**"అలిసెంత తీగ భూతల్లి వొడిలోన ఆడుకుంటుంది",**
**"కుంకుమ పువ్వులు నూరి పసుపు పూసుకుంది"**

ఎన్ని అలంకారాలయినా ఏకరువు పెట్టవచ్చు. శబ్దాలంకారాలకు లెక్కే లేదు. రక్త బంధానికి, స్వేచ్ఛాభావనకు పరాకాష్ట. **"నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లమ్మా"** పాట అన్న చెల్లితో అంటాడు.

**"అడవిలో నెమిలి వోలె, ఆటలాడుకో పాట పాడుకో"** నెమలంత స్వేచ్ఛగా, హాయిగా, ఆహ్లాదంగా ఆడుకోగలిగే, పాడుకోగలిగే 'నూతన మానవున్ని' నిర్మించే మహాస్వప్నం కన్నాడు. ఆ స్వప్నం ఫలించటానికి, సాధించటానికి మహా గానమయ్యాడు. ఆడి పాడి అక్షరాలు పోటెత్తే 'మహా ప్రదర్శన' గద్దర్. ఆయన జీవితం అమరం, ఆయన కళ సజీవం.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (21) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# యుగకర్త గద్దర్

ప్రొఫెసర్ చింతకింది కాశీం, అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 97014 44450



తెలుగు సాహిత్యంలో ఆదికవులు, యుగకర్తలు, ప్రారంభకులు లాంటి వ్యక్తీకరణల మీద విస్తృత చర్చ జరిగింది. ఈ చర్చలో సంప్రదాయవాదులు, ప్రగతివాదులు, ప్రజాస్వామికవాదులు పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను వ్యక్తం చేసారు. ఎవరి అభిప్రాయాలు వారికున్నా, ఒకరి అభిప్రాయంతో మరొకరు ఏకీభవించకపోయినా ప్రధాన స్రవంతి సాహిత్యం మాత్రం తనదైన సంవిధానాన్ని రూపొందించుకున్నది. కొన్ని సాహిత్య ప్రమేయాలు, మరికొన్ని పరికరాల ఆధారంగా అకడమిక్ సాహిత్య బోధన జరుగుతుంది. ఈ క్రమంలో అనేక సంవాదాలూ జరుగుతుండవచ్చు, కానీ అధ్యయనానికి, అధ్యాపనకు ఏదో ఒక ఆలంబన ఉండాలి కనుక కొన్ని సాహిత్య పద్ధతులు, నిర్ధారణలు రూపొందాయి. సామాజిక నిర్మాణంలో, ఆచరణలో వచ్చిన మార్పుల ఫలితాలు సాహిత్యాన్ని గంభీరంగా మార్చివేసాయి. రాజకీయార్థిక సందోహాలు కూడా మార్గ సాహిత్య బోధన, అధ్యయనం మీద అనేక ప్రశ్నలను ఉంచాయి. సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఉత్పత్తి సంబంధాలు మూలంగా ఉండాలనే చర్చ కూడా 20వ శతాబ్దంలోనే జరిగింది.

సాహిత్య, సాంస్కృతిక, విద్య లాంటి ఉపరితల రంగాలపై పాలకుల ఆధిక్యతనే కొనసాగుతుండటం వలన సాహిత్య చరిత్ర నిర్మాణం వారి ఇష్టాలకు అనువుగానే జరుగుతుంది. ఇంకో కోణంలో చెప్పాలంటే బౌద్ధిక రంగాల మీద ఉండే ప్రాబల్య వర్గాల సమ్మతే సాహిత్య నిర్ధారణలుగా ఉంటాయి. భారతీయ సాహిత్య ప్రపంచంలోకి మార్క్సిస్టు సంవిధానం ప్రవేశించాక మునుపటి సాహిత్య పద్ధతుల మీద, నిర్ధారణల మీద విస్తృత చర్చ ప్రారంభమయింది. సాహిత్యం రెండు శిబిరాలుగా విడిపోయి మార్క్సిస్టులు, సంప్రదాయవాదులు సాహిత్య పరిభాషలో తలపడ్డారు. ఈ నేపథ్యంలో సాహిత్యంలో ప్రజాస్వామిక దృక్పథం కలిగినవాళ్లు మధ్యమార్గాన్ని రూపొందించుకున్నారు. వీరిలో కూడా ప్రగతిదాయక ఆలోచనలే ఉన్నాయి. కొత్త పాతల మేలు కలయికలాగా సంప్రదాయవాదులలోని ప్రజానుకూల విషయాలను, మార్క్సిస్టులలోని ప్రగతిదాయక ఆలోచనలను సంలీనం చేసి నూతన సాహిత్య పరికల్పనలను, పరిశోధన పరికరాలను రూపొందించారు.

ఆధునిక సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథం తర్వాత అస్తిత్వ సమూహాలు వేసిన ప్రశ్నలు సాహిత్యాన్ని విస్తృతి చేసాయి. ఈ సందర్భంలోనే ఆదికవి, యుగకర్త లాంటి ప్రయోగాల మీద వాటి ఔచిత్యం మీద లోతైన చర్చ జరిగింది. అంగీకారాలు, ఆమోదాలు, తిరస్కారాలు, తృణీకారాలు ఈ చర్చలో ఉన్నాయి. కానీ మొదటి కవిత, మొదటి కవి, పునాది, ప్రారంభకులు, మొదటి రచన వంటి ప్రయోగాలను ఈ ఉద్యమాలు కూడా సాహిత్య చర్చలో మినహాయించలేకపోయాయి. సాహిత్య రూపంలో వ్యక్తమవుతున్న జ్ఞానం ప్రజల నుంచి నేర్చుకున్నది కదా! దానిని సొంతం చేసుకొని కీర్తి కిరీటాలు పొందడం దేనికి అనే ప్రశ్నలు వేసినవాళ్లు ప్రశ్న దగ్గరే ఆగిపోయారు. సమాజంలో అన్నిరకాల వసతులు, సౌకర్యాలు అమరిన ఎగువ సామాజిక సమూహాల నుంచి వచ్చినవారు మాత్రమే సాహిత్య పీఠాల మీద కూర్చోవాలా? చాలా అరుదుగా దిగువ సమూహాల నుంచి వచ్చిన వారికి కనీస గౌరవం దక్కకుండా చేయడంలో ఉన్న ఆంతర్యాన్ని ప్రశ్నించడం మొదలయింది.

ఈ నేపథ్యం నుంచి గద్దర్‌ను యుగకర్త అనడంలో సందేహించవలసిన అవసరం లేదని నా అభిప్రాయం. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో శూద్ర, ముఖ్యంగా అతిశూద్ర వర్గం నుంచి ఎదిగిన అరుదైన సాహిత్య వ్యక్తిత్వం గద్దర్. అతడి జననం(1948) వేల తల్లుల నోము పంట. తూప్రాన్ తుపాన్ బిడ్డగా రూపాంతరం చెందడానికి పునాది అక్కడే పడింది. వెలివాడలో విరగబూసిన సిరిమల్లె చెట్టుకింది లచ్చుమమ్మ అంటరాని వసంతంలో, ఏ అర్ధరాత్రో గుమ్మడి విఠల్‌బాబుకు జన్మనిచ్చింది. తన రక్తాన్ని పాలుగా మార్చి పాలతో పాటు పాటను కూడా విఠల్‌బాబుకు లచ్చుమమ్మ తాగించింది. తండ్రి శేషయ్య, బుద్ధుడు, కబీర్, అంబేద్కర్‌ను విఠల్‌బాబు జీవితంలోకి తీసుకొచ్చాడు. చదువు–కళ అతనికి రెండు కళ్లుగా మారిపోయాయి. పాడటం, ఆడటం, బుర్రకథ చెప్పటం ప్రవృత్తి అయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సైఫాబాద్ పీజీ కళాశాలలో పీయుసీ, ఇంజనీరింగ్ కళాశాలలో బి.ఇ. అభ్యసించాడు. బి.ఇ విద్యను అర్ధాంతరంగా వదిలి బ్యాంకు ఉద్యోగంలోకి ప్రవేశించాడు.

గుమ్మడి విఠల్‌బాబుకు ఆర్ట్ లవర్స్(1966)తో ఏర్పడిన పరిచయం తన ప్రపంచాన్ని విశాలం చేసింది. ఆర్ట్ లవర్స్ వ్యవస్థాపకుడు బి.నర్సింగరావు(మా భూమి సినిమా) నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలతో ప్రభావితుడై ఉన్నాడు. కనుక కళకు సామాజిక ప్రయోజనం ఉండాలనే తాత్వికతను పొందాడు. అందుకే విఠల్‌బాబు ఆర్ట్ లవర్స్‌కు పరిచయమయ్యాక(1971) సమాజం, సాహిత్యం వాటి మధ్య ఉండే గతితార్కికత తెలుసుకోగలిగినాడు. కవిత్వం, పాట రచనలో, ఇతివృత్తం ఎంపికలో స్పష్టత వచ్చింది. అప్పటివరకు గుమ్మడి విఠల్‌బాబుగా ఉన్న యువకుడు **"ఆపురో రిక్షోడా రిక్షెంట నేనొస్త"** అనే తన పాట ముద్రణలో విబి గద్దర్‌గా మారిపోయాడు. స్వాతంత్రోద్యమంలో గదర్ పార్టీ(తిరుగుబాటు) నిర్వహించిన విప్లవాత్మక పాత్రయే ఈ పేరుకు ప్రేరణ. ఇక తెలుగు నాట గద్దర్ అనే పేరు చరిత్రను సృష్టించింది. గద్దర్ జీవితాన్ని మూడు దశలుగా విభజించవచ్చు.

1. ఆర్ట్ లవర్స్‌కు పరిచయం కాని దశ
2. ఆర్ట్ లవర్స్‌తో కలిసి నడిచిన దశ
3. జననాట్యమండలి ఏర్పాటు–విప్లవదశ

అయితే ఈ వ్యాసంలో సమగ్రమైన గద్దర్ జీవితం–సాహిత్యం మీద విశ్లేషణ చేసే పనిపెట్టుకోలేదు. నా ప్రధాన దృష్టి గద్దర్ యుగకర్త అని చెప్పటం మీదనే కేంద్రీకరించాను. కనుక నా ప్రతిపాదనకు కావలసిన ఉటంకింపులు, ఆధారాలు, సూత్రీకరణలను మాత్రమే ఈ వ్యాసానికి ఉండే పరిమితిగా గమనించగలరు.

యుగము అనే పదానికి కృతము, త్రేత, ద్వాపరము, కలి అనే అర్థాలను నిఘంటువు చెబుతుంది. కానీ ఆధునిక కాలంలో నిర్ణీతకాలం అనే అర్థంలో వాడారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీలను ఆయా కాలాలకు యుగకర్తలని చెప్పారు. 1875 నుంచి 1925 వరకు ఈ యాభై ఏళ్ల కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కందుకూరి, గురజాడ, రాయప్రోలును భిన్న నేపథ్యాల నుంచి యుగకర్తలని చెప్పారు. అయితే సాహిత్య వస్తువు, భాష, ఛందస్సు, శిల్పరీతులు మొదలైన సాహిత్య గత విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆధునిక సాహిత్యానికి ముఖ్యంగా కవిత్వానికి యుగకర్త గురజాడ అని ఎక్కువమంది విమర్శకులు, పండితులు అంగీకరించారు. ఇక ఆ తర్వాత 1930 నుంచి 1980 వరకు ఉన్న ఈ యాభై ఏళ్ల కాలానికి సంబంధించిన కవిత్వానికి శ్రీశ్రీని యుగకర్త అని, మహాకవి అని నిర్ధారణ చేసారు.

1975 తర్వాత ఈ యాభై ఏళ్లలో తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి ఎవరు? అనే ప్రశ్న వేసుకుంటే గద్దర్ తప్ప ఇంకెవరైనా ఉన్నారా? 1930 వరకు తెలుగు కవిత్వం నన్ను నడిపిస్తే ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని నేను నడిపిస్తానని శ్రీశ్రీ చెప్పింది ఎంత సత్యమో, 1975 తర్వాత తెలుగు కవిత్వాన్ని ఊగించి, శాసించి, నిర్దేశించింది గద్దర్ అని చెప్పటంలో శషభిషలు ఉండనక్కర్లేదు. **"ఎవరు తమ రచనల ద్వారా వర్తమాన కాలమునకే కాక భవిష్యత్తరముల వారికి అభినవోత్తేజము కల్గింతురో, ఎవరు గతానుగతికమై ఘనీభవించిన భావ ప్రపంచంలో ఉద్దామమైన ఉద్దీపనము కలిగింతురో, ఎవరు తమ తరువాతి అనేక కవులకు అనుకరణీయులౌదురో వారిని సాహిత్య రంగమున యుగకర్తలనవచ్చును"** (నారాయణరెడ్డి సి. 2011; పే.178). **'సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా'** గురజాడ వారినే నవ్య కవిత్వమునకు యుగకర్తగా తాను భావించుచున్నట్లు శ్రీశ్రీ చెప్పారు (ప్రతిభ–1938) రచనలోని నవ్యత, దాన్ని ప్రచురించిన కాలం, తర్వాతి తరం మీద ఆ రచన ప్రభావం, విశేష ప్రజామోదం, గానరీతి, ప్రదర్శన పద్ధతిని మొదలైన గుణాలను బట్టి వారిని యుగకర్తలని అనవచ్చు. సామాన్య ప్రజల జీవితములను కావ్య వస్తువులుగా చేసి రాసిన కవులు యుగకర్తలవుతారని భావించిన సాహిత్య ప్రముఖులలో సినారె ఒకరు.

గురజాడను మహాకవిగా, యుగకర్తగా గుర్తించడానికి కొందరు ఛాందస విమర్శకులు నిరాకరించారు. ఆయన రాసిన మహాకావ్యం ఏది? అనే ప్రశ్నను ముందుకు తెచ్చారు. కానీ యుగకర్త కావడానికి రామాయణం, భారతం లాంటి మహాకావ్యం అనే కొలమానం కాదని వర్తమాన జీవితాన్ని ఎంతగా సృజనాత్మకం చేసాడనేదే గీటురాయిగా తీసుకోవాలని శ్రీశ్రీ అన్నాడు. **"కాని కవిత్వపు మంచి చెడ్డలను నిర్ణయించేది గ్రంథాల లావును, పై మెరుగులను బట్టి కాదు కదా! గురజాడ తన రచనా విధానంలోను, కవితా విషయంలోను కూడా విప్లవాన్ని తీసుకొచ్చాడు. కొత్త మార్గాన్ని తొక్కాడు."**(శ్రీశ్రీ 1990; పే.15) తెలుగు సాహిత్య చరిత్రకారులు, విమర్శకులు నన్నయను తెలుగు కవిత్వానికి సృష్టికర్త అంటున్నారు. తెలుగు కవిత్వానికి నన్నయ భిక్ష పెట్టాడని, కనుక ఆయన ఆదికవి అని, మహాకవి అని, యుగకర్త అని భావించారు. ప్రారంభంలో నన్నయ తెలుగు భాషకు సంబంధించి చేసిన కృషి పట్ల పండితులకు ఎనలేని గౌరవం ఉంది. ఉండవలసినదే. ప్రజల భాషకు, సంస్కృత భాషకు సంధి కుదిరించి కొత్త పదజాలాన్ని సృష్టించాడు. ఒకరకంగా సంస్కృతాన్ని తెలుగులో యథేచ్ఛగా వాడే విధానానికి పునాది వేసాడు. **"తెనుగున నుత్తమమైన కావ్య రచనా మార్గము తీర్చిదిద్దెను"** (దివాకర్ల వేంకటావధాని, 1981; పే.565) అనే అభిప్రాయాన్ని పండితు లందరూ కల్గి ఉన్నారు. అందుకే ఆ కాలానికి ఆయన యుగకర్త అయ్యాడు.

ఏ కాలంలోనైనా సరే కవిత్వం పాటలోనే బయలుదేరుతుంది. పండితభాషతో సంబంధం లేకుండా సౌందర్యాత్మకమైన పల్లె పదాలతో ఆ పాటలు రూపొందుతాయి. ఈ పాటలన్ని నియమ రహితాలే.

ప్రజల నోటిద్వారా ప్రచారం అవుతాయి. గ్రంథస్థమై ఉండవు. ఈ పాటలకు కొన్ని చోట్ల దీర్ఘపదాలు, మరికొన్ని చోట్ల హ్రస్వాంతపదాలు ఉంటాయి. ఇంకొన్ని చోట్ల ఈ రెండు కలగాపులగంగా కూడా ఉండవచ్చును. నూతన పద కల్పనలు జరిగిన చోట ఆ పాట కొత్త రూపాన్ని కూడా తీసుకుంటుంది. ఈ సంప్రదాయం నుంచి తెలుగు కవిత్వంలోకి ప్రవేశించిన వ్యక్తి గద్దర్. కనుక నన్నయ, గురజాడను యుగకర్తలుగా గుర్తించడానికి ఏ ప్రమాణాలనైతే సాహిత్య ప్రపంచం కలిగి ఉందో గద్దర్‌కు ఆ ప్రమాణాలే వర్తింపచేస్తే ఈ కాలానికి ఆయన యుగకర్తనే. **"ఒక సాహిత్య మార్గం రావడం అంటే కేవలం వస్తువు మారడమో, భాష మారడమో, ఛందస్సులు మారడం మాత్రమే కాదు. రచనా సూత్రాలు మారుతాయి"** (వేల్చేరు నారాయణరావు, 2008; పే.86) ఈ సందర్భాన్ని గురజాడకు అన్వయించి ఈ కారణం చేత ఆయన ప్రారంభించిన కవితా మార్గానికి నిజమైన వారసులు లేకపోయారు. అందుకే గురజాడ యుగకర్త అనే విషయంలో ప్రశ్నలకు తావు ఏర్పడింది. కానీ గద్దర్ ప్రారంభించిన రచనా సంవిధానానికి వందలకొలది వారసులున్నారు. ఆయన ప్రారంభించిన కవితా మార్గం అసంపూర్ణ విప్లవం కాదు, దానికొక గతం, వర్తమానం, కొనసాగింపు ఉంది.

ఎవరైతే సాహిత్య వస్తువులో, భాషలో, ఛందస్సులో మార్పుకు దోహదం చేస్తారో, కొత్త పుంతలు తొక్కుతారో వారే ఆ యుగానికి యుగకర్తలవుతారు. నన్నయ మొదలు పాల్కురికి సోమనాథుడు, గురజాడ, శ్రీశ్రీ తమ సాహిత్య పథంలో ఈ మూడు ప్రయోగాలను చేసారు. కనుక ఆయా కాలాలకు యుగకర్తలుగా రూపొందారు. ఆ తర్వాత అంతకంటే ఎక్కువగా ప్రయోగాలు చేసి కవిత్వాన్ని పతాక స్థాయిలో నిలబెట్టిన కవిగా గద్దర్ మాత్రమే కన్పిస్తారు. తెలుగునాట 1970 జూలై 4న విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. సాహిత్య వస్తువులో, రూపంలో, భాషలో సమూల మార్పులు తీసుకరావాలని విరసం తన లక్ష్యంగా పెట్టుకున్నది. **"..... ప్రజాసాహిత్య, కళా సృజన ద్వారా సంస్కృతిని, కళలను, విలువలను నిరంతరం విప్లవీకరించడం విరసం లక్ష్యం"** (విరసం ప్రణాళిక నిబంధనావళి). ఈ లక్ష్యం చేరుకోవాలంటే ఉత్పత్తి వర్గాల నుంచి కవులు ఎదిగి రావలసినదే. ఉత్పత్తి యేతర వర్గాల నుంచి వచ్చిన సృజనశీలురు ప్రజా కళారూపాలలో విప్లవ సారాన్ని చొప్పించలేరు. సృజనాత్మకం చేయలేరు. విప్లవ రచయితలు నవల, కథ, వచన కవిత రచనకు పరిమితమైతే మధ్యతరగతి వర్గాలను విప్లవానికి సానుభూతిగా మార్చగలరే కానీ విప్లవకర వర్గాలకు వీరి సాహిత్యం చేరలేదు. నిరక్ష్యరాస్యులైన ప్రజల జీవితాలను ప్రభావితం చేసి విప్లవానికి సన్నద్ధులను చేయాలంటే పాట, నాటకం, ఒగ్గుకథ రూపాలే సరైనవనే అవగాహన తెంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుంచే నాజర్ లాంటి కళాకారులకుంది. ప్రజల రూపాన్ని తీసుకొని, విప్లవ సారాన్ని



జోడించి తిరిగి ప్రజలకు అందించే గతితర్కాన్ని మావో ప్రయోగం చేసి ప్రపంచానికి సందేశం పంపించాడు.

విప్లవ కవులకు, రచయితలకు ఏర్పడిన పరిమితిని అధిగమించి కవిత్వాన్ని ప్రజలపరం చేసిన అద్వితీయుడు గద్దర్. ఆయన కవిత్వ వస్తువులో మౌలిక మార్పును తీసుకొచ్చాడు. వర్గపోరాటమనే ఏకశిల భావన చుట్టూ పరిభ్రమిస్తుండిన విప్లవ కవులకు విశాల వస్తువు ప్రపంచాన్ని ఎలా దర్శించాలో గద్దర్ తన కవితా వైవిధ్యం ద్వారా ప్రత్యక్షం చేసాడు. పాశ్చాత్య దేశాలలో ముఖ్యంగా తూర్పు యూరప్‌లో సోషలిస్టు విప్లవాలు విజయవంతమైన పద్ధతిలోనే ఇండియాలో సాధ్యమవుతుందని విప్లవ సృజనశీరులు భావించారు. కనుక దానికి తగిన సాహిత్య వస్తువునే వాళ్లు ఎంపిక చేసుకున్నారు. కానీ గద్దర్ తన జీవితంలో అనుభవించిన అణచివేత, అంటరానితనం నుంచి విప్లవాన్ని కలగన్నాడు. తన విముక్తి విప్లవంలో, వర్గ పోరాటంలో ఉంటుందని నమ్మాడు. అందుకే విప్లవాన్ని భిన్న మార్గాలలో ప్రయాణించే వర్గ పోరాటంగా సాహిత్యం చేసాడు. కులం, స్త్రీ సమస్య, ప్రాంతీయ ఆకాంక్షలు, ఆదివాసీ అస్తిత్వం లాంటి ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలన్నింటికి పరిష్కారంగా విప్లవం, విప్లవ సాహిత్యం ఉండాలనేది తన అవగాహన. కనుకనే మొదటి నుంచి ఈ సమస్యలన్నీ గద్దర్ కవిత్వానికి దినుసుగా మారాయి. విప్లవ కవిత్వానికి ఉండే స్వీయాత్మకతను సామాజికం చేసాడు. కంపెనీలో కార్మికులు, పొలాల్లో రైతులు మాత్రమే కాకుండా అనేక మానవ సంబంధాలను, జీవితపు పార్శ్వాలను, ఉత్పత్తి సంబంధాలను పాటలోకి తెచ్చి సమాజంతో సంభాషించాడు. విప్లవ కవిత్వానికి వస్తు విస్తృతిని కల్పించాడు. **"ఈ పాటల్లో ప్రజలకి వర్గ దోపిడీని వివరిస్తూ వారిలో వర్గ చైతన్యం రగిలించడం, నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం యొక్క ప్రాధాన్యతను తెల్పి ప్రజలని అందులో సమీకరించడం, విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను గురించి చెప్పడం రచనా వస్తువు"** (కె.సురేష్‌కుమార్, 1995; పే.176)

గద్దర్ విప్లవ కవిత్వంలో ప్రయోగించిన భాష విషయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. నిజమైన అర్థంలో ప్రజల భాషను

పాటలోకి ప్రవేశపెట్టాడు. భాష కవితా శిల్పంలో ఒక భాగం. రచయిత కవిత్వంలో వ్యక్తం చేసిన ప్రధాన భావం వస్తువైతే ఆ వస్తువు ఏ రూపంలో వ్యక్తమవుతుందో ఆ రూపమే శిల్పం. సాహిత్య ప్రక్రియ, భాష, భావ ప్రతిమలు శిల్పంలో ముఖ్యమైనవి. సాహిత్య శిల్పంలో ప్రధానమైన ఆకరమే భాష. ఈ భాష నిర్మాణాన్ని, ప్రయోగాన్ని కవిత్వంలో గద్దర్ వ్యక్తం చేసినట్లు మరే కవిలో చూడలేము. సాహిత్య నిర్మాణ పద్ధతులలో భాషను ప్రయోగించే పద్ధతినే శైలి అంటారు. మాట్లాడే భాషలోనూ, రాసే భాషలోనూ శైలి భేదాలు ఉండటం సహజమైనదే. రచనలో భాషను వాడే నైపుణ్యాన్ని శైలి అంటారు. విప్లవ కవిత్వంలోకి తన పాటల ద్వారా గద్దర్ మౌఖిక శైలిని ప్రవేశపెట్టాడు. రాజకీయార్థిక విషయాలను, సైద్ధాంతిక అంశాలను, సామాజిక వైరుధ్యాలను ప్రతి వ్యక్తి అర్థం చేసుకునేటట్టు వివరించే భాష విప్లవ కవికి ఉండాలి. విప్లవ కవి తన సృజనను ప్రజల భాషలో అందించాలి. జనం బాణిలోకి కవిత్వాన్ని గద్దర్ తర్జుమా చేసాడు. ఆయన తన భావాలను, ఆలోచనలను ప్రజలతో ఏకరూపతలోకి తీసుకెళ్లాడు. మొదట గద్దర్ పాటలు తెలంగాణ మాండలికంలో రూపొంది తర్వాత అనేక మార్పులకు గురై సాధారణీ కరించబడుతాయి. పట్టణ మధ్యతరగతికి, గ్రామీణ పేదలకు, పారిశ్రామిక వాడలలోని కార్మికులకు, పండిత వర్గానికి అర్థమయ్యే ఉమ్మడి భాషను రూపొందించి గద్దర్ పాటలను అల్లాడు. అందుకే ఆయన పాటలు ఈ అన్నివర్గాలకు చేరువయ్యాయి. ఆయన పాటకు మూడు గుణాలు ఉన్నాయి. ఆట, పాట, మాట. ఈ మూడు విడి పదాలుగా భాషలో, నిఘంటువులో ఉండవచ్చు. కానీ గద్దర్‌లో ఆ మూడుపదాలు లీనమయ్యాయి. కవి గాయకుడిలో ఇలాంటి అరుదైన లక్షణం కన్పించడం గద్దర్ విషయంలోనే సాధ్యమయింది. **"ఆయన పాటలో ఆకాశం ప్రతిధ్వనించింది. ఆయన పాడితే శిలా పాలనం ప్రకంపించింది. ఆయన పెదవి విప్పితే పల్లె పదాలు జలజల రాలాయి. ఆయన పాటని గ్రామాలూ, నగరాలూ కూడా హృదయం లోకి హత్తుకున్నాయి"** (సురేశ్‌కుమార్, 1995; పే.185)

గద్దర్ పాటకు ప్రత్యేక అస్తిత్వం ఏర్పడటానికి ఆయన ఎంపిక చేసుకున్న సాహిత్య రూపం పాట మాత్రమే కాదని కేవీఆర్ చెప్పి ఉన్నాడు. శ్రమజీవుల కన్నీళ్లకు, రాలిపడే చెమట చుక్కలకు, కారే నెత్తురుకు అక్షరరూపం ఇవ్వటం వలన గద్దర్ పాటకు నామవాచకం అయ్యాడు. ప్రజల జీవితాలను వాస్తవంగా, నిజాయితీగా చెప్పడానికి కావలసిన భాషను ఎంపిక చేసుకోవడంతో పాటు శ్రమైక జీవన వాతావరణంలో ఆయన సంచరిస్తాడు. జీవిస్తాడు. పదాల ఎంపిక, పదబంధాల నిర్మాణ కౌశలం, వాక్యప్రయోగం, అలంకారికత గద్దర్ పాటల్లో సందర్భానుసారం ఇమిడిపోతాయి. గద్దర్ పాటల్లో రచయిత కనిపించడు. ప్రజల ఆరాటాలను, పోరాటాలను కైగట్టి వారే పాటలను అల్లుకొని పాడుతున్న భావనకు శ్రోతలను గురిచేస్తాడు. **'గద్దర్ ప్రజల తలలో పాటల నాలుకయ్యాడు'.** పదాల ఎంపికలో గద్దర్‌ది ప్రత్యేక శైలి. పాటలో తాను చెప్పదలుచుకున్న భావానికి అనువైన పదబంధాలను రూపొందించుకుంటాడు. ఒక సన్నివేశాన్ని కళ్లకు కట్టడానికి ఆయనపడే తపన శ్రోతలందరి అనుభవంలోకి వస్తుంది. **'హొద్దెరోళ్లమండి మేము'** అనే పాటలో వారి జీవితాన్ని మనందరి స్మృతిపథంలోకి తీసుకొచ్చాడు. కొండలు పిండైపోవటం, చేతికందిన కొడుకు, పాలిడిసిన పానమున్న తల్లి, గుత్తబట్టిన దొరోడు లాంటి పదప్రయోగాలు శ్రోతకు విషయం పట్ల గాఢతను కల్గిస్తాయి. **'రక్తంతో నడుపుతాను రిక్షాను'** పాటలో ఏపుకుతింటం పదప్రయోగం రిక్షా కార్మికుడి దుస్థితికి అద్దం పడుతుంది. ఎట్టి బతుకులు, దుక్కి, కంటి పాపలు, పంటసేల, కుప్ప, రాసి ఇత్యాది పదబంధాలు రైతు జీవితానికి అద్దం పడుతాయి. **'పండుగింట్ల పీనుగెళ్ల పండుగ మీద పండుగొచ్చే'** లాంటి జాతీయాలు పాటలోని ఆర్ద్రతను పెంచుతాయి. గద్దర్ పాటల్లో ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ లాంటి అన్యదేశ్యాలు విరివిగా ఉంటాయి. వాటి ప్రయోగం వలననే గద్దర్ పాట అన్ని వర్గాలకు చేరువకావడానికి ఉపయోగపడుతుంది. అంగ్రేజి, ఇంగ్లీషు అని వేర్వేరు పదాలు వాడి ఇంగిలిపీసు లాంటి విరుపు పదాలను కూడా ఉపయోగించాడు. **'అమ్మామ్మా లేకుంటే కామ్ నహీహోతాహై'**. ఒక భాషకు మాత్రమే పరిమితమైన ప్రత్యేక పలుకుబడులు జాతీయాలు అవుతాయి. ఈ జాతీయాలతో పాటు సామెతలు, లోకోక్తులు గద్దర్ పాటలో ఇమిడి పోతాయి. నన్నయ లాంటి సూక్తి నిధిత్వం గద్దర్ పాటల నిండా పరివ్యాపితమై ఉంటుంది. **'అంగట్లోనా అన్ని వున్నను, అల్లుని నోట్లో శని ఉన్నట్లు', 'ఇంటి దొంగను ఈశ్వరుడెరుగడు', 'చదువుకున్నోని కన్నా సాకలోడు మేలు'** మొదలైన ప్రయోగాలన్ని గద్దర్ తన పాటలలో సాధికారికంగా ఉపయోగించాడు.

గద్దర్ పాటలో మార్గ ఛందో నియమం కంటే దేశీ ఛందోపద్ధతి ఎక్కువగా కన్పిస్తుంది. ఈ పాటలు శ్రమలో నుంచి పుట్టటం వలన లయ ప్రధానంగా ఉంటుంది. ఈ లయనే పాటలోని అక్షరాలను నియంత్రిస్తుంది. లయకు అనువుగా అక్షరాలను తగ్గించటమో, పెంచటమో గద్దర్ పాటల్లో కన్పిస్తుంది. కానీ పాట అసాంతం ఒకే ఛందో నియమం పాటించటం సాధ్యం కాదు. ఆయన చాలా సందర్భాలలో ఛందస్సును విరిచేస్తాడు. అక్షరాలను కలిపేస్తాడు.

**"వోట్లేసి <u>పెంస్తిమిరో</u> దొరోడో**
**నిన్ను మాటుగాసి <u>సంపుతమురో</u> దొరోడో**
**<u>కాళ్లదుపులు</u> <u>మొక్కినోల్లమె</u> దొరోడో"** ఈ పాదాలలో అక్షరాలను తగ్గించటం కోసం రచయిత చేసిన ప్రయోగాన్ని గీతగీసిన పదాలలో గమనించవచ్చు. మౌఖిక గీతాల్లో సాధారణంగా 5 మాత్ర గణాలు కన్పిస్తుంటాయి. అయినా కొన్ని చోట్ల మాత్రల సంఖ్య పెరగడం, తగ్గడం ఉంటుంది. ఈ ఎగుడు దిగుడును గద్దర్ పాటలలో కన్పిస్తుంది. కనుక గద్దర్ గానయోగ్యతను ప్రధానం చేసాడు, దానికి

తగిన ఛందో పద్ధతిని పాటించాడు. ఇది ఆయనకే సాధ్యమవుతుం దన్నట్లు సొంతం చేసుకున్నాడు.

వస్తువు నవ్యత, భాష నవ్యత, ఛందో నవ్యత గురజాడ, శ్రీశ్రీతో పాటు గద్దర్‌లో కూడా కనిపించే సాధారణ లక్షణాలు. అయితే వీరి కంటే అదనంగా గద్దర్ ఆహార్యం ప్రత్యేకమయినది. ఆయన వేదిక మీదకు ప్రవేశిస్తున్నాడంటే ఒక కళాఖండం వస్తున్నట్లు ఉంటుంది. ఆ ఆహార్యం గద్దర్‌కు మాత్రమే సొంతం. మునుపటి ప్రజానాట్య మండలి పరిమితులను దాటి గద్దర్ కొత్త ప్రదర్శన రీతులను వేదిక మీదకు తెచ్చాడు. తెలంగాణ ప్రాంతంలో గొల్ల కురుమ సామాజిక వర్గం కళారూపమైన ఒగ్గు కథను పరిశీలించిన గద్దర్ దానిలో చాలా మార్పులు చేసాడు. కొత్త ఒగ్గు కథారూపాన్ని తయారుచేసాడు. ప్రదర్శనకు ముందు శ్రోతలలో దాక్కొని కళాకారులు ఉంటారు. భిన్న మూలల నుంచి వేదిక మీదకు రావటం వలన శ్రోతలలో ఆసక్తిని రేకెత్తించే పద్ధతిని గద్దర్ ప్రవేశపెట్టాడు. ప్రజల బాణీలను విప్లవీకరించి ఒగ్గుకథను రూపొందించాడు. నక్సల్బరీ బిడ్డలు, ఉద్దానం వీరులు, స్వర్ణ ఒగ్గుకథ, ఓరుగల్లు వీరులు, రగల్‌జెండా లాంటి విప్లవ సందేశ రూపంగా ఒగ్గు కథ కళారూపాన్ని మలిచాడు. పాటకు పల్లవి, చరణం ఉండటం సహజం. కాని పాటకు ఒక సాకీని రూపొందించి ప్రదర్శించిన మొదటి వ్యక్తి గద్దర్ మాత్రమే. గద్దరంటే శబ్దం. పాటకు సానుకూలమైన శబ్దాన్ని చేయటం, రాగాన్ని తీయటం ఆయన సొంతం.

గోచి, గొంగడి, మెడలో రుమాలు, చేతిలో ఎర్రని జెండా, మరో చేతిలో కట్టె, పెరిగిన జులపాలు, గడ్డం, కాళ్లకు గజ్జలు... ఇవి గద్దర్ ఆహార్యం. గాత్రమంతా గాత్రమై సింహంలా వేదిక మీద లంఘించే తీరు యుద్ధ సందర్భాన్ని తలపిస్తుంది. ఆయన పాటకు కొనసాగింపైన వంతకులుంటారు. ప్రధాన గాయకుడు పూర్తి పాటను పాడకుండా కోరస్ ఇచ్చేవారు పాటలోని తర్వాతి చరణాలను అందుకునే సంప్రదాయాన్ని గద్దర్ నెలకొల్పాడు. లయాత్మకంగా తన సహచరులతో కదులుతూ ఒక అద్భుత నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తారు. ఆయనకు మాత్రమే సొంతమైన మ్యానరిజాన్ని స్థిరపరిచాడు.

ఈ యాభై సంవత్సరాలలో (1973-2023) వచన కవిత్వం రాసిన ఏ కవి కూడా గద్దర్‌తో సరిపోలలేరు. పాటనే కవిత్వం, కవిత్వమే పాట లాగా గద్దర్ తెలుగు నాట రూఢీ చేసాడు. తన పాట రచన చేత తెలుగు కవిత్వాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లాడు. గద్దర్‌కు ముందు తెలుగు కవిత్వం గద్దర్ తర్వాత తెలుగు పాట అనే విభజన రేఖను గీసాడు. వేమన, అన్నమయ తమ కవిత్వం ద్వారా, కీర్తన ద్వారా కొందరి ప్రజలను చేరుకోగల్గినారు. కానీ గద్దర్ తెలుగు తెలిసిన ప్రతి ఒక్కరితో, దేశవ్యాపితంగా తెలుగేతర ప్రగతిశీల,



ప్రజాస్వామిక, దళిత వర్గాలకు కూడా తెలుసు. ఇంతటి విశేష ప్రాచుర్యం కలిగిన మరో కవి భారతీయ భాషలలో లేదు. గురజాడ పూర్ణమ్మ, శ్రీశ్రీ భిక్షువర్షియసి, కవితా ఓ కవితా, శివసాగర్ చెల్లీ చంద్రమ్మ లాంటి పాత్రలు, జీవితాలు, కవితా విలువలు గద్దర్ ఎన్నింటినో సృష్టించాడు. ఈ యాభై ఏళ్లలో గద్దర్ వలె పాడాలని, ఆడాలని, రాయాలని, ఆహార్యం ఉండాలని తపించేవాళ్లు వందల సంఖ్యలో ఉంటారు. శ్రీశ్రీ కంటే ఎక్కువ మంది గద్దర్‌ను అనుసరించే వాళ్లు ఉన్నారు. కొన్ని తరాల మీద గద్దర్ చెరగని ముద్రవేసాడు. అతని ప్రభావం మరో యాభై ఏళ్లు ఉంటుందని చెప్పటంలో అతిశయోక్తి ఉండకపోవచ్చు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో ఒక కథాపురుషుడు వెన్నుపూసలో తుపాకి గుండుతో పాతిక సంవత్సరాలు సమాజాన్ని గానం చేసాడు. అందుకే ఆయన యుగకర్త. ఇపుడు గద్దర్ లేదు. ఆయన పాట గాలిలో పరివ్యాపితమై ఉంది. ప్రజల నాలుకలలో సుకవిలా జీవిస్తూనే ఉంటాడు.

**జ్ఞాపికలు :**

1. గద్దర్ – తరగనిగని; జననాట్యమండలి ప్రచురణ 1992, హైదరాబాద్

2. దివాకర్ల వేంకటావధాని–ఆంధ్ర వాఙ్మయ చరిత్రము; ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణ, 1981, హైదరాబాద్

3. నారాయణరెడ్డి సి. – ఆధునికాంధ్ర కవిత్వము; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 2011, హైదరాబాద్.

3. వేల్చేరు నారాయణరావు – తెలుగులో కవితా విప్లవాల స్వరూపం; తానా ప్రచురణలు, 2008, యు.ఎస్.ఎ.

4. శ్రీశ్రీ – శ్రీశ్రీ వ్యాసాలు; విరసం ప్రచురణ, 1990, విశాఖపట్టణం.

5. సురేశ్‌కుమార్ కె. – గద్దర్ పాటలు–పరిశీలన; కేంద్రీయ విశ్వవిద్యాలయం, 1995, హైదరాబాద్.

6. విరసం ప్రణాళిక నిబంధనావళి.

7. ప్రజాయుద్ధ పాటకు చావులేదు; జనం పాట ప్రచురణలు, 1999, సికింద్రాబాద్.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11  హైదరాబాద్ సెప్టెంబర్ : 2023





















గద్దర్‌కు సంబంధించిన కొన్ని ప్రత్యేక ఫొటోలు

# కాలాన్ని జయించిన గద్దర్ పాట

**ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు,** ఫోన్ : 9441 330 511

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేను పిహెచ్.డి. చేస్తున్న రోజులవి. ఒకరోజున కాన్వకేషన్ హాల్ దగ్గర ఇసుక వేస్తే రాలనంత మంది జనం గుమికూడి ఉన్నారు. బయటకూడా గుంజలు పాతి మైకులు అమర్చి ఉన్నాయి. అప్పట్లో ఇప్పటిలాగా బయట స్క్రీన్లు అమర్చి, లైవ్ టెలికాస్ట్ చేసే సౌకర్యాలు లేవు. కొర్లపాటి శ్రీరామమూర్తి గారు రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నారు. అంత పెద్ద ప్రొఫెసర్, అంత గొప్ప విద్యావేత్తను ఆ జన సందోహం పట్టించుకునే స్థితి లేదు. ఒక మూల రోడ్డుమీదే నిలబడి ప్రసంగాన్ని వింటున్నాడు. ఇంతకూ ఆ ప్రసంగం ఎవరిదంటే గద్దర్ది. ఏ రాజకీయ నాయకుడూ తరలించిన జనం కాదది. ఏ ప్యాకెట్లకో, కరెన్సీ నోట్లకో ప్రలోభపడి వచ్చిన జనం కాదది. గద్దర్ పాట కోసం, తమ గుండెల్లో రగులుతున్న అసంతృప్తికి, ఎదురుగా సాకారమై నిలిచి చేసే ప్రసంగం కోసం వచ్చిన ప్రజాసమూహమది. అదే నాకు తొలి అనుభవం కాదు.

నేను ఎం. ఏ. చదువుకునే రోజులవి. విద్యార్థి సంఘ వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా విద్యా నాయకులు ఆహ్వానించారు. ఆ రోజులలో నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆర్.ఎస్.యు. ప్రధాన పాత్ర పోషించేది. ఇప్పటిలాగా ప్రాంతీయ అస్తిత్వధోరణి ప్రబలిన రోజులు కావవి. వరంగల్ నుండి ఎంతోమంది విద్యార్థులుండేవారు. అప్పుడు కారంచేడు సంఘటన జ్వాలలు పూర్తిగా ఆరిపోని రోజులవి. గద్దర్ వచ్చిన ఆ సమావేశం అర్ధరాత్రి వరకు సాగింది. పాటలు, ఆట, ప్రసంగం మూడు కలగలిసిన ఆయన ప్రసంగాన్ని వింటూ విద్యార్థులు రాత్రి మెస్‌ను కూడా మరచిపోయి ఆ ప్రసంగంలో లీనమైపోయారు అంటే అతిశయోక్తి కాదు.

గద్దర్ మీద ఎటాక్ జరిగినప్పుడు నేను 'సుప్రభాతం' పత్రిక ఎడిటర్ శ్రీవాసుదేవరావు గారితో కలిసి నిమ్స్‌లో గద్దరును కలిసి పరామర్శించి వచ్చాను. ఆ తరువాత పోలీసులు కొన్నాళ్లు మా కుటుంబంపై నిఘా వేసి యుంచారు. చివరకు ఇది 'సన్న్యాసి' కుటుంబ మని నిర్ధారించుకున్నాక ఆ డేగకన్ను మా మీద నుండి తొలగింది. ఆసందర్భంలోనే తూటాలను జయించిన పాట – అనే కవితను రాసి ప్రచురించాను. ఆ కవిత ఇప్పటికీ నా వద్ద ఉంది. దానిని ఇక్కడ పొందుపరచటం అప్రస్తుతం కాదనుకుంటాను.

**నాభిలోనుండి తన్నుకొచ్చే ప్రణవనాదం ఆపాట**
**మాంసాణువుల్ని మంత్రాణువులుగా మలచే అభిమంత్రం ఆ పాట**
**శోకాల కార్చిచ్చుతో అలసిపోయిన మనసుల్ని ఓదార్చే మలయ మారుతం ఆపాట**
**ఆ పాట పీడిత జనులబాట / ఏ దిక్కూలేని అనాథలకు వేసిన పెద్ద పీట**
**ఆ పాట ఖద్దర్ కన్నా స్వచ్ఛమైనది / పసుపు కన్నా పవిత్రమైనది**
**నడచే బాటలో 'ముఖద్దర్' లా అండగా నిలచేది**
**ఆ పాటకు కళ్ళ నిండా దయ / ఆ పాటకు గుండె నిండా లయ**
**ఆ పాట గజ్జెకట్టి ఆడితే / బొజ్జలు పెంచిన గణపయ్యలకు దిగులు**
**గద్దెలనెక్కిన బొల్లి గద్దలకూ దిగులు**
**ఎందుకంటే / దారిద్ర్యరేఖకు అది అదృష్ట రేఖ కాబట్టి**
**ఆ పాటను బంధిస్తే సహించారు.**



**ఆ పాటను బాధిస్తే భరించారు**
**అయినా ఆ పాట**
**సంకెళ్ళను దాటి ప్రవహించింది.**
**ఎందరో ఉద్యమపు నెల బాలురను ప్రభవించింది.**
**దిగంతాలను జయించింది.**
**భరించలేని సహించలేని మనసు కుళ్ళిన గద్దలు**
**ఆ పాటను తూటాలతో పొడిచాయి**
**పీడ విరగడైపోయిందని తెగ సంబర పడ్డాయి.**
**ఆ పాట పోతే మరో పాట పుడుతుందా?**
**ఎన్నాళ్లకు?**
**అయినా అది ఆ పాట అవుతుందా?**
**ఆ పల్లవులను పల్లవిస్తుందా ?**
**ఆ శ్వాస పవనం ఆగిపోతే**
**మరో ఆశా పవనం రాదా?**
**వస్తుందా? ఆ నమ్మక ముందా?**
**వచ్చినా ఆ ఆశల పల్లకీలు తెస్తుందా?**
**ఇది ప్రజల చింతన, ఇది ప్రజల వేదన.**
**అందుకే ఆ ప్రజా చైతన్యం**
**పెత్తనం చేస్తున్న గద్దెలపై తిరగబడ్డది**
**గుండె చప్పుళ్లనే డప్పులుగా మ్రోగించి**
**పై రవినే నిలదీసింది.**
**ఆ పాట కోసం పరుగు లెత్తింది.**
**నాగటి కర్రలనుంచి / నాగరికపు బుర్రలవరకు**
**ఆ పాటకోసం గంగ వెరులెత్తిపోయాయి.**
**ప్రాణవాయువు ముందు పచ్చని హరితం ముందు**
**'బొగ్గుపులుసు వాయువు'– మనుగడ ఎంత సేపు?**
**అందుకే ఆ పాట తూటాలను జయించింది.**
**మళ్ళీ కొత్త నడకలు నేర్చి**
**సరికొత్త పల్లవులతో**
**గజ్జెకట్టి / నవస్వామ్యానికి ఊపిరులూదుతోంది!"**

నవస్వామ్యం కోసం తూటాలను జయించి బ్రతికిన ఆ శ్వాస పాట రూపంలో మాత్రమే నేడు మిగిలింది. ఎన్నెన్ని గీతాలు ప్రజల నాలుకలపై నిల్చి నాట్య మాడాయో, ఎన్ని గేయాలు పీడితుల శ్వాసలై ఆశల్ని పంచాయో చెప్పడానికి ఏ దస్తావేజులు సరిపోతాయి! ఆయన రాసిన ప్రతి గీతమూ ఒక కావ్యంతో సమానం. నిద్రిస్తున్న తెల్లగన్నేరును ఎర్రగన్నేరుగా మార్చిన అరుణారుణ సంగీతం ఆయన పాట. జీవితానుభవంలో నుండి, కళ్ళముందు కనిపించిన దృశ్యాలలో నుండి పురుడు పోసుకున్న ఆయన పాటలలోని చైతన్యాన్ని తెలిసిన వాడు సమాజ పరమేశ్వరుడొక్కడే! ఆయన కన్నీటిపాట కరుణ రససముద్రం. ఆయన ఆవేశంతో సంధించే మాటల దండ పాటై, పోరుబాటై అగ్నివీణ, రుద్రవీణలై ప్రళయ కాల రుద్రుల్ని సృష్టించింది.

శ్రీశ్రీ కవిత్వాన్ని చదివి కమ్యూనిష్టు కానివాడూ, గద్దర్ పాట విని పిస్తోలు పట్టనివాడు ఉన్నాడంటే వాడి చైతన్యాన్ని సంశయించాలని యువతరం భావించేది. ఆయనొక మహోద్యమం. ఆయన రాసిన ప్రతిపాటా ఒక మహాకావ్యంలోని ఒక ఘట్టాన్ని చదివితే హృదయంలో ఎలాంటి అనుభవం కలుగుతుందో అలాంటి అనుభవమే శ్రోతకు కలుగుతుంది. సాధారణంగా కావ్యంలో సహృదయుడైన పాఠకుడికి రసానుభూతి కలగటానికి ఒక సోపాన క్రమం అవసరం. అంటే విభావానుభవాలు, సాత్త్వికోదయం, సంచారీ భావాల నిష్పన్నత వంటి ఒక సోపానక్రమం అవసరం. కానీ పాట విషయంలో శ్రోత అనుభూతి చెందటానికి ఈ సోపానక్రమంతో పనిలేదు. సరాసరి శ్రోత సంస్కారం, గాయకుని ప్రతిభ ఈ రెండూ సరాసరి శ్రోత చిత్తాన్ని గానంతో లయం చేయవచ్చు. ఇది సంగీతపు గొప్పదనం. కాని గద్దర్ పాటలో భావపు బలం, ఆ భావాన్ని అందించే తీరు జానపద గాయకుడి సౌరు వంటిది. అచ్చమైన ఆ జానపద బాణీ సరాసరి ప్రజల హృదయాన్ని తాకుతుంది. కళ్లముందు కనబడే దురాగతాలే, ప్రతి వ్యక్తీ అనుభవంలోనివే ఆయన పాటకు వస్తువు. వందలాది ఆయన పాటల్లో ఒక పాటను పరిశీలిద్దాం.

'నిండూ అమాసా నాడు' – అనే పాట వెనుక ఉత్తరభారతంలో రహస్య జీవనం గడుపుతున్నప్పటి కాలంలో తాను చూచిన దృశ్యమేనని – సన్నిహితంగా గద్దర్తో మెలిగిన మిత్రులు రాశారు. ఆ పాట వింటుంటే లేదా చదువుతుంటే కన్న తల్లి హృదయంలో తిరిగే సుడులు ఎలా ఉంటాయో తెలిపి మనల్ని కన్నీటి సంద్రంలో ముంచెత్తుతుంది. ఆడపిల్ల పుట్టుకే శాపంగా భావించే సమాజంలో తీరని కన్నీటి అలజడి ఆపాట. ఈ పాటను గమనించండి.

**"నిండూ అమాసానాడు – ఓలచ్చా గుమ్మాడీ**
**ఆడపిల్లా పుట్టినాదే – ఓలచ్చా గుమ్మాడీ**
**అత్త తొంగి సూడలేదు, మొగుడూ ముద్దాడలేదు**
**బట్టలల్ల సుట్టుకోని – బాయిలో పడేయబోతే**
**గంగమ్మ కొంగు చాపి – సెల్లె దనమియ్యమంది**
**సెత్తగంప లేసుకొని – సెత్తకుండీలెయ్య బోతే**
**కుక్క పిల్ల అడ్డమొచ్చి – అక్క అడ్డు సేయకనే**
**ఊపిరాడ కుండనేమో – బొంతమీద బొంతగప్పి**
**సిల్లీరంధ్రం నుండి – సిన్నంగ చూస్తుంది**
**పున్నమిదినము నేనె – పుట్ట కాడ పడవేస్తే**
**నాగన్న పడిగె విప్పి – గొడుగు బట్టిండమ్మ**
**పురిబోసినట్లు నేను నల్ల బూస దారం గుడితే**
**నల్ల పూస దండలాయె మల్లెపూల దండలాయె**
**పాలు తాగనని నేను పంతాలు పట్టుకొంటే**
**పాలసేపులు దుంకి పోయె పాప నోట్లో బద్దదమ్మో**
**వరిగింజ నోట్లో వేసి గొంతు బిస్కపోతే**
**పెదవులేమొ అడ్డమొచ్చి పుల్కు పుల్కు నవ్వెనమ్మో**
**కనుకున్న కడపు కోత కన్నీటి దారాలాయె**
**పేగు కోసి పెంచుకున్న నా పాపనెట్లు పారేయా**
**ఆడదానితో అన్న మనిరి – మొగోనితో పిల్లలనిరి**
**మొగబిడ్డ చెయ్యని పాపం – ఆడ బిడ్డ లేమిచేసె**
**ఆడ బిడ్డలేనిదే లోకమెట్లు పుట్టి పెరిగె**
**కన్న బిడ్డమీదనే కన్న తల్లె పగ బడితె**
**నాకు దిక్కెవరే బిక్కు బిక్కు ఏడ్చే బిడ్డ**
**చిట్టి చిట్టి కండ్లతోనె – సూటి ప్రశ్న వేసే బిడ్డ**
**నేను సెత్తల్లో పారెయ్యనమ్మా – నా పొత్తిళ్లల్లో దాసుకుంటూ**
**నేను వొరిగింజ వేసి చంపా – నేను ఉపిపోసి చంపుకోను**
**నిన్ను సమ్మక్క చేస్తా – సారక్కను చేస్తా**
**అక్కా శోభక్కను చేస్తా – చెల్లీ కుమారిని చేస్తా"**

ఈ పాటలో ఆడపిల్ల పట్ల సమాజంలో ఉన్న తిరస్కారాన్ని కన్నతల్లి వేదనగా ప్రత్యక్షీకరిస్తూనే సమాజాన్ని ప్రశ్నించటం కనిపిస్తుంది. చిట్టి చిట్టి కళ్లతో పసిబిడ్డ వేసే ప్రశ్న మాతృత్వానికే ప్రశ్న! బిడ్డను వదులుకోలేని తల్లి ఆక్రందనను తల్లి ముఖంగా ఎన్ని రకాలుగా ఆవిష్కరించవచ్చో అన్నిరకాలుగా ఆవిష్కరించటం ఈ గేయంలో కనిపిస్తుంది ఈ గేయంలోని ముగింపును గురించి ముచ్చటించుకోబోయే భారతంలో కుంతీదేవి సద్యోగర్భంలో కర్ణుడిని కన్న సందర్భంలో పుత్రవాత్సల్యంతో, లోకాపవాద భీతితో వదలలేక పడ్డ వేదనను నన్నయ –

**తరువోజ**

ఏలయమ్ముని నాకు నిచ్చె నిమ్మంత్ర మిమ్మంత్రశక్తి
యేనెఱుఁగంగ వేడి
యేల పుత్రకుఁగోరి యెంతయు భక్తి నినుఁదలంచితి
బ్రీతి నినుడును నాకు
నేల సద్యోగర్భమిచ్చెఁగుమారుడేల యప్పుడ
యుందయించె నింకెట్లు

లీలోక పరివాదమేనుడిగింతు? నింతకు నింతయు
నెఱుఁగరె జనులు! (ఆది. 5-28)

**వసంత తిలకం**

ఈ బాలునెత్తికొని యింటికిఁజన్న నన్నున్
నా బంధులందఱు మనంబున నేమనా? రె
ట్లీ బాల సూర్యనిభునిట్టులడించి పోవం
గా బుద్ధి పుట్టు? నని కన్యమనంబులోనన్ (ఆది. 5-29)

వందురి వగచినట్లు చిత్రించాడు. కుంతి సమాజానికి భయపడటం ప్రధానంగా కనిపిస్తుంది. రాచబిడ్డ కావటం, ఆనాటి సామాజిక నిర్బంధాలు ఆమెను మానసికంగా భయపెట్టాయి. గద్దర్ పాటలో యువతి కుంతి వంటిది కాదు. ఆమె బాధంతా ఆడపిల్ల పట్ల సమాజం చూపే వివక్ష పట్లే. చివరికి 'నేను సెత్తలో పారెయ్యను, బావిలో పడెయ్యను, వొరిగంజ నోట్లో వేసి చంపను, సమ్మను సారక్కను చేస్తా' నంటుంది. సమ్మక్క సారక్కలు తెలంగాణా సాంస్కృతిక భూమిక నుండి దేవతలుగా వెలసిన ప్రతిఘటన శక్తులు. చివరిగా 'శోభక్కను చేస్తా, చెల్లీ కుమారిని చేస్తా' ననటం ఆధునిక సమకాలీన చైతన్యానితో సంవదింపచేయటమే!

ఇలా ఆయన రాసిన ప్రతి పాటా ముగింపు పీడిత సమాజానికి ఓదార్పుగా, పీడక పక్షానికి కనుమెరుపుగా కనిపిస్తుంది. గద్దర్ రాసిన పాటలలో ఎక్కువగా ఎలిజీలు కనిపిస్తాయి. జన నాట్య మండలి ప్రచురించిన పాటల్ని గమనిస్తే ఆ విషయం తేటతెల్లమవుతుంది. కవుల్ని పోషించిన రాజులు, కృతిపతులై చిరంజీవులయినట్లే, పోరుబాటలో రాలిపోయిన వీరులను అమరుల్ని చేస్తూ 'లాల్ సలాం' అంటూ పాడిన పాటలన్నీ ఆ వీరుల త్యాగస్మరణంతో పాటు చరిత్రలో రికార్డ్ చేయటమే!

అన్ని పాటలనిండా కవిత్వం తొణికిసలాడుతుంది. రాసిన ప్రతి పాటా కవిత్వపు ముద్ద కాకపోవచ్చు. కానీ సలసల కాగే రక్తఘోషకు, కూల్చే వేదనకు అక్షరాకృతి. మా అమ్మ కట్టెల పొయ్యి ముందు దీనంగా కూర్చుని వంట చేస్తున్న ఎన్నో సందర్భాలలో 'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో, చినబోయి కూచున్నావెందుకమ్మో' అంటూ (సందర్భం ఏదైనా) పాడితే, మా అమ్మ మళ్ళీ మామూలుగా నన్ను ఆదరించేది. ఇలా కన్నవాళ్లందరూ కన్నతల్లితో కనెక్ట్ అయిన పాట. ఆ లచ్చుమమ్మ, కొడుకులందరికీ కన్నతల్లులను మనసులో గుర్తు చేసే హృదయ తంత్రి. కొన్ని పాటలలో కవిత్వం తొణికిసలాడుతుంది. మనల్ని నిలువెల్లా పులకింప చేస్తుంది.

**"పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడె**
**అడవిలో వెన్నెలమ్మ ఆకులముద్దాడె - చిగురాకుల ముద్దాడె**
**పొత్తిళ్లో నెత్తురు గుడ్డును తల్లీ ముద్దాడె - కన్న తల్లి ముద్దాడె**
**పాలాసేపులను పాపలు ముద్దాడె - పసిపాపలు ముద్దాడె**



**యుద్ధముల్లో యోధుడిని తుపాకీ ముద్దాడె -ఆ తూటాలు ముద్దాడె**
**ఒరిగిన వీరుడిని భూమితల్లి ముద్దాడె..."**

ఈ పాటను విన్నప్పుడు, గద్దర్ అభినయంతో స్టేజీపై చూసినపుడు ప్రేక్షకులు పొందే అనుభవం ఏ మహాకావ్యాన్నో చదివినప్పుడు పొందే అనుభవం లాంటిది.

**"అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా!"** వంటి పాటల్ని విన్న ఎవరైనా ఆ ప్రభావంతో సమ్మోహితుల్కై పోవలసిందే.

**"వెండీ బంగారం దండిగ ఉన్నా, బోడి మెడతో గొల్లు నేడ్చినది"** సింగరేణి అని, **"కోటి దేవుళ్లకు దీపం పెట్టిన కూటికి లేని తల్లిని చూడు', 'కోటి పాటల తల్లోయమ్మ, ఆట పాటలా తల్లోయమ్మ - నోటి మాట రాని తల్లోయమ్మ"** - కృష్ణమ్మ తల్లి తెలంగాణకు కన్నీళ్ళు తప్ప కరుణించలేదు. **'గోదారమ్మ తెలంగాణను గొడ్రాలును చేసి పోయిందమ్మో'** అంటూ పాడిన పాట తెలంగాణ యువకుల గుండెల్ని రగిల్చి, హృదయాల్ని కన్నీటితో తడిపిన పాట. అలాంటిదే **"పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా! పోరు తెలంగాణమా!"** అనే గీతం కూడా.

పాట ద్వారా పీడిత జనుల జీవితంలోకి ప్రవేశించిన యుద్ధనౌక గద్దర్. ఆర్ద్రత, చైతన్యం రెండు రెక్కలుగా ఎగిరే పిట్ట ఆయన పాట. సమకాలీనమైన ప్రతి సంఘటనను, పాట ద్వారా అధిక్షేపించారు. సన్నటి హాస్య జీరను పొదిగి విమర్శించటం ఆ సన్నివేశానికి రక్తినే సమకూర్చింది తప్ప అపహాస్యాన్ని కలిగించలేదు. తొంభయ్యో థకం మొత్తం గద్దర్ తిరుగులేని శాసకుడ్కె, సాయుధ పోరాట ప్రబోధం గావించాడు. నమ్ముకున్న సిద్ధాంతానికి అంకితమై వయసు మళ్లిపోయే వరకు త్యాగమే శ్వాసగా జీవించిన ఆ త్యాగానికి విలువ కట్టగల షరాబులెవ్వరు?

**"నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా**
**తోడబుట్టిన ఋణం తీర్చుకుంటనే చెల్లెమ్మా"** వంటి పాటల్లోనే కాదు, ఒరిగిపోయిన అమర వీరుల స్మృత్యకంగా...

**"కావు కావున కాకులరిసె, తలుపు తెరసి పలుకరిస్తం**
**ఎవ్వరొస్తరొ సెప్పుమానీ తొవ్వ చూస్తు కూర్చుంటం**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (30) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

**మీరు కాకమ్మలై వస్తారా! మా బిడ్డలు**
**మా కడుపు తీపి తీర్చిపోతారా!"**

వంటి పాటలలో కూడా సెంటిమెంట్‌ను కేంద్రం చేసుకొని తల్లి కడుపు తీపిని ప్రధానంగా చెపుతూ శ్రోతల హృదయాన్ని కరుణతో తడిపేస్తాడు. విత్తనాన్ని విత్తటానికి రైతు క్షేత్రాన్ని జలంతో తడిపి పదును చేయటం లాంటిదే ఈ ప్రక్రియ. శ్రోతల్ని లేదా ప్రేక్షక శ్రోతల హృదయాల్ని తడిపి, ఆర్ద్రమైన ఆ హృదయ క్షేత్రంలో విప్లవ చైతన్యభావాల్ని నాటటం గద్దర్ పాటకున్న తిరుగులేని విజయ రహస్యం.

నాజర్ బుర్రకథలోని ప్రత్యక్షానుభవం మాటల్ని ఈటెలుగా పేల్చే శ్రీశ్రీ లక్షణం, జానపద కవుల నిసర్గ కవితా లక్షణం గద్దర్ పాటలో ప్రధాన దినుసులు. చెప్పులు, చీపురుకట్ట, చెత్తకుండీ వంటి సాధారణ వస్తువులనుండి, వివిధ ఉద్యమ ధోరణులతోపాటు, సమకాలీన ప్రతీ సందర్భాన్ని పాట రూపంలో అక్షరీకరించిన పాటవం గద్దర్ది.

మారిపోయిన ఉద్యమ పార్టీల తీరు, రాజకీయ పార్టీల మోసాలు కళ్లారా చూసిన అనుభవంతోనే రామానుజుని విగ్రహం ముందు ఆయన సమతా ధర్మాన్ని గానం చేశారు. గద్దర్ మరణంతో తెలుగునాట మాత్రమే కాదు, తెలుగు సాహిత్యంలో కూడా ఒక శకం ముగిసింది.

విప్లవ పంథాను భుజాన మోయగల అటువంటి అక్షరయోధుని కోసం పీడిత పక్షాలు కాలపురుషుని వైపు జాలిగా ఎదురు చూస్తున్నాయి.

## లచ్చుమమ్మా

సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీవు సినబోయి కూసున్న వెందుకమ్మో ఎందుకమ్మా
మోకాళ్లమట్టూకు బురదలో దిగబడి
ఎద్దోలే ఎనుకకూ ఒక్కొక్క అడుగేసి
అయ్యో నాట్లేసి నాట్లేసి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ నడుములే ఇరిగేనా లచ్చుమ్మమ్మో లచ్చుమమ్మా ॥సిరిమల్లె॥

కాళ్లు గడుపులు మొక్కి దొరకు గొయ్యాబోతె
వరిమోపు ఎత్తుకొని బిరబిర నడువంగ
అయ్యో కాల్జారి పడ్డావ లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ కాల్జేయి ఇరిగేన లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరిమల్లె॥

నెత్తంత మాసింది రయికంత శినిగింది
కొత్తది కొననీకి పైసలు లేవాయె
కుంచి పేల్కలు గట్టి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీవు కూలికె బోయినవ లచ్చుమమ్మో లచ్చుమమ్మా॥సిరిమల్లె॥

పాసిపోయిన బువ్వ మాడిపోయిన గట్క
సలిగంజి పోసుకొని సప్పదే మింగితే
కక్కుడేర్గుడు పెట్టి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ దొక్కంత గుంజింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరిమల్లె॥

గాడ్పొచ్చి గుడిసెంత గాలికెగిరీ పాయె
సలికాలమొచ్చింది సాప సింపులు లేవు
సలికి ఒణుకుడుబెట్టి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ సంటోడు సచ్చింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥సిరిమల్లె॥

ఆకలికి పోరగాండ్లు అల్లాడిపోవంగ
అన్నా రెడ్డికి నీవు జొన్నకొయ్యాబోతె
అయ్యో జొన్న కొయ్యాదిగి
నీ కాలంత వాసింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥ సిరిమల్లె ॥

ఏనె గుండ్ల కింద సవుకారి గుండంల
ఎరువు సల్లాబోతె ఎర్రతేలు కరిసి
పోట్లు మంటలెత్తి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీవు పొలమంత బొర్లినవ లచ్చుమమ్మో లచ్చుమమ్మా ॥ సిరిమల్లె ॥

దసరా పండుగ వచ్చె దమ్మిడీ లేదాయె
దీపావళి వచ్చె దీపంతె లేదాయె
శివరాత్రి వచ్చింది ఉపవాసముండాలె
బతుకంత శివరాత్రి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ బతుకంత అమవాస లచ్చుమమ్మో లచ్చుమమ్మా॥ సిరిమల్లె ॥

ఏ కర్మమనుకోని ఏడుపాయలెల్లంగ
గాచారమనుకోని నాచారమెల్లంగ
తొవ్వలో దొంగలు లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ బువ్వ గుంజూకొనిర లచ్చుమమ్మో లచ్చుమమ్మా॥ సిరిమల్లె ॥

పక్కింటి పోశమ్మ ఎనుకింటి ఎల్లమ్మ
ముందింటి ముత్తమ్మ ఇరుగింటి ఈరమ్మ
కూలోల్లకందరికి కూడు దొరకాలని
కొమిరెల్లి కొండల్లో లచ్చుమమ్మో లచ్చుమమ్మా
వాళ్లు కొలిమి రాజేసిండ్రు లచ్చుమమ్మో లచ్చుమమ్మా॥ సిరిమల్లె ॥

ఎన్నాళ్లు ఏడ్చేవు ఎంతాని ఏడ్చేవు
ఏడ్చినా తూడ్చినా ఏమి సాధించేవు
నీ తోటి చెల్లెళ్లు నీతోటి తమ్ముళ్లు
పోరుబాటలోన ఎత్తింద్రు కొడవళ్లు
కొడవండ్లు నూరుకొని లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీవు కూలి దండులో చేరు లచ్చుమమ్మో లచ్చుమమ్మా

కూలి దండులో చేరు లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ కొడుకులను కలువే లచ్చుమమ్మో లచ్చుమమ్మా

# విప్లవ 'గీతా'కారుడు – గద్దర్

**డా॥ కోయి కోటేశ్వర రావు,** అధ్యక్షులు, తెలుగుశాఖ, సిటీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 94404 80274

ఎం.ఏ., చదువుతున్న రోజుల్లో హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆడిటోరియమ్‌లో తొలిసారిగా **'పోటెత్తిన పాటల కడలి'**ని చూశాను. హోరెత్తిన మహా గాన సునామిని దర్శించాను. పీడితప్రజల పిల్లనగ్రోవిని విన్నాను. భూమి గుండెలదిరేలా సాగిన ప్రళయ తాండవం తిలకించాను. 'పాటల రంగ విఠల్' విశ్వరూపాన్ని సందర్శించాను. విప్లవ గీతోపదేశం ఆలకించాను. అన్నింటికీ మించి ఒక ప్రత్యామ్నాయ జ్ఞాన యుద్ధాన్ని చూశాను. ఆ జ్ఞాన యుద్ధం పేరు గద్దర్. అపూర్వమైన గద్దర్ కళా ప్రదర్శన నా హృదయంలోనే కాదు విశ్వవిద్యాలయంలో కూడా పెను ప్రకంపనల్ని సృష్టించింది. నాలో ఎంతో భావోద్వేగాన్ని, భావోత్తేజాన్ని రగిలించింది. అప్పటివరకు సంప్రదాయ సాహిత్య మోజులో, పద్యకవిత్వపు మత్తులో ఊగిపోతున్న నాకు తన ఆట, పాటతో గద్దర్ సరికొత్త సాహిత్య ప్రపంచాన్ని చూపించాడు.. ఆయన పాటల్లో పదివేల శేషుల పడగలమయమై బుసలు కొడుతున్న అసమ సమాజ రీతి, రాజకీయదుర్నీతి బోధపడింది. మా అమ్మ గురించి, మా అయ్య గురించి, మా ఊరు గురించి బాగా తెలిసినట్లుగానే గద్దర్ పాటలు పాడుతున్నాడేమిటి? అన్న సందేహం కలిగింది. రేడియో గీతాల్లో, సినిమా పాటల్లో కనిపించని వినిపించని సాహిత్యసంగీతాలు గద్దర్ పాటల్లో నవ నవోన్మేషంగా సంగమించాయి. **"ఏం పిల్లడో ఎల్దమొస్తావా"** అని గద్దర్ పాడుతుంటే, ఉద్విగ్నభరితమైన భావోన్మాదంతో ఆ విప్లవ ప్రేమప్రవాహంలో పడి ఆయన పాటతో లేచి పోదామనిపించింది. శ్రీమన్నారాయణుడందించే ముక్తి కంటే దరిద్రనారాయణుడి దాస్య విముక్తి అతిముఖ్యమనే సోయికలిగింది. అశోకవనంలో శింశుపా వృక్షం కింద కూర్చున్న సీతమ్మ దుఖం కంటే సిరిమల్లెచెట్టు కింద చినబోయి కూర్చున్న లచ్చుమమ్మ శోకం గాఢమైనదని గద్దర్ పాట గుర్తు చేసింది. తెలుగుశాఖ ఆచార్యులు కె.కె. రంగనాథాచార్యులు బోధించిన విప్లవ సాహిత్యతత్త్వం, ముదిగొండ వీరభద్రయ్య చెప్పిన కళాతత్త్వం, రవ్వా శ్రీహరి శోధించిన మాండలిక పదకోశం వీటన్నిటికీ గద్దర్ పాట లక్ష్యప్రాయంగా కనిపించింది. నేను చదవని విస్తారమైన బతుకు సిలబస్ గద్దర్ పాటల్లో అవగతమైంది. పద్య ఛందస్సుకు ప్రాణం పోసిన అనాది గాయకులెవరో, అసలు సిసలైన ఆది కవులెవరో, ఎవరి బాధల్ని కవిత్వీకరించాలో, ఏ భాషలో రాయాలో, వస్తు, రూపాలను ఏ సామాజిక శ్రేణులనుండి అందిపుచ్చుకోవాలో నాకు స్పష్టంగా అర్థమైంది. ప్రాబల్య వర్గాల, మధ్యతరగతి బుద్ధిజీవుల చుట్టూ ఆదమరిచి ప్రదక్షిణలు చేస్తున్న కవిత్వాన్ని గద్దర్ ఒక సాంస్కృతిక రాయబారిలా సామాన్య మానవుడి ముంగిట్లోకి తీసుకువచ్చాడు. ఆయన పాటలు విన్నపుడు **'ఇలాంటి పాటలు నేను కూడా రాయగలను'** అనే నమ్మకం ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. ఈ విధమైన సృజనాత్మక ప్రేరణను, సాహిత్య భరోసాను కొత్త తరంలో కలిగించే వారే నిజమైన మహా కవులు. గత మూడు దశాబ్దాలుగా ఎన్నో సందర్భాల్లో గద్దర్ కళా ప్రదర్శన చూస్తూ స్ఫూర్తి పొందుతూనే ఉన్నాను. జీవితంలో సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు ఈ ప్రజాకవి పాటల జెండా నీడలోనే సేదతీరాను. కొన్ని సభల్లో ప్రజాయుద్ధనౌక



పక్కనే కూర్చొని మాట్లాడటం జీవితంలో మరచిపోలేని మధురానుభూతి. బహుజన కెరటాలు దశాబ్ది సంచిక ఆవిష్కరణ సభలో ఆయన నా పట్ల అపారమైన వాత్సల్యాన్ని చూపించి, మనసారా అభినందించారు. **"అరే కోయీ! ఆమధ్య ఏదో టివిలో నీ ఇంటర్వ్యూ చూశాను. నీ మాటలు నన్ను ఇన్‌స్పైర్ చేశాయిరా! మనందరం కలిసి పని చేద్దాం బిడ్డా"** అన్న గద్దరన్న మాటలు నా చెవుల రింగుమని మారు మ్రోగుతున్నాయి. రెండు మూడు సందర్భాల్లో ఫోన్ చేసి **"ఒకసారి యింటికి రారా కోయి, నీతో ఎన్నో విషయాలు మాట్లాడాలి, వాటిని రాసుకొని, ఎక్కడైనా రికార్డ్ చేయరా భాయి"** అని గద్దర్ అహ్వానిస్తే 'తప్పకుండా వస్తాను అన్నా' అని చెప్పాను, కానీ ఆమాట నిలబెట్టుకోలేక పోయాననే బాధ నన్ను వెంటాడుతూనే ఉంది.

ఆయనతో కరచాలనం చేస్తే రక్త, స్వేదాశ్రు సిక్తమైన సాహిత్య సంస్కృతిని స్పృశించినట్లుగా ఉంటుంది. ఆయన భుజం మీద వేలాడుతున్న గొంగడిని, చేతిలోని కర్రను, దానికి చుట్టి ఉన్న పతాకాన్ని తాకితే శ్రమ సంస్కృతిని ముట్టుకున్నట్లు ఉంటుంది. అనుక్షణం మూర్తీభవించిన ప్రజలపాటలా గద్దర్ ప్రతిధ్వనించాడు. కంచె ఐలయ్య అన్నట్లు గద్దర్ ఒక **'ఆర్గానిక్ ఫిలాసఫర్'. 'లెజెండ్ ఆఫ్ గ్లోబ్'.**

**"నన్ను అనుక్షణం కదిలించేది అమరవీరుల అమరత్వం. నన్ను తప్పుల నుండి తప్పించేది**



**కూలినాలి పేద ప్రజలు. నా సమస్త సాహిత్యం వాళ్ళదే"** అన్న గద్దర్ మాటల్లో ఆయన సాహిత్య వ్యక్తిత్వం తేట తెల్లమవుతుంది. నాగరిక, జానపద కవిత్వాల సరిహద్దులు చెరిపెయ్యడానికి కృషి చేసిన కవిగా తెలుగు సాహిత్య చరిత్రలో గద్దర్‌కు విశేష స్థానముంటుంది అని చే.రా. చేసిన విశ్లేషణ అక్షరాల నిజం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో గద్దర్ ఒక ప్రత్యేకమైన పాటల అధ్యాయం. కాలం కనీ వినీ ఎరుగని ప్రజా విముక్తి గీతం. చరిత్ర ఎరుగని సాంస్కృతిక విప్లవ చైతన్యం. అపూర్వమైన దార్శనిక దృష్టితో, అసమాన కళాసృష్టితో పాటను ప్రభావశీలమైన సాహిత్య ప్రక్రియగా తీర్చిదిద్దటంలో గద్దర్ చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. సామాజిక సందర్భాన్ని, ఉద్యమ తత్త్వాన్ని ఆవాహన చేసుకొని పాటెనక పాటకట్టి, వేనవేల పాటలు కట్టి వర్గశత్రువుల గుండెల్లో గద్దర్ యుద్ధభేరి మ్రోగించాడు. డెబ్బయ్యో దశకంలో తెలుగు నేలమీద వ్యాపిస్తున్న అరుణ వాతావరణాన్ని తన పాటలతో మరింత ఎరుపెక్కించి, గద్దర్ విప్లవోద్యమానికి తలలోని నాలుకలా భాసించాడు. ఐదు దశాబ్దాల సామాజిక, రాజకీయ పోరాటాల గమనానికి గద్దర్ తన పాటలతో బాటలు వేశాడు. వర్గ, కుల, లింగ వివక్షల సంకెళ్లలో బందీలైన **'పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి'** నింగి చెవులు మారుమ్రోగేలా స్వేచ్ఛాగీతాలు ఆలపించాడు. భంగపడ్డ తెలంగాణ జాతి బాధలను కలమెత్తి, గళమెత్తి చాటి చెప్పాడు.

ఉమ్మడి మెదక్ జిల్లా తూప్రాన్ లో పుట్టిన గద్దర్ పాటల తుఫాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉధృతమై, దండకారణ్యం తీరం దాటి, గల్లీ నుండి ఢిల్లీ వరకు జనజీవన స్రవంతిలో మహా గాన వృష్టి కురిపించింది. కోటి మారణాయుధాలను ధిక్కరించే తాత్త్విక ఆయుధం లాంటి పాటతో, సాటిలేని ఆటతో గద్దర్ కోట్లాది మందిని ఉర్రూతలూగించి, అసాధారణమైన ప్రజావాగ్గేయకారునిగా భారతదేశంలో ప్రఖ్యాతి గాంచాడు. **"గద్దర్ లాంటి కళాకారుల సంస్కృతీ ప్రదర్శన వల్లనే విప్లవం పట్ల నాకున్న నమ్మకం నానాటికీ బలపడుతుంది"** (ప్రజ) అన్న శ్రీశ్రీ మాటల్లో గద్దర్ పాట ఔన్నత్యం తేట తెల్లమవుతుంది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో పుట్టిన గద్దర్, చిన్ననాడే ఆ రెక్కలకష్టంలో తాను కూడా పాలు పంచుకున్నాడు. తల్లితో పాటు కూలిపనులకు వెళ్ళాడు. ఇంటి పనుల్లో తోడుగా నిలబడ్డాడు..అడవిలో ఎన్నెలమ్మ ఆకును ముద్దాడినట్లు'గా పనిలో నిమగ్నమైన గద్దర్ గొంతును పాటమ్మ ముద్దాడింది. తల్లి లచ్చుమమ్మ ఆలపించే పల్లె పదాలు, తండ్రి శేషయ్య బోధించే వేమన, కబీర్, మరాఠీ కవుల తత్త్వాలు, ఊరులో వినిపించే జానపద గీతాలు, ఒగ్గుకథలు, బుర్రకథలు, పాఠశాలలో ప్రదర్శించే ఏకపాత్రాభినయాలు వీటన్నిటి ఉమ్మడి ప్రేరణలోనుండి గద్దర్ గాయకుడిగా తొలి అడుగులు వేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనలో తెలంగాణ ఉద్యమోత్తేజాన్ని రగిలించింది. అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్రలను బుర్రకథలుగా చెబుతూ కళాకారుడిగా ఎదుగుతున్న గద్దర్‌లో 'ఆర్ట్ లవర్స్ అసోసియేషన్' ప్రతినిధులు, మిత్రులు సాంస్కృతిక విప్లవ సోయిని, సామ్యవాద సృజన స్ఫూర్తిని కలిగించారు. "అది వెయ్యి కాళ్ళ జెర్రి బిడ్డా ! అటు వెళ్ళొద్దు ,మనది కాని యుద్ధంలో మనమెందుకు పోరాడాలి. నువ్వెక్కిన పడవ ఎక్కడో మునిగి పోతుంది ,లేదా ముంచుతారు" అని తన సోదరి ఎంత నచ్చ చెప్పినా వినకుండా ,బాంక్ ఉద్యోగాన్ని విడిచిపెట్టి పాటల నిధి గా గద్దర్ ఉద్యమానికి అంకితమయ్యాడు. విప్లవ రచయితల సంఘం ప్రభావంతో 'నా ప్రాణం నువ్వే పాటమ్మా/పోరు బాటవు నువ్వేపాటమ్మా" అంటూ జన నాట్యమండలి జాడలో' జనం గుండె చప్పుడు' గా గద్దర్ గాన గర్జన చేశాడు.

”

ప్రజల గుండెల కొండల్లో మాటు కాసి/ ట్రిగ్గర్ నొక్క కలిగిన వాడే ద్రష్ట /ప్రజల్ని సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి" అని శివసాగర్ విప్లవ ఎరుకతో కవి ని పునర్నిర్వచించాడు. ఈ నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనంగా గద్దర్ తెలుగు సాహిత్యం లోకి దూసుకు వచ్చాడు . రచయితలకు సవాల్ విసిరిన సందర్భంలో విశాఖ విద్యార్థులు ఆశించినట్లుగా 'ప్రజల వైపు నిలబడి వీరగానం చేసే కవిగా గద్దర్ అవతరించాడు .పెన్నునే గన్నుగా మార్చి, విప్లవోద్యమానికి వెన్ను దన్నుగా నిలిచాడు."నేనేం చేస్తున్నా,ఇంట్లున్నా,బయటున్నా,తింటున్నా,పంటున్నా,తాళం వేసుకుంటూ ప్రజలభాషను ,యాసను పట్టుకోడానికి ప్రయత్నం జేసినా "(ప్రజల పాటలు –అనుభవాలు పేజీ 6 ) ప్రజా కళా రూపాలను అధ్యయనం చేసి ,తదనుగుణంగా ప్రజల సమస్యలను ప్రజల బాణీలో, వారి భాషలో పాటగా మలిచే నైపుణ్యాన్ని అందిపుచ్చుకున్నాడని గద్దర్ మాటల్లో అర్థమవుతుంది. బుర్ర కథ ,

ఒగ్గు కథ, జముకుల కథ,కోలాటం లాంటి ప్రజా కళారూపాల ఒరవడిని, నాటకీయ ,హాస్య పద్ధతులను గద్దర్ సమర్థవంతంగా ఉపయోగించుకొని, పాటను ఒక విలక్షణ దృశ్యకావ్యం లా ,విశిష్ట శ్రవ్యకావ్యం లా మలిచి ప్రజాహృదయాలను గెలిచాడు. 'రిక్షా తొక్కే రహీమన్న', రాళ్ళు గొట్టే రామన్న,హమాలి కొమ్రన్నల వంటి హింసిత జనుల మూకీ భాష్పాలను, శ్రమతత్వాన్ని కలం లోకి బట్వాడా చేసుకొని, గళం లోకి ఒంపుకొని, పాటలల్లి వారిని విప్లవోన్ముఖంగా కదిలించాడు. 'దుక్కులు దున్నే నాగలి ఈ దుక్కులు నావంటున్నది, 'కోతలు కోసే కొడవలి ఈ పంటలు నావంటున్నది"అంటూ కష్టజీవులకే శ్రమ ఫలితం దక్కాలనే సామ్యవాద వాస్తవికతను గద్దర్ సముచితంగా పాట బద్ధం చేశాడు. కారం చేడు సంఘటన నేపథ్యంలో రాసిన **'దళిత పులులమ్మా'** అనే పాటతో గద్దర్ అంటరాని ప్రజల్లో తిరుగుబాటు తత్వాన్ని నూరిపోశాడు. దళితుల ధైర్యసాహసాలకు, శౌర్య ప్రతాపాలకు ఈ పాట అక్షరదర్పణంగా నిలిచింది.

ఒక పాటరాసే క్రమంలో ఆయా సంఘటనల పూర్వాపరాలను పరిశోధించి, వివిధ వర్గాల శ్రామికుల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి, ఈ అనుభవం ప్రాతిపదికగా సృజనచేయడం వల్ల గద్దర్ పాటల్లో సహజత్వంతో పాటు ప్రామాణికత ఉట్టి పడుతుంది. **'కల్లు ముంతోయమ్మ'** అనే పాట రాయడానికి, కల్లు కాంపౌండ్‌లో ఎంతో మనుషులను గమనించి, వారితో మాట్లాడగా లభించిన సమాచారం ఆధారంగా ఆయన సృజన గావించాడు. **"గ్యాంగోల్లమండిబాబు మేము/గరీబోల్లమండి బాబు మేము/ మా రక్తమంత ధారపోసి రైలుపట్టాలేస్తాము"** అనే పాట ఎంతో ప్రజాదరణ పొందింది. ఈ పాట రాసేముందు రైలు పట్టాల వెంట నడిచి, కార్మికులకు దగ్గరై, వారి పనితీరు, కష్టనష్టాలు తెలుసుకొని గద్దర్ పాట రాయడంతో ప్రేక్షకులకు ఆ కార్మికుల పట్ల సానుభూతి కలుగుతుంది. వారితో సహానుభూతి ఏర్పడుతుంది. **"గాలిలోని వాలులా, నీటిలోని చేపలా, ప్రజల మధ్యన ఒకనిలా"** జీవిస్తూ గద్దర్ కవిత్వం రాశాడు. పాటలల్లాడు.

తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా తెలంగాణ తత్వం గద్దర్ పాటల్లో ఆద్యంతం పరిమళిస్తుంది. మలి దశ తెలంగాణా పోరాటానికి గద్దర్ పాటలు ఎంతో ఉత్తేజాన్ని అందించాయి . **"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా"** అనే గీతంలో తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవ ప్రాభవాలను గద్దర్ అద్భుతంగా కవిత్వీకరించాడు. **"ఎట్టోల్ల మట్టి చిప్పవు/ గాయిదోల్ల గంద్ర గొడ్డలివి"** అంటూ దళిత, బహుజనుల అస్తిత్వం కేంద్రంగా తెలంగాణాను ఔచితీమంతంగా అభివర్ణించాడు. విశిష్టమైన ఈ రెండు సంబోధనల్లో అణగారిన వర్గాల శ్రమతత్వాన్ని, వారిలోని



ప్రతిఘటనాత్మక వైఖరిని గద్దర్ ప్రతీకాత్మకంగా ప్రస్తుతించాడు. **"పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా! పోరు తెలంగాణమా" / "గోదావరి అలలమీద కోటి కలల గానామా / కృష్ణమ్మ పరుగులకు నురుగుల హారమా!"** అంటూ మహోన్నతమైన తెలంగాణ ఉద్యమ ఉధృతిని శిల్పశోభితంగా చిత్రించాడు. **'మర్లబడ్డ గానమా', 'తిరగబడ్డ రాగమా', 'కత్తులకోలాటమా' 'పువ్వులు పుప్పొడిలా పవిత్ర బంధమా', 'పరమాత్ముని రూపమా'** లాంటి అపురూపమైన సంబోధనలతో అభివ్యక్తి సుందరంగా తెలంగాణ పోరు తత్వానికి గద్దర్ కొత్త భాష్యం చెప్పాడు. **"తల్లి రొమ్మును నెత్తురొచ్చేదాక పిండుకు తాగిన్రు"** అంటూ తెలంగాణ మీద జరిగిన వనరుల దోపిడిని తీవ్రంగా ఎండగట్టాడు. **"గద్దర్ పాట ఉన్న స్థితిని ఉన్నట్టుగా ఉంచేందుకు పుట్టింది కాదు. అది ఆయన ఒక్కడి బుర్రలో రూపొందింది కాదు. తెలంగాణ కోపోద్రిక్త, నగ్జలబరితరం లోంచి వచ్చింది, దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటును, సమస్త దోపిడీకి, పీడనకు కారణమైన రాజ్యాధికారాన్ని గెల్చుకునేందుకు సాయుధ పోరాటంలోకి మార్చుకొనేందుకు పుట్టి పెరిగింది"**(గద్దర్ పాటలు-ముందుమాట) అన్న అల్లం రాజయ్య మాటల్లో గద్దర్ పాట ప్రయోజనం అర్థమవుతుంది.

బాల్యంలో తల్లి, తరువాత సోదరి, నిశ్శబ్ద విప్లవంలా నిరంతరం తోడు ఉన్న సహచరి విమల, ఈ ముగ్గురి ప్రభావం వల్ల స్త్రీ వ్యక్తిత్వాన్ని, త్యాగనిరతిని, శ్రమతత్వాన్ని గద్దర్ సమున్నతంగా అర్థం చేసుకున్నాడు. గద్దర్ పాటల్లో స్త్రీల పట్ల అపారమైన గౌరవ మర్యాదలు దర్శనమిస్తాయి. **'నిండు అమాస నాడు' 'తెచ్చీపెడితే తిని కూర్చుంటవ్ / తిన్నది అరగక పంటానంటవ్' 'మల్లెతీగకుపందిరి వోలె'** లాంటి పాటల ద్వారా గద్దర్ పితృస్వామ్యంపై ప్రశ్నల మేనిఫెస్టో సంధించాడు. **"అదుగదుగో అదుగో చూడు అమెరికోడొస్తుండు"** అంటూ సామ్రాజ్యవాదం వేసిన ఇనుప దారులను, ప్రపంచీకరణ పేరుతో విచ్చలవిడిగా సాగుతున్న సాంస్కృతిక ఆధిపత్యాన్ని గద్దర్ తన పాటలతో బద్దలు కొట్టాడు. **'పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడే' 'వరిసేలు**

**అడిగినాయి నీరు దాపే రైతు ఏడని'** లాంటి పాటలు గద్దర్ రచనా శిల్పానికి తార్కాణంగా నిలుస్తాయి. ప్రకృతి, అడవి, గిరులు, తరువులు ఇత్యాది పచ్చని ప్రతీకలతో సాగే గద్దర్ పాటల్లో పర్యావరణ స్పృహ కనిపిస్తుంది. అమర వీరుల యాదిలో గద్దర్ ఆలపించిన కరుణ రసార్ద్రభరితమైన పాటలు విని కాలం కూడా కన్నీరు మున్నీరు గా విలపించింది.

వస్తువు రమ్యమైన, జుగుప్సాకరమైనా, నీచమైనా, వికృతమైనా కవి భావనా మహిమతో రసరమ్యమవుతుందని ధనంజయుడు సూత్రీకరించినట్లు సభ్యసమాజం అసహ్యించుకొనే ఉత్పత్తి సాధనాల ఉన్నతిని గద్దర్ తన పాటల్లో కవితాత్మకంగా వ్యాఖ్యానించాడు. మనిషి లాగానే **'ఇంటిలోని చీపురుకు, చెప్పుకు కూడా ఒక సామాజిక విలువ వుంటుందని'** ఆయన తన పాటల ద్వారా ఉదాత్తంగా నిరూపించాడు. **"చక్కనైన బొమ్మ మా ఇంటి లున్నదమ్మ"** అంటూ **'చీపురు కట్ట'** సమకూర్చే మేలును విశ్లేషించాడు. **"ఎంత చక్కగా ఉన్నది చెత్తకుండి"** అనే పాటలో అనాథలకు, పశుపక్ష్యాదులకు ఆకలితీర్చి, కన్నతల్లిలా గుండెల కద్దుకుంటుందని, మంత్రసానిగా పురుడు పోస్తుందని, మొలిచే మొక్కకు సత్తువనిస్తుందని, పంటసేలకు ఎరువునిస్తుందని, పరమాన్నం వొండి పెడుతుందని, చెత్తకుండీ అందించే పరమ ప్రయోజనాలను గద్దర్ అద్భుతంగా అక్షర బద్ధం చేశాడు. **"గూటం దెబ్బతోని నాదు గుండెనంతా చితక కొట్టి / మనిషి కాళ్ళ సైజు కొరకు మనసు నంత కోసి కోసి / ఏసు ప్రభువును శిలువ వేసి / మేకులు దిగ గొట్టినట్లు / నావొంటి మీద కదలకుండా మొలమీద మొల గొట్టి / మాదిగోని ఎట్టి కిందకి ముట్టజెప్తిరి దొరలకేమో"** (కిర్రు కర్రు చెప్పు నోయమ్మ) అంటూ పాద రక్షలు రూపు దిద్దుకొనే పని విధానాన్ని, తదనుగుణమైన మాదిగల కళాకౌశలాన్ని గద్దర్ అపూరూపంగా పాటగట్టాడు. కోడిపెట్ట, ఉల్లిగడ్డ, గాలిపంక, కల్లుముంత లాంటి అరుదైన వస్తువులను స్వీకరించి, పాటల్లో వాటిని మహోన్నతంగా మానవీకరించాడు.

వజ్రానికి అనేక ముఖాలున్నట్లు, ఏక కాలంలో గద్దర్‌లో అనేక అరుదైన కళాప్రతిభా పార్శ్వాలు కనిపిస్తాయి. పాట సృజన, బాణీ, గానం, నృత్యాభినయం సమ్మిళితమైన అద్భుత కళా సంపత్తితో గద్దర్ సాంస్కృతిక ప్రదర్శన ప్రేక్షకులను సమ్మోహితులను కావిస్తుంది. చుట్టూ చేరిన జన సమూహాన్ని భావజాలపరమైన మత్తులోకి నెట్టేస్తుంది. ఇలాంటి వశీకరణ శక్తి తోనే గద్దర్ పాట ఆబాలగోపాలానికి అత్యంత ప్రీతి పాత్రమైంది. గోసి, గొంగడీతో కూడిన ఆకర్షణీయమైన వేషధారణతో, ఎర్రజెండా చుట్టిన కర్రతో విప్లవ ఋషిలా గద్దర్ పాడుతూ, ఆడుతుంటే ఆయన తలమీద ముంగురులు కూడా ముచ్చటపడి గానానుకూలంగా నృత్యం చేస్తాయి. చౌరాస్తాలో కళాకారుడు మధురమైన నాగస్వరంతో పాములను ఆడించినట్లు, సింహ కంఠనాదంతో, అగ్ని గానంతో గద్దర్ వేలాది సభావేదికలను చైతన్య భరితం చేశాడు. ప్రజా వాగ్గేయకారుల పాట, మాట, ఆట ఎంత ప్రభావశీలంగా ఉండాలో గద్దర్ తన కళా కార్యాచరణ ద్వారా మిగతావారికి మార్గదర్శకంగా నిలిచాడు. వేమన ఆటవెలదిలోని మూడోపాదం లాగా గద్దర్ పాటలోని ప్రతి చరణంలో చమత్కార బంధురమైన 'పంచ్' అందరినీ ఆలోచింపజేస్తుంది. నిర్దిష్టమైన రాజకీయ విలువలతో పాటు, సహజసుందరమైన కళా తత్త్వవిలువలతో, గ్రామీణ ప్రజల నిత్య వ్యవహారంలో జాలువారే తెలంగాణ జీవభాషతో గద్దర్ తన పాటలకు కొత్త సొబగులు దిద్దుకున్నాడు. చిన్నచిన్న విత్తనాల గింజలు బంగారు పంటను వాగ్దానం చేసినట్లు, అలతి అలతి పదాలతోనే గద్దర్ మహా కావ్యాల్లాంటి పాటలనందించి , జాతిని జాగృతం చేశాడు. ఎర్ర మందారంలా విరబూసిన గద్దర్ పాట, పరిణామ క్రమంలో తీరొక్క పూలతో బతుకమ్మ లాగా పరిమళించింది.

ప్రారంభ దశలో సాయుధ పోరాట స్ఫూర్తితో **'పోరు తప్ప దారి లేదని'** తెగేసి చెప్పిన గద్దర్, అంతిమ దశలో ఆత్మగౌరవ పోరాటాల ఎరుకతో భారత రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య రాస్తాలోకి నడచి వచ్చాడు, **"ఏడు తరాల త్యాగాల జ్ఞాన యుద్ధాల గ్రంథం, మానవ జాతి విముక్తి గీతం"** అంటూ రాజ్యాంగ విలువల ఆచరణ ఆవశ్యకతను పాటల్లో విశదపరిచాడు. ఈ రకమైన గుణ పరివర్తన తోనే **"బాబా సాహెబ్ బాటరా! భావితరాల బాటరా!"** అని గద్దర్ నిర్ధారించాడు. దండకారణ్యాన్ని మండించిన 'ప్రజాయుద్ధ నౌక' గద్దర్ చివరికి ధమ్మపథంలో సేదతీరాడు. సుదీర్ఘమైన గద్దర్ ప్రస్థానంలో అనేక రాజకీయ వైరుధ్యా లున్నప్పటికీ, సాంస్కృతిక కాలుష్యంలో రోగగ్రస్తమైన వర్తమాన సమాజ ఆరోగ్యానికి తాత్విక ఔషధాన్ని అందించిన గద్దర్ సాహిత్యం అనవరతం ఆదర్శనీయం. **"మృత్యువా! నీవు వచ్చి నా నోటిని మూయగలవు కానీ శతాబ్దాలపాటు ప్రజల హృదయాల మార్మోగుచునుందును"** అని ఫిరాక్ గోరక్ పురి అన్నట్లుగా గద్దర్ కాలం గొంతులో ప్రతినిత్యం ప్రతిధ్వనిస్తుంటాడు. ప్రజలనాలుక ల మీద అను నిత్యం జీవిస్తుంటాడు.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 హైదరాబాద్ సెప్టెంబర్ : 2023


# శ్రామిక స్త్రీల ఆత్మగీతం, విప్లవోద్యమ మాతృగీతం

## 'సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా!'

**డా. ఎస్. రఘు,** సహాయాచార్యులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9848208533

విప్లవోద్యమంలో పాట గురితప్పని తూటా. విప్లవ గీతాల ప్రస్థానంలో గద్దర్ పాట ఆయుధం కంటే శక్తివంతమైంది. విప్లవ భావజాల వ్యాప్తిలో గద్దర్ గళం ఉత్తేజపూరిత పాత్రను పోషించింది. జన నాట్యమండలిని వేదికగా చేసుకుని విప్లవ శ్రేణుల్లో యుద్ధస్ఫూర్తిని పెంపొందించాడు. దారిద్ర్యంతో సహజీవనం చేసి ఇంజనీరింగు విద్యను పూర్తిచేసి బ్యాంకు ఉద్యోగిగా తన బతుకు పోరాటాన్ని ఎందరికో పాఠంగా చూపాడు. అయినా ఏదో తెలియని అసంతృప్తి, ఆవేశం, ఆగ్రహాలు ముసురుకున్న వేళ పాటను తన బాటగా మార్చుకున్నాడు. ఆ బాటలో ఇరువైపులా విప్లవ బీజాలను వెదజల్లుతూ మార్క్సిజం అంతిమ గమ్యంగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. ఆ గమనంలో రాసిన పాటలు ఒక్కొక్కటి ఒక ఎర్ర మైలురాయి.

గద్దర్ తాను రాసిన పాటల వెనుక ఒక అశ్రు బిందువు, అగ్నికణాన్ని దాచిపెట్టాడు. **"ప్రతి పాట వెనుక ఓ కథ ఉంటుంది. ఆ కథ వెనుక కష్టజీవుల కన్నీళ్ళు, సెమట సుక్కలుంటాయి. ఆ కన్నీళ్లను చెమట సుక్కలు దోచుకునే దొంగలుంటారు. ఆ దొంగలను ఎదురించే వీరులుంటారు"** అని తన ప్రతి పాట వెనక ఒక వీరగాథ దాగి ఉంటుందని గద్దర్ సూచిస్తాడు. గద్దర్ పాట ఒక బలమైన సంఘటన, సున్నితమైన దృశ్యం, కదిలించే చిన్న మాట ద్వారా ఆవిర్భవిస్తుంది. అట్లా పుట్టిన ఒక పాట ఒక చారిత్రక నిర్మాణ గాథగా పరిణమిస్తుంది. **'వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు, 'అమ్మ నీకు వందనం మాయమ్మ ఆలీసమ్మ', 'నాసా కింద మీసా కింద నిన్ను జైల్ల బెట్టినారు, నీకు నాకు తేడా లేదాయో ఓ పోలీసన్న', 'ప్రజల దాక్టరమ్మో మాయన్నా రామనాథం'. 'ఒరోరి అమినోడా, ఒరోరి సర్కారోడా పదిలంగా ఉండు కొడుకో', 'కదిలింది ఎర్రదండు'** అంటూ గద్దర్ ఒక్కటా రెండా వందలాది పాటలను ప్రజల వాడుక మాటలుగా మార్చిన విప్లవ వాగ్గేయకారుడు. సాహిత్యోద్యమ సాగరంలో ప్రజా యుద్ధనౌకగా పయనించిన గాయకుడు గద్దర్. అంతటి భావోద్వేగ తీవ్రత కలిగిన గద్దర్ తన అమ్మను స్మరించుకుంటూ రాసిన **"సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా"** పాటలోని సామాజిక, వైయక్తిక ఆర్తిని విందాం.

గద్దర్ ఈ పాట రాయడం వెనుక బలమైన నేపథ్యం ఉంది. విప్లవోద్యమంలో తిరుగుతూ తల్లికి తన జాడ తెలియని పరిస్థితులు అవి. అనుకోకుండా ఒక రోజు రోడ్డుమీద తన ఊర్లోని ఒక పేద రైతు గద్దరుని గుర్తుపట్టాడు. ఆ రైతు సంతోషంతో గద్దర్ ఒళ్ళంతా నిమురుతూ **"ఎంత మంచి వానివి గిట్ల పోయినవ్.. మన ఊరుకు పోదాం. ఊల్లో బత్కుదువ్... మీ అమ్మ ఆ చింతచెట్టు కింద కూసోని, కొడుకా, కొడుకా అని పక్షి వొలపోసినట్టు వొలపోస్తుంది"** అన్న మాటలతో గద్దర్ లోని కవి హృదయం చలించిపోయింది. తను కన్పించినట్టు అమ్మకు చెప్పొద్దని రైతుతో చెప్పాడుగాని గద్దర్ మనస్సు సొంతూరికి వెళ్లిపోయింది. **"ఇంటి ముందు చింతచెట్టు కండ్లలో తిరిగింది. అమ్మ అనుభవించిన కష్టాలు,**



**ఈ వయసులో కూడా కూలి తల్లిగా పడుతున్న కష్టాలు అన్నీ కళ్ళముందు తిరిగాయి. అంతే 'సిరిమల్లె చెట్టుకింద సినబోయిన పాట"** మొదలయ్యింది.

**"సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీవు సినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మా"** అనే పల్లవితో తల్లి మీద ప్రేమ ప్రవాహంలా కదిలింది.

ఈ పాటలో సిరిమల్లె చెట్టు కింద చిన్నబోయి కూసున్నది ఒక్క గద్దర్ తల్లేకాదు, శ్రామికురాలైన ప్రతి తల్లిని తలచుకుంటూ రాసిన విశ్వజనీన మాతృగీతం. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనుల్లోనే కాదు బతుకు పోరులో తన శక్తి కంటే రెండింతలుగా శ్రమించే స్త్రీలందరికీ వర్తించే పాట ఇది. మగవాళ్ళతో సమానంగా పోటీపడుతూ బతుకుబండి కదలడంలో వెనకగావుండి ప్రధాన పాత్ర పోషిస్తున్న అమ్మలందరికి అనువర్తించే గీతంగా రూపొందించాడు. ప్రకృతి ఒడిలో జరుగుతున్న పనులలో వ్యవసాయం ఒక అద్భుత శ్రామిక కావ్యం. ఒక తొమ్మిది చరణాలలో ఒక శ్రామికురాలి బతుకు వేదనను మరచిపోలేని వ్యథాభరిత దృశ్యకావ్యంగా మలిచాడు గద్దర్.

"మోకాళ్ల మట్టూకు బురదలో దిగబడి
ఎద్దోలె ఎనుకకు ఒక్కొక్క అడుగేసి
నాట్లేసి నాట్లేసి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ నడుములే ఇరిగేన లచ్చుమమ్మో లచ్చుమమ్మా"

మోకాళ్ళ దాకా బురదలో దిగబడిన ఎద్దోలె వెనుకకు ఒక్కొక్క అడుగేస్తూ నాట్లేసిందనే కవి వర్ణనలో ఒక యుద్ధక్షేత్రంలో సాహస వీరుడి విన్యాసంలా గోచరిస్తుంది. వ్యవసాయపు పనుల్లో పశువులు ఎంత తీవ్రంగా శ్రమించి కఠినమైన పనులు చేస్తాయో అందరికి తెలుసు. ఆ స్థాయిలో మహిళలు శ్రమిస్తున్నారనే విషయాన్ని కవి కీర్తిస్తున్నారు. అంతేనా ఆ పనులు చేసి చేసి నడుములు విరిగిపోయిన శారీరక బాధామయ స్థితిని చూసి కన్నీరు పెట్టుకుంటాడు.

వ్యవసాయ వృత్తిలో అనేక ప్రమాదాలు పొంచి వుంటాయి. ఇక ప్రకృతి వైపరీత్యాల ద్వారా కలిగే నష్టం వర్ణనాతీతం. పెద్ద పెద్ద పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లాగే వ్యవసాయంలోనూ ఎదురవుతాయి. ఈ పాటలోనూ లచ్చుమమ్మ వరిమోపు ఎత్తుకొని బిరబిరా నడుస్తుంటే కాలు జారి పడిపోతుంది. కాలుచేతులు విరిగిపోయి మూలన పడుకోవలసి వస్తుంది. గద్దర్ తల్లికి వచ్చిన కష్టం వ్యవసాయదారు లందరికీ వర్తిస్తుంది. వ్యవసాయం కూడా ఒక యుద్ధక్షేత్రమే. ఏదో ఒక రకంగా క్షతగాత్రులు కావలసిందే.

ఈ పాటలో కవి మనిషికి కావల్సిన మౌలికావసరాల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తున్నాడు. లచ్చుమమ్మ మాసిన తల, చినిగిన రయిక, పేలికల చీర, పాసిపోయిన బువ్వ, మాడిపోయిన గట్కను చూపుతూ గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ కూలీల దైన్య స్థితి కడుపు తరుక్కుపోయేలా పాడుతాడు. వొంటి మీద కప్పుకోవడానికి సరైన బట్టలు కూడా లేని దుస్థితిని చూపుతాడు. ఎంతో బరువైన, కష్టమైన పనులు చేయడానికి కావల్సిన శక్తి ఆహారం ద్వారా అందుతుంది. శక్తి నందించే పౌష్టికాహారం సంగతిని పక్కన పెడదాం. ప్రాణం నిలుపుకోవడానికి అవసరమైన కొద్దిపాటి తిండి కూడా దొరకని పరిస్థితి వ్యవసాయ కూలీలది. దీనికితోడు పాడయిపోయిన తిండి తిని తీవ్రమైన అనారోగ్యాల బారిన పడిపోవడం, ఎన్నోసార్లు ప్రాణాలు పోయిన సందర్భాలను చూస్తున్నాం. ప్రాథమిక అవసరాలు కూడా తీరని బతుకుల్లోని విషాదాన్ని చూసి వెక్కివెక్కి ఏడుస్తున్న కవి స్వరాన్ని మరచిపోలేం.

"గాడ్పొచ్చి గుడిసెంత గాలికెగిరీ పాయె
చలికాలమొచ్చింది సాప సింపులు లేవు
బొంతగుడుదామన్న పాత పేల్కలు లేవు
చలికి వొణుకుదు బుట్టి లచ్చుమమ్మో లచ్చుమమ్మా
నీ సంటోడు సచ్చిండ లచ్చుమమ్మో లచ్చుమమ్మా"

శ్రామికుడి జీవనం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. శ్రామికుడు కొంతసేపయిన తన గూడులో విశ్రాంతి తీసుకుందామన్నా అవకాశం లేని పరిస్థితి. బలమైన గాలులకు గుడిసె కప్పు పైకి ఎగిరిపోతుంది. వర్షాకాలం నానిపోతాడు. చలికాలంలో చలినుంచి తప్పించుకుందామన్నాసిన్న సాపసింపులూ కరువైనాయి. పాతబట్టల పేలికలు కూడా దొరకలేదు. చలికి తట్టుకోలేక పసివాళ్లు బలైపోయిన సంఘటనలెన్నో ఈ పాటలో లచ్చుమమ్మ కంటినించి కారిన దుఃఖం, ఆ గర్భశోకం దారిద్ర్యరేఖకు దిగువనున్న అందరిది. సామాన్య మానవుడి వెతలనన్నింటిని స్పర్శిస్తుంది ఈ పాట.

"ఆకలికి పోరగాండ్లు అల్లాడిపోవంగ
అన్నారెడ్డి నువ్వు జొన్న కొయ్యబోతే
జొన్న కొయ్యా దిగి లచ్చుమమ్మో లచ్చుమమ్మో
నీకాలంత ఆసింద లచ్చుమమ్మో లచ్చుమమ్మ"

ఇంతకు ముందు చరణంలో చెప్పుకున్న ప్రమాదాలనే కవి మరింత విస్తృతంగా వర్ణిస్తున్నాడు. ఇంట్లో పిల్లల ఆకలికి తట్టుకోలేక కూలికోసం అలవాటు లేని పనుల్లోకీ దిగవలసి వస్తుంది. ఒక్కోసారి అలవాటయిన పనుల్లోనూ ఏదో తప్పు జరిగి గాయపడడం జరుగుతుంది. సూది మొనలాగ వుండే జొన్నకొయ్య కాల్లోకి దిగినప్పుడు కలిగే బాధ, తదనంతర నొప్పులు ఎవరికివారు అనుభవిస్తేనే తెలిసేది. ఎర్రతేలు కరిచినప్పుడు కలిగే బాధ వర్ణనాతీతం. ఎంత జాగ్రత్తగా వున్నా జరిగే ప్రమాదాలు బతుకుని మరింత దుర్భరం చేస్తాయి. దిగజారుస్తాయి. గద్దర్ తన అవ్వ జీవితంలోని గాయాల తీవ్రతను వేదనాభరితంగా గానం చేస్తాడు. గద్దర్ స్వరం నుండి వింటే రాతిహృదయమైనా కరిగి నీరవ్వాల్సిందే.

రెక్కల కష్టం మీద ఆధారపడిన బతుకుల్లో పండుగలు రావడం చాలా అరుదు. క్యాలండర్లో క్రమం తప్పకుండా వచ్చే పండుగలు శ్రామికుల ఇంట్లోకి అడుగు పెట్టడానికి భయపడుతాయి. పేదలకు పండుగంటే ఒక అదనపు ఖర్చు. పండగంటే ఒక రోజు కూలి దొరకని సెలవుదినం. దసరాకు కడుపునిండా తినడానికయ్యే వస్తువులను కొనడానికి చేతిలో పైసలుండవు. దీపావళి దీపం వెలిగిద్దామన్నా నూనె లేదాయే. అదే ఉంటే తలకు రాసుకోవడానికన్నా మించిన పండుగ వుంటుందా? కవి నిరుపేదల బతుకుల్లోని భయానక యథార్థాన్ని నిర్మొహమాటంగా వెల్లడిస్తున్నాడు.

"దసరా పండుగ వచ్చె దమ్మిడీ లేదాయె
దీపావళి వచ్చె దీపంతె లేదాయె
శివరాత్రి ఒచ్చింది ఉపాసముండాలె
నీ బతుకంత శివరాత్రి లచ్చుమమ్మో లచ్చుమమ్మా"

శివరాత్రి పండుగ నాడు ఉపవాసముంటే శివుడు అనుగ్రహిస్తాడు. ఎంతో పుణ్యాన్ని మూటగట్టుతాడు అని భక్తుల విశ్వాసం. దాన్ని ఆధారం చేసుకుని కవి లచ్చుమ్మ ఆకలి పోరాటాన్ని ఎత్తి

చూపుతున్నాడు. నిత్యం కడుపు నింపుకోవడంలో విఫలమై, రోజూ ఒక పూటైనా ఉపవాసం ఉంటున్న వాస్తవ గాథలు వారివి. ఆ విధంగా లచ్చుమమ్మల్లాంటి బతుకుల్లో ఉపవాసం అనివార్య దుస్థితి. కాబట్టి 'నీ బతుకంతా శివరాత్రి' అంటూ వ్యంగీకరిస్తున్నాడు కవి.

**"ఏ కర్మమనుకోని ఏడుపాయలెల్లంగ**
**గాచారమనుకోని నాచారమెల్లంగ**
**తొవ్వలో దొంగలు లచ్చుమమ్మో లచ్చుమమ్మో**
**నీ బువ్వ గుంజుకొని లచ్చుమమ్మో లచ్చుమమ్మా**
**.......**
**కూలోల్లకందరికి కూడు దొరకాలని**
**కొమిరెల్లి కొండల్ల ఎత్తింద్రు కొడవళ్లు**
**కొడవండ్లు నూరుకొని లచ్చుమమ్మో లచ్చుమమ్మా**
**నీ కొడుకులను కలువరా లచ్చుమమ్మో లచ్చుమమ్మా"**

గద్దర్ ఈ పాట చివరి చరణాల్లో ఒక లక్ష్యాన్ని వ్యక్తపరుస్తున్నాడు. తన ఆశయాన్ని నిర్భయంగా ప్రకటిస్తున్నాడు. లచ్చుమమ్మల్లాంటి మనుషులందరికి ఒక గమ్యాన్ని నిర్దేశిస్తున్నాడు. అణచివేత, దోపిడీకి గురవుతున్న వారందరికి ఒక పోరాటమార్గాన్ని తన పాట ద్వారా నిర్మిస్తున్నాడు. నోటికాడి ముద్దను గుంజుకుంటున్న దోపిడీ వ్యవస్థను కూలగొట్టాలని పిలుపునిస్తున్నాడు. కండలను కరిగిస్తున్న కూల్లోల పొట్టలు నిండడానికి పిడికిళ్ళు బిగించాలనే ధైర్యాన్ని అందిస్తున్నాడు. చేసులు కోసిన చేతుల్లోని కొడవల్లకు కొత్త పనిని అప్పగిస్తున్నాడు కవి. కొడుకు కోసం ఎదురుచూసే తల్లిని తన దగ్గరకే పిలుచు కుంటున్నాడు. లచ్చుమమ్మలాగ దుఃఖపడుతున్న వారందరిని విప్లవోద్యమాల్లోకి ఆహ్వానిస్తున్నాడు. తిరుగుబాటును, ధిక్కార స్వరాన్ని తన పాటద్వారా నేర్పుతున్నాడు.

**బిడ్డా మనం ఏ ఆస్తిలేనోళ్ళం. ఆ దేవుడిచ్చిన ఈ మట్టిచేతులే మన ఆస్తిపాస్తులు... ఈ మట్టి రెక్కలు ఇరిసి నీకిస్తున్న వాటిని నమ్ముకొని బతుకు... ఆ మట్టి చేతులను బురదలో ముంచితే... బువ్వ దొరుకుతుంది. ఆ మట్టి సేతులతో అ,ఆ,ఇ ఈ లు రాస్తే... ఆత్మగౌరవం వస్తుంది"** అని తన అవ్వ చెప్పిన మాటల స్ఫూర్తితో గద్దర్ ఈ పాటను సృష్టించాడు.

సాహిత్యంలో 'అమ్మ' మీద విస్తృతమైన రచనలు వచ్చాయి. 'అమ్మ' అనే రెండక్షరాలే ఒక 'మహాకావ్యం'గా కవులు అభివర్ణించారు. గద్దర్ ఆ ధోరణిలోకి వెళ్లకుండా విభిన్న స్వరంతో అమ్మకే కాదు స్త్రీ లోకానికంతటికి ఒక సాధికారికతను అందించాడు. విప్లవోద్యమం మహిళల సమస్యలకు, అస్తిత్వ విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన పాటగా దీన్ని భావించవచ్చు. గద్దర్ రాసిన పాటలలో ఈ పాట అమ్మ ప్రేమలాగానే అమ్మూల్యమైంది. అజరామరమైంది.

## కలర్ టీవి

కయ్యం బెట్టిందిరో
కలర్ టివి ఇంట్ల కొచ్చి
దయ్యంబట్టిందిరో
నా పెండ్లాం పోరలకు
కూరగాయలు కోసుకుంట
సూస్తుంది నా పోసి
కోతిమీర్ కళ్యామాకు
కోసుడెట్లా చూస్తుంది.
కిరికెట్ షాట్ చూసి
కిలకిల నవ్వుతుంది.

ఉల్లిగడ్డ ఇసిరేసి
క్యాచ్ అని కేకలే సే

ఈ టీవి, జీ టీవి, సన్ టీవి,
స్టార్ టీవి, టాటా టీవి, బిర్ల టీ.వి.
అమెరిక, జపా నోని
అందమైన టివి నంటు
ఆడిస్తుంది ఇల్లువంత
నల్ల టీవి ననుకుంట
మెల్లంగ ఇల్లు సొచ్చి
రంగు టీవి ననుకుంట
రంగమెక్కి దుంకుతుంది
జోడెద్దుల కోడెనమ్మి
గుడ్లు పెట్టె నమ్మి
కూడేసిన పైస పైస
ముడేసి దాసి దాసి

పుస్తెలతాడు అమ్మి తెనే
వొస్తనంది ఇంటిలోకి

పాలోని ఇంట్ల చేరి
ఎక్కరి పోరగాల్ల
ఇజ్జత్ కాసవాల్ అని
ఇల్లు తాకట్టు పెట్టి

ఇరవై ఐదు వేలు పోస్తే
ఇగిలిస్తది ఇంటిలోన-

కొనేదాక గింతేనంది
కూసోనికి కుర్చీ అంది
తిన్నంత కరంటుంది.
నెత్తి మీద సెత్తిరంది
రిమోటర్ను కమాన్ అంది
కనెక్షన్ ఇస్తె గాని
కన్నుగొట్టి ఆడనంది -

పలక బలపం పడేసి
పాడుతుంద్రు పోరగాల్లు
మైకల్ జాక్సన్ చూసి
పోక్, రోక్ అంటుంద్రు
సచ్చె ముసలోనికి గూడ
చక్కలి గిలిచేస్తుంది
లవ్ అంటే ఏందని
నా పంటి పోరడు
అవ్వనడిగి సంపుతుండూ

కిరికెట్ ఆటొస్తె చాలు
ఉరికి ఉరికి చూస్తుంద్రు
ఆఫీసులు, కాలే జీలు
సిగాలొచ్చి ఊగుతాయి
రిక్షా వాడు టీవీ చుట్టు
రౌండు గోట్టి తిరుగుతుండు
పాకిస్తాన్ హిందుస్తాన్
ఏది ఓడి ఏది గెలిస్తే

బస్తి బస్తి, గల్లి గల్లి,
కుస్తి బట్టి నరుక్కుంద్రు.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 38 హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# గద్దరన్న అడిగిన ప్రశ్నలు

**డా. వెల్దండి శ్రీధర్,** తెలుగు అధ్యాపకులు, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ. ఫోన్ : 98669 77741

ప్రజాయుద్ధనౌక గద్దరన్న, ప్రజాయుద్ధ సంగీతం సాయిచంద్ లాంటి తెలంగాణ ప్రశ్నల గొంతుకలు ఒక్కటొక్కటే కాలగర్భంలో కలిసిపోతుంటే తెలుగు ప్రజలంతా దిగ్భ్రాంతికి లోనవుతున్నారు. తెలంగాణ సమాజమే కాదు తెలుగు సమాజమంతా ఆ మాటకొస్తే యావత్ దేశమంతా ఇవాళ ఎన్నో ప్రశ్నలను దిగమింగుకొని, ఎన్నో ప్రశ్నల కొడవళ్లను గుండెలో దాచుకొని మౌనంగా బతుకీడుస్తున్న సందర్భంలో గద్దర్ (1949–2023) లాంటి ప్రశ్నల జెండా నిలువునా కూలిపోయి ఈ లోకం వీడడం ప్రజాస్వామ్యానికే తీరని లోటు.

గద్దరన్న అంటే ఒక ప్రశ్న. గద్దరన్న అంటే ఒక తిరుగుబాటు, గద్దరన్న అంటే ఒక ధిక్కారం, గద్దరన్న అంటే ఒక దళితస్వరం, గద్దరన్న అంటే పాలకుల గుండెల్లో ఒక దండోర, గద్దరన్న అంటే గరీబుల గొంతుల్లో కొట్లాడుతున్న నిప్పురవ్వ. గద్దరన్న అంటే ఉవ్వెత్తున ఎగిసిన చైతన్య కెరటం. అలాంటి గద్దరన్నే ఈ పోరు ప్రపంచం నుండి మెల్లగా దీర్ఘమౌనంలోకి జారుకుంటుంటే ప్రతి పేదవాని గుండె దరువయి మోగి డప్పయి పగిలిపోయింది.

గద్దరన్న అంటే గత ఐదున్నర దశాబ్దాల తెలంగాణ సామాజిక చలన సంగీతం. ఉద్యమ కాగడా. ప్రత్యేక తెలంగాణ తొలిదశ ఉద్యమం (1969–1973) నుంచి మొదలుకొని నిన్నటి మలిదశ ఉద్యమం (1996–2014)ను దాటుకొని ఇవాళ్టి దగాకోరు ప్రపంచం మీద ఎత్తిన పిడికిలి. యాభై ఏళ్లుగా తెలంగాణ నేల మీద జరిగిన ప్రతి ఉద్యమానికి గద్దరన్న ఒక సజీవ సాక్ష్యం. ఒక నిలువెత్తు పాట. ఒక ఉప్పొంగిన పాటల సముద్రం. పాటగా ఎన్నో ఊళ్లకు తరలిపోయి, ఎన్నో విశ్వవిద్యాలయాల్లో అడుగుపెట్టి, ఎన్నో ప్రజా సమూహాలను ఉత్తేజపరిచి ప్రశ్నించడం నేర్పిన ఒక రగల్ జెండా.

**"భారతదేశం భాగ్యసీమరా**
**సకల సంపదకు కొదవలేదురా**
**బంగరు పంటల భూములున్నయి**
**చావులేని మరి జీవనదులురా**
**అంగట్లోన అన్ని ఉన్నయి**
**అల్లుని నోట్లో శని ఉన్నట్లు**
**సకల సంపదలుగల్ల దేశముల**
**దరిద్రమెట్లుందో మాయన్నల్లారా"**

ప్రపంచానికంతా అన్నం అంటే ఏమిటో తెలియని కాలంలో భారతదేశంలోని ప్రజలు పరమాన్నం తిన్నారు. ఎంతో నాగరికంగా జీవించారు. గ్రామాలన్నీ స్వయం పోషకంగా ఉండి ఎంతో సమృద్ధిగా ఉండేవి. అంతా బావుంది అనుకుంటున్నాం. మరి పేదరికం ఎక్కడి నుంచి వచ్చింది? ఉన్నోడు లేనోడు అనే భేద భావం ఎలా పుట్టింది? ధనవంతునికి దరిద్రునికి మధ్య అగాధం ఎలా పెరిగింది అని గద్దరన్న ప్రశ్న. అన్ని సౌకర్యాలున్నా ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఈ దేశం ఇంత దరిద్రంగా ఉందని దశాబ్దాల కిందటే గ్రహించి చెప్పాడు. ఇప్పటికి కూడా ఈ ప్రశ్నకు జవాబు లేదు. పరిష్కారం లేదని గద్దరన్న పాట చేస్తున్న ఫిర్యాదు.

**"సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మ**
**నువు చినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మ**
**నెత్తంత మాసింది రైకంత చినిగింది**
**కొత్తది గొననీకి కైకిలే దొరకది**
**...................................**
**మోకాళ్లమట్టుకు బురదలో దిగబడి**
**ఎద్దోలే ఎనుకకు ఒక్కొక్క అడుగేసి**
**నాట్లేసి నాట్లేసి లచ్చుమమ్మో లచ్చుమమ్మ**
**నీ నడుములే ఇరిగెనా లచ్చుమమ్మో లచ్చుమమ్మ"**

ఈ మానవ ప్రపంచంలో ఎక్కడో బీదతనం ఉంది, దుఃఖం ఉంది దానికి నిదర్శనమే ఈ లచ్చుమమ్మ పాట. సిరిమల్లె చెట్టుకింద చినబోయి కూసున్నవెందుకమ్మా అని ప్రశ్నిస్తూనే దానికి సమాధానం కూడా చెప్పాడు ఈ పాటలో. నెత్తికి అంటుకుందామంటే ఇంత సమరు లేక నెత్తంతా మాసిపోయింది. తొడుక్కున్న రైక చినిగిపోయింది. కొత్తది కొనుక్కుందామంటే పైసలు లేవు. పైసలు సంపాదించుదామంటే కైకిలి కూడా దొరకని పరిస్థితి. నడుములిరిగేలా నాట్లేసినా వచ్చే కైకిలి పొట్ట కూటికి సరిపోదు. అందుకే లచ్చుమమ్మను ఇన్ని ప్రశ్నలడుగుతాడు గద్దరన్న. ఇక్కడ లచ్చుమమ్మ గద్దరన్న తల్లి మాత్రమే కాదు. ప్రతి భారతీయ స్త్రీ. దేశంలో స్త్రీల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఒక్కసారి స్కాన్ చేసి చూపించే పాట ఇది.

**"దగాపడ్డ మా తెలంగాణము**
**గుండె చప్పుడినుడో మాయమ్మల్లారా**
**తెలంగాణలో బడులే లేవు**
**ఉన్న బడులకు భవంతి లేదు**
**చెట్లనీడ కింద పోరగాండ్లురా**
**నీడదిరిగినట్టు తిరుగుతుంటరు**
**పంతులు వస్తే పిల్లలు రారు**
**పిల్లలు వస్తే పంతులు రాదు**
**పంతులు పోరలు ఇద్దరు వస్తే**

**రాయనీకి మా పంతులుగానికి**
**చాకిపీసు లేదో మాయమ్మల్లారా"**

సగటు తెలంగాణ విద్యార్థి చదువుకోవడానికి ఎంత కష్టమో ఈ పాట కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. ఈ పాట నిండా ప్రశ్నలే. విద్యారంగం చుట్టూ ఎంతటి చీకటి పేరుకుపోయిందో వివరిస్తుందీ పాట. టీచర్లు లేక, విద్యార్థులు లేక, చాక్‌పీసులు లేక, నల్లబల్లలు లేక, మరుగుదొడ్లు, తాగునీరు లేక ఎన్నో పాఠశాలలు సమస్యల సుడిగుండంలో పడి కూలిపోయాయి. ఎన్నో తరాలు సరైన విద్య అందకుండానే ఓటర్లుగా మారిపోయారు. ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి లైన్లో నిలబడి ఓట్లు వేసుకుంటూ పోతూనే ఉన్నారు. ఏం మార్పు వచ్చిందో గమనించే స్థితిలో కూడా లేరు. తెలంగాణలో ఇప్పటికైనా ఈ పరిస్థితి మారిందా అనేది కోటి రూకల ప్రశ్న.

**"రాజ్యాంగం రాజ్యాంగం రాజ్యాంగం చట్టమంటూ**
**రంకెలేసి దూకుతావు పోలీసోరో**
**మా ప్రశ్నకు జవాబు చెప్పు**
**పోలీసోరో మా ప్రశ్నకు జవాబు చెప్పు"**

తెలంగాణలో ఒకప్పుడు విరివిగా జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లను, అవినీతిని ప్రశ్నించిన పాట. 1970, 1980లలో దాదాపు అన్ని గ్రామాల్లో పోలీసు రాజ్యమే నడుస్తుండేది. ఎవరిని ఎందుకు అరెస్టు చేస్తారో, అరెస్టు చేసిన వారిని ఎప్పుడు కోర్టు ముందు హాజరు పరుస్తారో ఎవరికీ తెలిసేది కాదు. ఎన్‌కౌంటర్లు చేసినా, థర్డ్ డిగ్రీ ప్రయోగించి లాకప్‌డెత్‌లు చేసినా అడిగేవాడు లేడు. ఎదురు తిరిగేవాడు లేడు. ఒక క్రూరమైన పాలన సాగేది అప్పుడు. అందుకే గద్దరన్నలాంటి ప్రజాకవి ప్రజల మధ్యనే జీవించి, వాళ్ల తరపునే నిలబడి వాళ్ల బాధలనే పాటలుగా మలిచాడు. అలాంటి అమాయకుల పక్షాన ఆనాటి ప్రభుత్వాలను ఎన్నో ప్రశ్నలడిగాడు. కాని వేటికీ సమాధానం లేదు. పైగా గద్దరన్న పైనే ఆనాటి ప్రభుత్వం తూటాలు పేల్చింది. చావు అంచులదాకా వెళ్లిన గద్దరన్న చివరికి ఒక బుల్లెట్‌ను తన దేహంలోనే ఉంచుకుని బతికి బయటపడ్డాడు. అయినా తన ప్రజాపోరును ఆపలేదు. తన పాటల ప్రస్థానాన్ని ముగించలేదు. తన ప్రశ్నను ఎక్కుపెట్టడం చాలించలేదు.

ఇలాంటి యుద్ధ వాతావరణంలో గద్దరన్న అనివార్యంగా నక్సల్బరీ/మావోయిస్టు ఉద్యమాన్ని భుజానికెత్తుకున్నాడు. అన్నల పక్షాన నిలబడి ఎన్నోసార్లు అజ్ఞాతంలోకి వెళ్లి ఎన్నో ఉద్యమ పాటల్ని రాసి పాడాడు. ఉద్యమానికి తన పూర్తి మద్దతు ప్రకటించాడు.

**"తుపాకులకెదురు నడువరా అన్నయ్య**
**తూటాల మాలదొడుగరా**
**వీరుని మరణము కాదు వృధా ఎన్నటికీ**
**తప్పని చావు కొరకు భయపడకు ముమ్మాటికీ**
**నక్సల్బరి జయిస్తుందిరా అన్నయ్య**
**నీ త్యాగం ఫలిస్తుందిరా"**

అని మావోయిస్టు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడు. గద్దరన్న పాటలు విని, ఉత్తేజం పొంది ఆనాడు జోరుగా రిక్రూటుమెంట్ సాగేది. ఎంతో మంది మేధావులు, విద్యావంతులు, సామాజిక బాధ్యతగల యువకులు ఉద్యమంలో చేరి తమ ప్రాణాలను



కూడా ఉద్యమానికి అర్పించిన వారున్నారు. అందుకే ఒకప్పుడు గద్దరన్న పాడిన పాట వినడం కూడా నిషేధమే. ఆ తరువాత తన పంథా మార్చుకొని గద్దరన్న మావోయిస్టు ఉద్యమం నుండి బయటకు వచ్చాడు. అయినా 2005లో డా. వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జరిపిన శాంతి చర్చల్లో పాల్గొన్నాడు.

**"పొట్ట కోసం కొడుకు పోలీసోళ్ల జేరినాడు**
**ఎప్పుడొస్తడో కొడుకు ఏమిదిన్నడో"**

యుద్ధంలో సైనికులైనా, పౌర సమాజంలో పోలీసులైనా కీ ఇస్తే తిరిగే అట్టముక్కలే కదా! పొట్ట కూటి కోసం పోలీసు

నౌకరీలో చేరితే 24 గంటలు డ్యూటీలోనే ఉండాల్సి వచ్చేది. అటు పోలీసులకు, ఇటు నక్సలైట్లకు భీకరపోరు సాగేది. పల్లెలన్నీ రక్తంతో తడిసి ముద్దయ్యేవి. భయం గుప్పిట్లో ఊర్లన్నీ గజగజ వణికిపోయేవి. అలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసు ఉద్యోగం చేయడం ప్రాణాలతో చెలగాటం లాంటిదే. అందుకే గద్దరన్న పోలీసుల వైపు కూడా నిలబడి పాటలు రాశాడు. పోలీసైన తన కొడుకు ఏం తిన్నడో, ఎప్పుడొస్తడో అని బాధపడే ఒక కన్నతల్లి ఆవేదనను చూపిస్తాడీ పాటలో.

**"పొద్దుపొద్దున లేసి బాసన్లు తోమినాను**
**ఊడ్సేది ఊడ్సినాను కడిగిందే కడిగినాను**
**మైలా బట్టాలన్నీ మల్లోలె ఉతికినాను**
**ఇప్పుడు జెప్పు తోముడుకెంత**
**కదుగుడుకెంత ఉతుకుడుకెంత**
**ఊడ్సుడుకెంత**
**అంతా కలిసి ఎంతిస్తవురో మొగుడో**
**ముద్దుల మొగుడో**
**ఒక్క ప్రశ్నడుగూత చెప్పుతావా మొగుడా"**

గద్దరన్న పొలిటికల్ ఎకానమి మీద, స్త్రీలను శ్రమదోపిడి చేస్తున్న తీరుమీద చాలా పాటలు రాశాడు. చిన్న పదాలతో, మనసుకు హత్తుకునే ట్యూన్‌తో రాసిన ఈ పాట చాలా సంచలనం సృష్టించింది. స్త్రీవాదాన్ని, స్త్రీల పనికి విలువ కట్టని సమాజం పోకడను చాలా బలంగా పాటగా మలచడం ఇందులో కనిపిస్తుంది. విమలక్క, మధుప్రియ గొంతులో ఈ పాట అనేక వేదికల మీద పాడబడి ఎన్నో అంశాలను చర్చకు తెచ్చింది.

**"నేనెంత స్మార్ట్‌గున్నాను మామ**
**నాకు స్మార్ట్ ఫోనుగొనియ్యి మామ**
**సెల్ఫీదీసుకోని ప్రేముగట్టుకొని**
**అద్దంల నిన్నుజూసి ముద్దుబెట్టుకుంటాను**
**నేనెంత స్మార్ట్‌గున్నాను మామ**
**...................................**
**స్మార్ట్ ఫోనుతోని నువ్వు**
**వంటజేస్తవా వడ్లు దంచుతవా**
**కల్వవోతవా కొయ్యవోతవా**
**ఏంజేస్తవో జెప్పు పిల్ల"**

ప్రపంచీకరణ సృష్టించిన (అ)సౌకర్యాలలో సెల్‌ఫోన్ ఒకటి. కాని చాలా కాపురాల్లో నిప్పులు కుమ్మరించిన వస్తువు కూడా సెల్‌ఫోనే. సెల్‌ఫోన్ కోసం ప్రాణాలు తీసుకున్నవారు, సెల్‌ఫోన్ వల్ల సంసారాలు కూల్చుకున్నవారు చాలా మంది ఉన్నారు. సెల్‌ఫోన్ ఒక్కటే ఇంటిని / మనిషిని నియంత్రిస్తుందంటే అతిశయోక్తికాదు. స్మార్ట్ ఫోన్లు వచ్చిన తరువాత ఈ పరిస్థితి మరింత విషమించింది. కోట్లాది శ్రమజీవుల స్మార్ట్ ఫోను మూర్ఖుల చేతులపడి మూర్చపోయింది.

ఈ పరిస్థితినంతా ఎంతో వేదనతో వర్ణించే పాట ఇది. స్మార్ట్‌ఫోన్ వెనక దాగిన అనేక ప్రశ్నలను ఏకరువు పెట్టిన పాట కూడా.

భౌగోళిక తెలంగాణ వచ్చింది. ఒక గీత పెట్టుకున్నాం కాని ఏం మార్పు వచ్చింది? అని ప్రశ్నించాడు గద్దరన్న. మార్పు కోసం, అధికార మార్పిడి కోసం మరో ఉద్యమం రావాలని కలలుగన్నాడు. నీళ్లు నిధులు నియామకాలు ఈ మూడు ఇంకా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

**"సాలు దొర నీ పాలన సల్లంగా బతుకు దొరా**
**నీ సన్న బియ్యం పాడుగాను ఉన్న బియ్యం పోయినాయి"**
**"అమ్మా కాళేశ్వరమ్మా అమ్మా కాళేశ్వరమ్మా**
**అమ్మమ్మ నీకు వందనాలమ్మో అమ్మా కాళేశ్వరమ్మా**
**మా బీడు భూముల్లో బిడ్డవవుతవా? అమ్మా కాళేశ్వరమ్మా**
**మా పాడు భూముల్లో పంటవవుతవా? అమ్మా కాళేశ్వరమ్మా"**

అని సన్నబియ్యంపైనా, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా పాటలు రాసి పాడి తెలంగాణ వచ్చిన తరువాతి పరిస్థితిని ప్రజలకు అర్థం చేయించడానికి ప్రయత్నించాడు. ఎన్నో ప్రశ్నలు సంధించి తన ధిక్కారస్వరాన్ని వినిపించాడు.

**"డబుల్ బెడ్‌నడగాబోతే లబోదిబో మొత్తుకుంది**
**అల్లునికేమో అల్లుని రూము బిడ్డలకేమో బాత్‌రూము**
**అత్తామామకు అరుగే మిగిలిందో మాయన్నల్లార**
**ఆ కుక్కపిల్లకు మెత్తే మిగిలిందో నా చెల్లెలార"**

చాలీ చాలని డబుల్ బెడ్‌రూములపైనా పాటలు కట్టి పాడాడు గద్దరన్న. ప్రతి సమస్యను పాటగా మలచడం, అందులోని అనేక కోణాలను ప్రశ్నలుగా మార్చి పాడడం గద్దదరన్న పాటల శైలి.

ఓట్ల విప్లవం ద్వారా సేవ్ కాన్సిట్యూషన్ సేవ్ ఇండియా అనే ఒక నిశ్శబ్ద విప్లవం రావాలని పిలుపునిచ్చాడు గద్దరన్న. అందుకే గత పదేళ్ల నుండి ఎక్కడికి పోయినా చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకొని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన ఒక అనివార్యతను ప్రచారం చేశాడు. దళితులు, ముస్లింలు, బీసీలు ఏకమై ఓట్ల విప్లవం తీసుకురావాలన్నాడు. అధికారాన్ని చేజిక్కించుకోవాలి కాని ఇయ్యిమని బతిలాడితే ఎవరూ ఇవ్వరని నూటికి ఎనభై అయిదు శాతం ఉన్న వర్గాలను సమీకృతం చేయడానికి, చైతన్య పరిచి అధికారం దిశగా నడిపించడానికి ప్రయత్నించాడు.

**"బానిసలారా లెండిరా ఈ బాంచెన్ బతుకులు వద్దురా**
**బహుజనులారా రండిరా మన బతుకు మార్చుకుందామురా**
**అడక్క తింటె మన ఆకలి తీరదు గుద్ది గుంచుకుందామురో"**

అని బహుజనుల రాజ్యాధికార కల సాకారం కావడానికి ఏం చేయాలో తన పాటల ద్వారా దిశా నిర్దేశం చేశాడు.

అయితే తన పాటల ద్వారా చేస్తున్న భావ విప్లవం భౌతికశక్తిగా, ఒక మహాశక్తిగా మారాలని ఆకాంక్షించాడు. కాని వాస్తవంలో అలా జరగకపోవడంతో చివరి దశలో కొంత ఆవేదన చెందాడు.

తొలి అడుగు నుండి చివరి అడుగు దాకా కూడా తన పాటల ద్వారా నిరంతరం ప్రశ్నించడం వలన ఆయా అంశాలను చర్చకు తీసుకువచ్చాడు. కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించాడు. గద్దర్ పాటంటే ఒక అమ్ములపొది అని నిరూపించాడు. తన పాటల ప్రశ్నల ద్వారా ఆయా ప్రభుత్వాలను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ప్రజా పక్షపాతిగానే చివరి శ్వాస దాకా నిలబడి కలబడ్డాడు. నెహ్రూ అన్నట్లుగా ప్రతి మనిషి ఒక ప్రశ్నగా కనిపించాడు గద్దరన్నకు. అందుకే తన పాటల నిండా ప్రశ్నలే ప్రశ్నలు. గాంధీజీ గురించి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నట్లు **"ఇలాంటి ఓ వ్యక్తి ఈ భూప్రపంచం మీద రక్తమాంసాలు గల శరీరంతో మనుగడ సాగించారంటే ముందు తరాల వాళ్లు నమ్మలేకపోవచ్చు".** ఈ మాటలు గద్దరన్నకు కూడా సరిగ్గా సరిపోతాయి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (41) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# విప్లవ వాగ్గేయకారుడు – గద్దర్

**డా. కె. సురేశ్ కుమార్,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె. ఫోన్ : 94405 43860

పెద్దగా పరిచయం అక్కరలేని పేరు. పెద్దగా పరిచయమైన పేరు. గద్దర్ గా పేరు పొందిన ఈయన అసలుపేరు గుమ్మడి విఠల రావు. మహారాష్ట్రలోని పాండురంగ విఠలనాధుని పేరున విఠలరావు, అని తల్లిదండ్రులు పెట్టిన పేరు. 'రావు' గౌరవవాచకం. ఇది మరాఠీ సంప్రదాయం. తన బిడ్డలని గౌరవంగా పిలవాలని ఆశించిన శేషయ్య ఆలోచన ఇది. ముగ్గురు ఆడ పిల్లలు, ఇద్దరు మగపిల్లలు శేషయ్యకి.

గద్దర్ అనేది విప్లవోద్యమం లోకి వచ్చిన తరువాత పెట్టుకున్న పేరు. 'గదర్' అంటే తిరుగుబాటు. జనం పిలుపుల్లో ఇది 'గద్దర్' గా మారింది. ఒక సాధారణ మైన వ్యక్తి విశేషమైన శక్తిగాను, ఒక సాధారణ కళాకారుడు, గాయకుడు అపూర్వశక్తి గాను..... ఎదగటం వెనుక... ఒక కథాపురుషుడిగా ఎదగటం వెనుక ఉన్న వ్యక్తులు, దోహద పడిన పరిస్థితులు స్థూలంగా వివరిస్తాను. గద్దర్ మరణం ఆయన గురించి మరలా మాట్లాడుకునేలా చేసింది. ఈ క్రమంలో ఎంతోమంది గద్దర్ గురించిన వారి ఆలోచనలను వ్యక్తం చేస్తున్నారు. ఇది నా ముచ్చట.

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదువుతున్న రోజుల్లో ఒకసారి 'గద్దర్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. యూనివర్శిటీ వ్యాన్‌లో కార్యక్రమం అయిన తరువాత వెంకటాపురంలో గద్దర్ ఇంటి దగ్గర దించటానికి వెళ్ళాము. అదే గద్దర్ని చూడటం –

అందమైన రూపం, రింగు రింగుల జుట్టు, ఆకట్టుకున్న ఆటా పాట. కల్మషం లేని నవ్వు, అందరితో కలిసిపోయే గుణం, స్పష్టమైన సైద్ధాంతిక లక్ష్యం, లక్ష్యసాధన కోసం నిజాయితీగా, నిబద్ధతగా కొనసాగటం .. ఇదీ గద్దర్ ప్రదర్శన చూసిన తర్వాత నాకు కలిగిన భావన.

ఎం.ఏ. పూర్తి అయిన తరువాత 'ఎం.ఫిల్' కి పరిశోధనాంశంగా గద్దర్ పాటల మీద చేయాలనుకున్నాను. గద్దర్ మీద అంటే సీటు ఇవ్వరేమో అనుకున్నాను. ఇచ్చారు. తెలుగు శాఖకి, విశ్వవిద్యాలయానికి, ముఖ్యంగా నాకు M.Phil, మరియు Ph.D లకు పర్యవేక్షకులుగా ఉన్న నాగురువు, ఆచార్య రంగనాథాచార్యులు గారికి ధన్యవాదాలు.

ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం కోసం విశ్వవిద్యాలయ స్థాయిలో గద్దర్ మీద పరిశోధన చేయడం ఇదే మొదటిసారి.

ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో గద్దరన్న దగ్గరకు వెళ్ళి పరిచయం చేసుకుని మీ మీద పరిశోధన చేస్తున్నానని చెప్పారు. సరే అన్నారు. కలవమన్నారు. రెండు సంవత్సరాలు సాగిన నా పరిశోధనలో ఒక సంవత్సరకాలం పరిశోధన నిమిత్తమై గద్దరన్నతో కొనసాగటం జరిగింది. అపుడు సూర్యం, చంద్రం, వెన్నెల చిన్నపిల్లలు – విమలక్క వంట చేసి పనికి, పిల్లలు స్కూలుకి వెళితే ఇంట్లో గద్దరన్న, నేను ఉండే వాళ్ళం. పరిశోధకునికి అవసరమైన సమాచారం పుస్తకాలు, తన డైరీలు, నోట్సు, డాక్యుమెంట్లు. Reports, క్యాసెట్స్, Apcle, పిలుపు, సృజన లాంటి పత్రికలు ఇచ్చి అవసరమైన సమాచారం సంగీతం రాసుకోమనేవాడు. సందేహాలు వచ్చినపుడు అన్నని అడిగేవాడిని, ఈ క్రమంలోనే తన జీవిత చరిత్ర అనే చెప్పుతూ ఉండగా Record చేసుకున్నాను. పాటలలో వస్తువు, బాణీలు, ప్రదర్శన మొ. విషయాల్లో ఎదురైన పలు అనుభవాలు సందర్భానుసారం చెప్పేవారు. నా బిడియం చూపి నాలో భయాన్ని పోగొట్టి, ధైర్యంగా ఉండేలా చేశారు. జ్ఞానాన్ని సంపాదించే .. క్రమంలో చొరవ ఉండాలి, ప్రయత్నించనిది ఏమీ సాధించలేమని చెప్పారు. అలా రోడ్డంట వెళ్ళు పుస్తకాల షాపు లో 'ఆచరణ' అని మావోసేటుంగ్ పుస్తకం ఉంటుంది. ముందుగా అది బాగా చదువు అన్నారు. ఎంత అలసటగా ఉన్నా పని ఉంటే మాత్రం చాలా చురుకుగా ఉండటం నేను ప్రత్యక్షంగా చూశాను. సాయంత్రం ఇంట్లో ఇరుకుగా ఉంటుందని సూర్యంగాని, చంద్రంగానీ తోడుగా 'మహాబోధి' స్కూలులో పడుకోవటానికి వెళ్ళే వాళ్ళం. 'మహాబోధి' స్కూలు గురించి అడిగితే అమరవీరుల పిల్లల కోసం నిర్మిస్తున్నాం అన్నారు. నా పరిశోధన కాలంలో గద్దరన్న విమలక్క పిల్లలు సూర్య, చంద్రం, వెన్నెల సహకారం మంచి జ్ఞాపకం.

శ్రామిక వర్గం, మధ్య తరగతి వర్గం, సమకాలీన సమస్యలు, రాజకీయాలు, ముఖ్యంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలని సాయుధ పోరాటం చేస్తున్న నక్సలైట్లకు సాంస్కృతిక రంగంలో ఆట, పాట మొదలైన కళారూపాల ప్రదర్శన ద్వారా సాహిత్యాన్ని సృష్టించి కళారూప ప్రదర్శనలు ఇచ్చినవాడు గద్దర్.

తను తీసుకున్న వస్తువు కట్టిన బాబు, పాడిన పాటు, భాష కళారూప ప్రదర్శన అనే అంశాలతో... కవిగా రచయితగా, గాయకుడిగా, తత్త్వవేత్తగా, సాంస్కృతికోద్యమ నిర్మాణ సారధిగా, కళాకారుడిగా అత్యున్నతమైన స్థాయికి ఎదిగిన వాడు గద్దర్. ఈ రకంగా చూసినపుడు చరిత్రలో మనకు ఎందరో మార్గదర్శకులుగా కనిపిస్తారు. అయితే తెలుగు సాహిత్యంలోనే కాదు ప్రపంచ సాహిత్యం, చరిత్రలో చూచినా గద్దర్ ఒక మెట్టు పై స్థాయిలో ఉంటాడు.

గద్దర్ గురించి మాట్లాడటానికి, రాయడానికి ఎన్నో కోణాలున్నాయి. 75 సంవత్సరాలు 6 నెలలు పైబడిన జీవితకాలం గద్దరన్నది. దాదాపు 60 సంవత్సరాల కాలం పోరాటం చేస్తూనే ఉ

న్నాడు. ఎన్నో అనుభవాలు, ఎంతోమందితో పరిచయం, అవన్నీ బయటకు చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. మనిషిది భౌతిక మరణమే గాని ఆయన ఆలోచనలు, ఆ భావధార ఆగేది కాదు. ఎవడి కష్టఫలితం వాడికి దక్కే వరకు, అందరూ దోపిడి లేని సమాజంలో సంతోషంగా ఉండాలనేది గద్దర్ కోరిక. ఈ క్రమంలోనే విప్లవోద్యమంలోకి వెళ్ళినా, అందులో నుంచి బయటకు వచ్చినా ఆయన నడక సాగింది.

ప్రస్తుతం నేను విప్లవ వాగ్గేయ కారుడు – కథాపురుషుడు గా గద్దర్ ఎదిగిన క్రమాన్ని నా పరిశోధన ఆధారంగా కొన్ని ముఖ్య విషయాల్ని ప్రస్తావిస్తాను. గద్దర్ విశిష్టతకి కారణాలని ఇవి చెప్పొచ్చు.

ప్రజాకళారూపాలు, పాట, ప్రజల బాణీలు, వస్తువు – భావజాలం, గద్దర్ ఆహార్యం, గద్దర్ ప్రదర్శనా విధానం :

1. గద్దర్ ప్రధానంగా పల్లె సంస్కృతి నుంచి వచ్చినవాడు, ఎదిగినవాడు. ప్రజాకళారూపాలతో మమేకమైనవాడు. జనం మెప్పు ఆదరణ పొందటం ప్రత్యక్షంగా అనుభవంలోకి తెచ్చుకున్నవాడు. దీని మీద ప్రత్యేకంగా ఒక అధ్యాయం నా సిద్ధాంత గ్రంథంలో రాశాను. కొన్ని ముఖ్య అంశాలు మాత్రం ప్రస్తావిస్తాను. గద్దర్ కళాకారుడిగా ఎదగటానికి తోడ్పడినవారు వారి తల్లి లచ్చుమమ్మ తండ్రి శేషయ్య గార్లు.

గురువులు శేషారెడ్డి, భీమశంకర శాస్త్రి. ఇంటి పక్కనే ఉన్న మాదిగ జోగేను, పోషవ్వ, ఆనెమ్మ హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు చెప్పేవారు. చిందు బాగోతం, చిడతల రామాయణం చెప్పే కళాకారులు, శ్రద్ధగా నమాజు చేసే ముస్లింలు, భజనలు, కోలాటాలు, భిక్షుక గాయకులు ఆలపించే పాటలు మొత్తంగా చూసినపుడు గద్దర్‌కి కళారూపాల పట్ల ఉన్న ఆసక్తి, పల్లె వాతావరణం, చిన్ననాటి గద్దర్ కళాకారుడిగా, గాయకుడిగా, ప్రదర్శకుడిగా ఎదగడానికి దోహదం చేసింది. గద్దర్‌లో ఉన్న అంతర్లీనంగా మనసులో సుప్తచేతనావస్థలో ఉన్న ఈ కళారూపాలని, కళాకారుడిని జాగ్రతం చేసి గద్దర్ని విప్లవ మార్గం వైపు నడిపించిన మార్గదర్శకుడు ఆర్ట్ లవర్స్ వ్యవస్థాపకుడు, తర్వాత కాలంలో నటుడు, నిర్మాత దర్శకుడిగా మారిన బి. నర్సింగరావు. మాభూమి, (నటుడు) దాసి రంగులకల. మట్టిమనుషులు చిత్రాల దర్శకుడు యితడు. ఇతడు విఠలరావు అనే శిలను శిల్పంగా మార్చి, ప్రాణం పోసిన వాడు.

ఆర్ట్ లవర్స్‌కి నక్సల్స్‌తో పరిచయమున్న శంకరన్ మొదలైన వారి పరిచయం పెరగడంతో దాని కార్యక్రమాల స్వరూపం మారింది. సంస్థలోని వాకు రకరకాల కారణాలతో భయాలతో వెళ్ళిపోయినపుడు నిలబడినవాడు గద్దర్ ఆర్ట్ లవర్స్ నిర్వహించే కార్యక్రమాల్లో కవితలు, చర్చలు, సరస్సులు, నాటికలు, ఉపన్యాసాలు మొ. వాటి స్థానంలో జానపద కళారూపాల్లో ప్రధానమైనదైన పాటను తీసుకువచ్చాడు. ముందుగా చెప్పినట్టు గద్దర్‌ను పాటల వైపు మళ్ళించింది కూడా నర్సింగరావే.. ఆర్ట్ లవర్స్ క్రమంగా జన నాట్యమండలిగా ఎదిగిన క్రమంలో దానికి అవసరమైన సాహిత్యమంతా ఒకానొక దశలో గద్దరే సృష్టించాడు. ప్రజల దగ్గరకు వెళ్ళాలంటే ప్రజాకళారూపాలతోనే వెళ్ళాలన్నవాడు గద్దర్. సాహిత్యంలో రావిశాస్త్రి, శివసాగర్ లను మించి జనంతో మమేకమైన వాడు గద్దర్. తన కళా ప్రదర్శన ద్వారా అన్ని వర్గాల ప్రేక్షకులని మైమరపించాడు.

**ఇక రెండవ అంశం బాణీలు :** గద్దర్ పాటలకి ఎంతో పేరు రావటానికి 'బాణీల' పాత్ర ఎంతో ఉంది. ఈ బాణీలన్నీ నూటికి తొంభై ఎనిమిది జానపద బాణీల ఆధారంగా పుట్టినవి. ప్రజల బాణీలు పనిలో నుంచి పుట్టుకొచ్చినవి. ఈ బాణీలకి మార్పు చెందడం, అభివృద్ధి చెందడం అనే మంచి లక్షణం వుంది. ఇది పనికి అడ్డురాని, ప్రజల బాణీ కాబట్టి ప్రజలు ఆదరిస్తారు. నేటి సమాజంలో కూడా వ్యవసాయ ఉత్పత్తి విధానమే ప్రధాన ఉత్పత్తి విధానంగా వుంది కాబట్టి ఇది ప్రధానమైనది అంటారు గద్దర్. అందుకే గద్దర్ పాటలన్నీ ప్రజల బాణీల తరగని గనుల నుంచి తవ్వి తీసుకోన్నవే. గద్దర్ బాణీలను పరిశీలిస్తే 1. జానపద బాణీల ఆధారంగా 2. ఇతర జానపద కళారూపాల ఆధారంగా 3. ఇతర భాషల జానపద బాణీల ఆధారంగా 4. కొన్ని మాటలకి జానపద యాస చేర్చి 5. సామెతలు మొదలైన వాటినుంచి. 6. సినిమా పాటల ఆధారంగా 7. గిరిజన భాగం, మైదానం వారు కలవడం ద్వారా 8. భక్తి ఉద్యమాల నుంచి తీసుకున్నవి 9. పనిలో వచ్చే శబ్దాల ఆధారంగా 10. సంగీత వాద్యాల ఆధారంగా ..

పాటల విశ్లేషణలో ఏ పాట దగ్గర ఆ పాట బాణీకి మూలమైన జానపద బాణీని కూడా చెప్పటం జరిగింది. పాటకు బాణీ ఎన్నుకోవడం కూడా ఉద్యమ పరిస్థితులను బట్టి ఎంచుకున్నట్టు తెలుస్తుంది. బాణీని ఎంచుకునేటప్పుడు రెండు విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి అంటాడు గద్దర్. **"ఒక మంచి బాణీ దొరికినప్పుడు ఆ బాణీని ఒక మంచి అవకాశం వచ్చేదాకా లేదా ఆ బాణీలో సరి అయిన విషయంతో సరితూగే దాకా ఓపికతో వేచి ఉండాలి. ఆ బాణీని నెమరు వేయాలి లేదా రికార్డు చేసి, దాచి ఉంచుకోవాలి. అట్లాంటి అవకాశం రాగానే అమ్ముల పొది లోని బాణం తీసి గురి పెట్టినట్టు వాడాలి. అప్పుడు గురిపెట్టిన దగ్గరే తగులుతుందంటాడు. బాణీ ని గుడ్డిగా అనుకరించడం వల్ల కూడా మంచి ఫలితాలు తీసుకు రాలేమని అనుభవం తెలుపుతుంది అంటాడు. అదేవిధంగా ఒక బాణీని గుడ్డిగా అనుకరించడం వల్ల కూడా మంచి ఫలితాలు తీసుకురాలేమని అనుభవం తెలుపుతుంది"** (గద్దర్, తరగని గని పు.193)

**వస్తువు :** మార్క్స్, లెనిన్, మావో ఆలోచనా విధానంలో భారతదేశంలో నక్సలైట్స్ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని

సాధించడానికి చేస్తున్న పోరాటానికి సాంస్కృతిక రంగంలో కళాకారుడిగా సాహిత్యాన్ని సృష్టించడం, ప్రదర్శించడం గద్దర్ పని. దీనికోసం తను రచనలోని వస్తువు ఉంటుంది. శ్రీశ్రీ, రావిశాస్త్రి, శివసాగర్ లాంటి వాళ్ళు. ఒక దశ వరకే వచ్చినారు. గద్దర్ ఏ అంశం మీద పాటరాసినా విప్లవీకరించడం. అన్యాయాన్ని ప్రశ్నించటం ఉంటుంది. ఇది చాలా సహజంగా ఉంటుంది. ఎవరికైనా ఇలా జరగడం లేదా ఇలా అడగటం సబబే కదా అన్న తీరున పాటలోని, రచనలోని వస్తువుని ఒక క్రమంలో ఏర్పరుస్తారు. అది జీవితమంత స్పష్టంగా ఉంటుంది. వస్తువుతో జనాన్ని 'కన్విన్స్' చేయడం సహజంగా ఉంటుంది. తనకి, తన సిద్ధాంతాలకి వ్యతిరేకులైనా ఆలోచించేలా చేస్తుంది...

**గద్దర్ ఆహార్యం :** మంచి రంగు,చూడచక్కని రూపం. అందమైన, కల్మషం లేని నవ్వు, రింగు రింగుల జుట్టు..ఎర్రరుమాలు చేతిలో కర్ర, కాళ్ళకి గజ్జెలు....

గద్దర్ కంటే ముందు ఎంతోమంది కళాకారులు, గద్దర్ సమకాలికులు, వారివారి పద్ధతుల్లో వేషధారణ చేసుకుని ప్రదర్శనలిచ్చారు. జనం దగ్గరకు వెళ్ళారు. గాంధీజీ పంచతో, అంబేద్కర్ సూటుతో, కాంగ్రెస్ నాయకులు, కమ్యూనిస్ట్లు, భక్తి ఉద్యమకారులు, ప్రజానాట్యమండలి కళాకారులు. తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొన్న కళాకారులు, సుద్దాల హనుమంతు, మొదలైన ప్రజాకళాకారులు; గద్దర్ సమకాలికులు మాస్టార్జీ, వంగపండు, శక్తి, మొ. వీరిలో కొంతమంది తప్ప మిగతా వారు సందర్భానుసారంగా ఆహార్యం, దుస్తులు ధరించి ప్రదర్శన లిచ్చేవారు. కాని గద్దర్ ప్రదర్శన అనగానే జనానికి గోచీపెట్టుకొన్న పంచె, చొక్కా లేకుండా మెడలో ఎర్రకండువ, భుజాన గొంగడి, చేతికి ఎర్ర రుమాలు చేతిలో కర్ర ధరించిన రూపం కనపడుతుంది.. అయితే అవసరాన్ని బట్టి మార్పులు చేసుకుంటూ రావడం ఎప్పుడూ కనిపిస్తుంది. ఎక్కువ కాలం అదేరూపంలో ప్రదర్శన ఇవ్వటం వలన గద్దర్ అనగానే జనం మదిలో అదేరూపం మెదులుతుంది.

గద్దర్ని ఇంటి దగ్గర చూసినపుడు ఆయనతో కలిసి వెంకటాపురం లోని ఇంట్లో ఉంటున్నప్పుడు మొదట్లో ఎప్పుడూ అదే 'డ్రెస్' లో ఉంటారనుకునే వాడిని. ఇంట్లో ఉన్నపుడు ఒకసారి లుంగీ, ఒకోసారి ప్యాంట్ కట్టేవాడు. బెల్ట్లాగా తాడు గాని, లేదా ఏదో ఒక పట్టి కాని కట్టేవాడు. బట్టలు చాలా సాధారణమైనవి కట్టేవాడు. వాటిమీద సరదాగా జోక్స్ వేసి నవ్విస్తుండేవాడు .

**ప్రదర్శనా విధానం :** ఒక ఆటవిడుపు, ఒక ఉత్సాహం, ఒక దీర్ఘాలోచన, ఒక ఉద్విగ్నం, శ్రద్ధగా జనాన్ని తను అనుకున్న దగ్గర మొదలు పెట్టి, అనుకున్న లక్ష్యానికి తీసుకెళ్లటం, మనిషి మనసుల్లోకి తీసుకెళ్ళి వారిని ఆలోచింపచేయడం, కర్తవ్యాన్ని నిర్దేశించడం ఇది గద్దర్ ప్రదర్శన ప్రధాన లక్ష్యం.

జననాట్య మండలి పాట, ప్రదర్శన స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో సాము అని జనంలోకి విస్తృతంగా వెళ్ళడానికి గద్దర్ ఆట, పాట, ప్రదర్శన తోడ్పడ్డాయి. గద్దర్ ప్రదర్శనలో పైన పేర్కొన్న అంశాలన్నీ మిళితమై కనిపిస్తాయి. అవి నిజాయితీగా, నిబద్ధతతో సాగాయి. ప్రతీ ప్రదర్శన ప్రాణం పణంగా పెట్టి ఇచ్చినది. పార్టీ మెచ్చుకోలు కోసమో, జనంలో పేరు కోసమో ఇచ్చినవి కాదు. అనేక ఆటుపోటులు, బెదిరింపుల మధ్య ఎక్కువ శాతం ప్రదర్శనలు జరిగేవి. ఉదా : ఒకసారి రాయలసీమలోని ప్రొద్దుటూరులో ప్రదర్శనకి వెళ్ళినపుడు NTR మీద ఏమైనా పేలితే బాంబులు వేస్తాము, అని వేదిక మీదకి వెళ్ళగానే చీటి రాసి పంపించారు.. ఈయన అప్పటికప్పుడు కార్యక్రమ సరళిని రూపొందించుకున్నాడు. విప్లవకారుడు పాదరసంలా చురుకుగా, ఉండాలంటాడు. ఇది నిరంతరం, నిబద్ధతలో నిమగ్నమైనపుడు మాత్రమే సాధ్యమవుతుంది. అందుకే ఈయన దగ్గర భౌతికపరమైన ఆయుధాలేమీ ఉండవు "He is mentally Armed" అలా చీటి అందుకోగానే దాన్ని మడిసి గోసిలో పెట్టుకుని

**రక్తమిచ్చిన రాయలసీమకు / ఏ మిస్తవు రో రామన్న**
**నీళ్ళు అడిగిన రాల్లసీమకూ / కన్నీళ్ళే మిగిలాయన్నా**

అని మొదలు పెట్టాడు. బాంబుల వర్షం కాదు, చప్పట్ల వర్షం కురిసింది.

ఇలా ఒకటి కాదు రెండు కాదు.. ఎన్నో ప్రదర్శనలు.. ఉద్యమ అవసరాలకి అనుగుణంగా సాహిత్యం సృష్టించి, ప్రేక్షకులనుబట్టి ప్రదర్శన నిర్వహించటం కనిపిస్తుంది. అది కత్తిమీద సాములాంటిది.

తెలుగు సాహిత్యంలో లిఖిత సాహిత్యానికి, మౌఖిక సాహిత్యానికి మధ్య వారధి గద్దర్. ఎప్పటికప్పుడు తనని తాను మార్చుకుంటూ పార్టీ సిద్ధాంతాలకి, ప్రజాఉద్యమాలకి వెన్నెముకగా నిలిచి తూటాల గుండ్లు తగిలినా చలించని యోధుడు. ఎర్రజెండ దించని ధీరుడతడు.

గాయకుడు, కవి, రచయిత, సాంస్కృతికోద్యమ నిర్మాణ సారధి, తెలంగాణ సాధనలో ముఖ్యుడు; అన్నిటిని మించి మానవతావాది. ఎవరి కష్ట ఫలితం వారికి దక్కేవరకు పోరాటం ఆపనన్నవాడు గద్దర్.

అన్నా పాట రాస్తున్నావు, బాణీలు కూరుస్తున్నావు, పాడుతున్నావు. ప్రచారం చేస్తున్నావు. **'విప్లవ వాగ్గేయకారుడు'** అని నాసిద్ధాంత గ్రంథంలో వ్రాస్తున్నా అంటే అంగీకరించారు ..

ఏరుల పుట్టుక వీరుల పుట్టుక ఎవరూ చెప్పలేదు.. చాలా చెప్పాల్సింది ఉంది. ఇక్కడ సరిపోదు, గద్దరన్నతో పరిచయం, పరిశోధన నా అదృష్టంగా భావిస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు**

1. డా. కే .సురేశ్ కుమార్ : గద్దర్ పాటలు పరిశీలన
2. గద్దర్ : తరగని గని

# కల్చరల్ లెజెండ్ – గద్దర్

**డా. మహేందర్ బర్ల,** ఫోన్ : 98859 37740



ఐదు దశాబ్దాలు పాటతో ప్రయాణం చేసి పాటను ప్రపంచానికి పరిచయం చేసిన ప్రజాయుద్ధనౌక గద్దర్. గద్దర్ అంటే ఒక యుద్ధం. ఒక ఉద్యమం. గద్దర్ అనగానే గోశి, గొంగడి, చేతికర్ర, కాళ్ల గజ్జెల సవ్వడి, ప్రజా పోరాట పాటలు గుర్తుకొస్తాయి. ఆయనంటేనే ఒక కళాత్మక రూపం. ఆ...హా...ఓ... హెూ అని గద్దర్ నోటి నుండి రాగం రావడంతోటి ప్రతి మనిషిలో ఒక కదలిక, చైతన్యం, ఆవేశం, దుఃఖం మంచు పొరల మాదిరిగా అనేక ఆలోచనలు మొదలైతాయి. గద్దర్ పాటలలో పోరుదారుల్లో నేలకొరిగిన అమరవీరుల త్యాగాల గుర్తులు, తడారని నెత్తుటి జ్ఞాపకాలు, పీడిత ప్రజల పోరాట రూపాలుంటాయి. బుర్రకథ, ఒగ్గుకథ, వీధినాటకాలు అనేక జానపద బాణీలను, ప్రజల పాటలను విప్లవోద్యమంలోకి మలిచిన సాంస్కృతిక సైనికుడు గద్దర్. పాలకుల దోపిడి, అన్యాయాలను, ప్రజల గోసను అప్పటికప్పుడు జనం మధ్యనే పాటను కైగట్టే శక్తి కలిగిన జనం గుండెల చప్పుడు గద్దర్.

తెలంగాణ ప్రాంతం గొప్ప సాంస్కృతిక నేపథ్యం ఉన్న నేల. కనుక ఈ సాంస్కృతిక జీవితంలో కథ చెప్పడం, పాటలు పాడటం, డప్పు కొట్టడం, డోలు వాయించడం ఏ కళ అయినా తాత, తండ్రి లేదా కుటుంబ సభ్యుల ద్వారానో అబ్బుతుంది. అట్లనే గద్దర్‌కు తన తండ్రి ద్వారా పాట వచ్చింది. గద్దర్‌లో గొప్పకళ ఉందని గుర్తించిన ఉపాధ్యాయుడు శంకర్ పాటలు పాడడానికి ప్రోత్సహించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో ఈ పాటల ప్రయాణానికి డార్లింగ్‌గా పిలుచుకునే బి.నర్సింగరావు తోడయ్యారు. జననాట్యమండలి ఈ సాంస్కృతిక యుద్ధనౌకను తయారు చేసింది.

1966లో కవులు, రచయితలు, కళాకారులు కలిసి 'ఆర్ట్ లవర్స్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఆర్ట్ లవర్స్ సంస్థ జననాట్యమండలిగా మారింది. జననాట్యమండలి ఏర్పాటు తరువాత గుమ్మడి విఠల్ గద్దర్‌గా మారి జననాట్యమండలిలో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలుగునేలమీద అనేక నాటకాలు వేశారు. బుర్రకథ, ఒగ్గుకథ, అనేక ప్రజల బాణీలను ప్రజా ఉద్యమాలలోకి తీసుకువచ్చారు. బి.నర్సింగరావు, దివాకర్, సంజీవ్, పద్మకుమారి, మా భూమి సంధ్య, డప్పు రమేశ్, డోలక్ దయ, వంగపండులతో మొదలైన గద్దర్ ప్రయాణం మలిదశ తెలంగాణ ఉద్యమంలో వచ్చిన మధుప్రియ వరకు అనేక మందితో కలిసి అలసట లేకుండా ఆడి పాడారు. ఈ పాటల ప్రయాణంలో ఎంతో మంది కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారు.

**"విప్లవ సాహిత్యోద్యమానికి నక్సల్‌బరీ, శ్రీకాకుళం పోరాటాల నేపథ్యం ఉంది. కమ్యూనిస్టులకు నిర్మాణంలో రహస్యం ఉంటుందే తప్ప వ్యక్తం చేయడంలో ఉండదు. కమ్యూనిస్టులు మాత్రమే సాహిత్యం, కళల్లో పనిచేసేవారినీ, అందువల్ల వారే సాంస్కృతిక సైనికులన్నారు మార్క్స్, లెనిన్, మావో".** ఈ విధంగా ఒక విప్లవ సాంస్కృతిక నేపథ్యం ఉన్న సైనికుడు గద్దర్.

ప్రధానంగా విప్లవోద్యమాలు, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, స్త్రీ విముక్తి ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక సామాజికోద్యమాలలో తనదైన పాత్ర పోషించారు. **'రిక్షాతొక్కే రహిమన్న రాళ్లుకొట్టే రామన్న హమాలి కొంరన్న డ్రైవరు మల్లన్న'** అంటూ కార్మికుల, కర్షకుల, హమాలి, ఆర్టీసీ కార్మికులకు అండగా నిలబడ్డారు. తన గళాన్ని వినిపించారు. **'జుంబకు జుంబకు జుంబకుబాల జుంబకు జుంబకు జుం'** అని అడవికి దండం పెట్టి ఆదివాసీల గోడును వినిపించారు. **'రేలారే రేలారే'** అంటూ గోండు కోయల నృత్యం చేశారు. **'నిండు అమాస నాడు ఓ లచ్చగుమ్మాడి ఆడపిల్ల పుట్టినాదే ఓ లచ్చగుమ్మాడి'** అని ఆడపిల్లల గురించి, మన తల్లుల గోసను వినిపించారు. **'నాసాకింద మీసా కింద నిన్ను జైల్ల పెట్టినారు నీకు నాకు తేడా లేదాయో ఓ పోలీసన్న'** అని పోలీసుల బాధలను పాడుతూ మీకు మాకు తేడా లేదన్నారు. మాభూమి సినిమాలో **"బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లేపోతవ్ కొడుకో నైజాం సర్కరోడ"** అనే పాటనుండి మొదలైన సినిమా పాటల ప్రవాహం **'జైబోలో తెలంగాణ'**లో **'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా'** వరకు అనేక పాటలు రాశారు, సినిమాల్లో పాటలు పాడి జనం గుండెల్లో నిలిచారు. అందులో భాగంగా విప్లవోద్యమం, దళితోద్యమం, తెలంగాణోద్యమం, స్త్రీల గురించి గద్దర్ రాసి, పాడిన నాలుగు

పాటలను గుర్తు చేసుకునే ప్రయత్నం చేద్దాం.

**"ఆగదు ఆగదు ఆగదు**
**ఈ ఆకలి పోరు ఆగదు**
**ఈ దోపిడి పాలన అంతం వరకు**
**సాయుధ పోరు ఆగదు**
**చీమల దండులు కదిలినయ్**
**పాముల గుండెలు అదిరినయ్**
**మేకపొట్టేళ్లు దుంకినయ్**
**తోడేళ్లు తోకముడిచినయ్**
**ఆవుల మందలు కదిలినయ్**
**పులులు పరుగులు తీసినయ్" (జననాట్యమండలి పాటలు, పుట:41)**

భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగే పోరాటంలో ప్రజల నెత్తురు జుర్రుక తాగే ఈ దోపిడి పాలనను పాతరేసే వరకు సాయుధ పోరాటం ఆగదని పిలుపునిస్తాడు. అడవిలో పుట్టిపెరిగిన జీవరాసులు ఈ అడవి మాదేనని చీమల దుండు వలె కదులుతున్నాయి అంటాడు. కవులు కళాకారులు మేధావులు సాయుధ పోరాటం మాదేనని ముందుకు కదులుతున్నారు. ఈ దోపిడి పాలనను అంతం చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుదని చెప్తాడు. తను నమ్ముకున్న విప్లవ రాజకీయాలను తన మాట, పాటలతో దేశ వ్యాప్తంగా పోరు జెండాను ఎగురవేశాడు.

1985లో ప్రకాశం జిల్లాలోని చీరాల మండలం కారంచేడు గ్రామంలో దళితులు మంచినీళ్ళు తాగే చెరువులో అగ్రకులాల వాళు దున్నపోతులను కడుగుతారు. దీన్ని అక్కడ ఉన్న దళితులు మేము నీళ్లుతాగే చెరువు కదా దున్నపోతులను కడుగితే మేము నీళ్లు ఎట్లా తాగాలె అని ప్రశ్నిస్తారు. దళితుడివి మమ్మల్ని ప్రశ్నిస్తవా అంటూ కమ్మ భూస్వాములు ముకుమ్మడిగా దాడిచేసి దళితుల్ని కొట్టి చంపుతారు. ఆ సందర్భంగా కారంచేడు ఒగ్గుకథ రాశారు.

**"దళిత పులులమ్మ**
**కారంచెడు భూస్వాములతోనే**
**కలబడి నిలబడి పోరుచేసినా**
**-----------------**
**-----------------**
**కాలినమండెతో మండే గుండెతో**
**నివురు గప్పినా నిప్పురవ్వలు**
**భూకామాందుల మదమణచుటకు**
**అంటుకున్న పెనుమంటలు వాళ్ళె"**
**(జననాట్యమండలి పాటలు, పుట:49)**

దళితులను ఊచకోత కోసి చంపిన కమ్మ భూస్వాముల మదం అణచివేయడానికి బరిసెలెత్తుకొని ఈ ఊరుమాదే, ఈ వాడమాదే



అని దళిత బహుజనలు ఒక్కటై వారి పనిముట్లను ఆయుధాలుగా చేసుకొని తిరుగబడిన తీరును ఈ పాట ద్వారా తెలిపారు.

నైజాం నిరంకుశ పాలనకు ఎదుర్కోవడానికి ఆంధ్ర మహాసభ 1946లో సాయుధ పోరాటానికి సిద్ధమైంది. కొంతకాలానికి ఉద్యమం ఆగిపోయింది. అనేక నిరసనల మధ్య 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. 1956 నుండి తెలంగాణ ప్రాంతం అవమానాలకు గురవుతూనే ఉంది. విద్యా ఉద్యోగాలలో ఆంధ్రవాళ్లు చేరిన కారణంతో 1969లో విద్యార్థి నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నడిపించారు. ఆ ఉద్యమంలో 369 మంది అమరులయ్యారు. 1996లో ప్రజాస్వామిక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాలలో గద్దర్ తన గళాన్ని వినిపించారు. మా నీళ్లు మాక్కావాలె, మా నిధులు మాక్కావాలె, మా భూమి మాక్కావాలె, మా ఉద్యోగాలు మాక్కావాలె అని నినాధాలిస్తూ తెలంగాణ అంతా తిరుగుతూ ఆంధ్రపాలకుల మోసాలను తన పాటలతో ప్రజలకు ఎరుకజేశారు.

**"తెలంగాణలో బడులే లేవు**
**ఉన్నబడులకు భవంతుల్లేవు**
**వానకాలము ఎండాకాలము**
**వారం రోజులు సెలవు దినాలే**
**సెట్టుకింద మన పోరగాల్లురా**
**నీడ దిరిగినట్లు తిరుగుతుంటరూ**
**పోరలు వొస్తే పంతులు రాడు**





**పంతులు వొస్తే పోరలు రారు**
**పోరలు పంతులు ఇద్దరు వొస్తే**
**రాయనీకి మా పంతులుగారికి**
**చాకిపీసులేదో మా యన్నల్లరా" (ఒక్కొక్క పాటేసి తెలంగాణ నూటొక్క పాటలు, పుట: 159).**

తెలంగాణలో బడులు సరిగాలేవు, ఇక్కడ ఉపాధ్యాయులు లేరు, ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు రారు. ఇద్దరు వస్తే రాయడానికి చదువు చెప్పే సార్‌కు చాకిపీస్ లేని దుస్థితి తెలంగాణలో ఉందని ఆంధ్ర పాలకుల తీరును ఎండగట్టారు. ఇట్లాంటి దుర్భర పరిస్థితులలో కూడ ఎవరో ఒకరు డిగ్రి పూర్తి చేసిన ఉద్యోగాల కోసం వెళితే సదువు రాదని ఎక్కిరిస్తారు. ఐఏఎస్, ఐపిఎస్‌లు అందని ద్రాక్షనే. తెలంగాణలో ప్రాజెక్టులుకట్టి కృష్ణ, గోదావరి నీళ్లు ఆంధ్రోళ్లు కొల్లగొట్టుక పోతున్నారని తెలంగాణ గుండె చప్పుడును వినిపిస్తాడు. ఆంధ్ర పాలకుల అన్యాయాలను తెలంగాణ సమాజానికి వివరిస్తూ పోరుబాట నడిపిస్తాడు.

**"సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో**
**లచ్చుమమ్మో**
**సినబోయి కూర్చున్న వెందుకమ్మో**
**ఎందుకమ్మా**
**--------------------**
**--------------------**
**కొడవండ్లు నూరుకొని లచ్చుమమ్మో లచ్చుమమ్మో**
**నువు కూలిదండులో కలువు లచ్చుమమ్మో లచ్చుమమ్మా"**
**(జననాట్యమండలి పాటలు, పుట : 74)**

విప్లవోద్యమంలోకి వెళ్లిన తనగురించి తన తల్లి లచ్చుమమ్మ పడుతున్న బాధను చిత్రించారు గద్దర్. విప్లవోద్యమంలో లచ్చుమమ్మ బాధనే కాదు అజ్ఞాతంలో ఉండి విప్లవోద్యమ పోరాటాలు చేస్తున్న వీరులను కన్న తల్లుల బాధ ఈ పాటలో మన కళ్లముందుంచారు. పొద్దంతా బురదలో నిలబడి ఎద్దోలే పనిచేసినా పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టే పరిస్థితి లేదు. దసరా, దీపావళి పండుగలు వచ్చిన చేతుల నయా పైసా కూడలేదు. ఈ దుస్థితి పోవాలంటే కొడవండ్లు, గుత్పలు చేతపట్టుకొని పోరుదండులో కలువమని పిలుపునిస్తాడు.

గద్దర్ రాసిన పాటలే కాకుండా వర్గీస్ రాసిన **"ఎర్రజెండోరన్న ఎర్రజెండేరా"** అనే పాట నుండి మొదలై గూడ అంజన్న రాసిన **"భద్రం కొడుకో నా కొడుకో కొంరన్న జర పైలం కొడుకో నా కొడుకో కొంరన్న జెర", "ఊరు మనదిరా ఈ వాడ మనదిరా",** చెరబండరాజు రాసిన **"కొండలు పగలేసినం బండలనే పిండినం మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు కట్టినం"** లాంటి చాలా పాటలను తన గానంతో ప్రజలలోకి తీసుకెళ్లారు. **"భూపాల్ రాసిన గొల్లకుర్మ గోత్రమింటవా ఓరి అబ్బిగా గొల్లోని బాధలింటవా"** హిమజ్వాల రాసిన **"ఎర్రఎర్ర దారిలోన నా చెల్లమ్మ ఎర్రజెండలెత్తరావే నా చెల్లమ్మ",** అల్లం వీరయ్య రాసిన **"ఎర్రజెండెర్రజెండెన్నీయలో ఎర్రర్రనీదీ జెండెన్నీయ్యలో"** ఇట్లాంటి ఎందరో అజ్ఞాత కవులు రాసిన పాటలు పాడుతూ ప్రజా పోరాటాలు నడిపించారు. వెన్నుపూసలో ఉన్న తుపాకి తూటా గాయం సలుపుతున్న తన గేయాన్ని ఎప్పుడు వీడలేదు. అదే వెన్ను పూసల ఉన్న తూటానే ఎత్తుమంది ఎర్రజెండ అంటాడు.

ఆధునిక వాగ్గేయకారుడైన గద్దర్ పాటను ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రజల గుండెలలో నిలిచిపోయే గొప్ప సాహిత్యాన్ని సృష్టించారు. సమాజ మార్పుకోసం చేసే పోరాటంలో ఎన్నో సమస్యలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారు. ప్రజా సమూహాలు సృష్టించిన సాహిత్యాన్ని రాజకీయ భావజాలంతో చైతన్య పరిచి ఆ సమూహాలకే అంకితం చేసిన కల్చరల్ లెజెండ్ గద్దర్. అట్లాంటి గద్దర్ జీవితాన్ని, పాటలను, బుర్రకథ, ఒగ్గుకథ ప్రజా సాహిత్యాన్ని రికార్డు చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉంది. కనుక విశ్వవిద్యాలయ స్థాయిల్లో ప్రత్యేకంగా గద్దర్ సాహిత్యం మీద పరిశోధనలు జరుగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**"నా దేశంలో నా ప్రజలు ఎంతకాలం మనుష్యులుగా గుర్తింప బడరో అంతకాలం ఈ తిరుగుబాటు గీతం పాడుతునే ఉంటాను నా జాతి నా వారసత్వాన్ని కొనసాగిస్తుంది"** అంటాడు గద్దర్. ఆయన పోరాట వారసత్వాన్ని, పాటను కొనసాగించడమే గద్దర్‌కు నిజమైన నివాళి.

**ఆధార గ్రంథాలు :**

1. తిరుమలరావు, జయధీర్. (1988). తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజాసాహిత్యం, సాహితి సర్కిల్, హైదరాబాద్.

2. తిరుమలరావు, జయధీర్. (సం.పా) (2014). ఒక్కొక్క పాటేసి... తెలంగాణ నూటొక్క పాటలు, తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్.

3. కాశీం.సి. (2011). తెలంగాణ ఉద్యమాలు – పాట, సహచర ప్రచురణలు, హైదరాబాద్

4. జననాట్యమండలి పాటలు, (2004). క్రాంతి ప్రచురణలు.

5. గద్దర్. తరగని గని

# గద్దర్ పాట అజరామరం

**డా. శివరాత్రి సుధాకర్,** ఫోన్ : 9491124112

గద్దర్ కవి, కళాకారుడు, విప్లవ సాంస్కృతిక యోధుడు, జననాట్య మండలి నాయకుడు, పాటను సాయుధం చేసిన విప్లవకారుడు. అతని గళం వసంతమేఘ గర్జన. అతని పాట 'తరగని గని'. ఎగసిపడే గోదారి నదీ ప్రవాహం. ఎక్కడ పుట్టిందీ పాట. ఎక్కడ పెరిగిందీ ఆట, మాట. మెదక్ జిల్లా తూప్రాన్ దళితవాడల పుట్టింది. తల్లి లచ్చుమమ్మ. కూలి తల్లి. తండ్రి మేస్త్రీ. నిరుపేద కుటుంబం. చిన్నప్పట్నించే కులం వల్ల అంటరానితనం, వెలి, వివక్ష, దోపిడీ, పీడన, అణచివేత. ఇవన్నీ అతని మనసులో మానని గాయం చేశాయి. అవి కాలంతోపాటు మరింత కలవరపరిచాయి. అమ్మ నాట్లేసేది, కోతలు కోసేది, కుప్పలు నూర్చేది. పొలాల్లో పరిగేరుకునే పరిస్థితి. పొద్దంతా పనిచేస్తేనే రాత్రికింత బువ్వ. లేకుంటే పస్తులే. అమ్మతో కలిసి కూలిపనులు చేశాడు. అట్లాంటి బతుకులోంచి వచ్చాడు గుమ్మడి విఠల్. పేదరికం ఎట్లా ఉంటదో అర్థమైంది. దాన్నుంచి బయట పడాలంటే చదువొక్కటే ఆయుధమని తెలుసుకున్నాడు. పనిచేస్తూనే చదువుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదివాడు. అమ్మతో కలిసి కూలి పనులకు పోయినపుడు నాట్లేసే కూలి తల్లుల పాటలు విన్నాడు. తన అమ్మ లచ్చుమమ్మ పాటలు పాడేది. వినసొంపైన గొంతు తనది. అవి గుండెల్ని మీటే పాటలు. గుండెతడి ఉన్న పాటలు. విఠల్ ఆ రాగాల్లో లీనమయ్యాడు. పాటల హొయల్లో నడిచిపోయాడు. చుట్టూ ఉన్న జీవితాన్ని పాటలుగా కైగట్టడం నేర్చుకున్నాడు. కవితలు, పాటలు అల్లాడు, పాడాడు. అతణ్ని బుర్రకథ ఆకర్షించింది. ఆ కళారూపాన్ని అధ్యయనం చేశాడు. ప్రజల బాణీలతో సొంతంగా బుర్రకథలు రాసి, ప్రదర్శించాడు.

ఏ సాహిత్యం గురించి సమగ్రంగా తెలుసుకోవాలన్నా స్థల, కాలాల అధ్యయనం తప్పనిసరి. జనం పాటల ప్రభంజనం అర్థం కావాలంటే గద్దరే రాసినట్టు **"ప్రతి పాటకు ఒక సజీవమైన కథ ఉంది. ఆ కథలెనుక ఒక పోరాటం ఉంది. ఆ పోరాటాన్ని నడిపే ఓ సంఘం ఉంది. ఆ సంఘాన్ని నడిపే ఓ పార్టీ ఉంది. పాట – కథ – పోరాటం – సంఘం పార్టీని కలిపి చూస్తేనే పాట యొక్క సజీవ కథ అర్థమవుతుంది"** అనే మాటలు అక్షర సత్యం. (గద్దర్; 1991, పు.123)

గద్దర్ పాట గురించి అర్థం కావాలంటే అతణ్ని కవిగా మలిచిన కాలాన్ని తెలుసుకోక తప్పదు. ఎట్లాంటి కాలమది. కోపోద్రిక్త యువతరం శిరమెత్తిన కాలం. స్వేచ్ఛకోసం పిడికిళ్లెత్తి నినదించిన కాలం. పల్లెలూ పట్టణాలూ రగులుతున్న కాలం. దేశవ్యాప్తంగా యూనివర్శిటీలన్నీ యుద్ధక్షేత్రాలుగా మారిన కాలం. ఇట్లాంటి కాలమే



గద్దర్‌ను వెలిగించింది. పోరాటాల్లోకి నడిపించింది. పాటను సాయుధం చేసింది. ప్రజల బిడ్డగా మలిచింది.

నక్సల్బరీ, శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాట ప్రేరణతో హైదరాబాద్‌లో 'ఆర్ట్ లవర్స్' అనే సాంస్కృతిక సంస్థ (1966) ఏర్పడింది. సమాజ సాహిత్య సంబంధాలను అధ్యయనం చేసింది. యువతరానికి అధ్యయనం, ఆచరణ నేర్పింది. అందులో చేరిన యువకులంతా విప్లవ భావాలతో ఉన్నవాళ్లే. ఆ సంస్థ 1970లో హైదరాబాద్ నుంచి అల్వాల్‌కు మారింది. వెంకటాపురంలో ఉండే విఠల్‌బాబు ఓ మిత్రుని ద్వారా 'ఆర్ట్ లవర్స్' గురించి విన్నాడు. ఆ సంస్థ బాధ్యుడు బి.నర్సింగరావును కలిశాడు. పరిచయం చేసుకున్నాడు. తన పాటల గురించి చెప్పాడు. ఆ సంస్థ వార్షికోత్సవంలో ఓ బుర్రకథ చెప్పాడు. అది అల్లూరి సీతారామరాజు బుర్రకథ. ఆ సెలయేటి గానం విని జనమంతా పరవశించారు. అప్పుడే అతనిలో ఊటసెలిమెలాంటి పాటల్ని కనుగొన్నాడు నర్సింగరావు. అతనికి కొన్ని జానపద బాణీలిచ్చి, వాటిని విప్లవీకరించాలని చెప్పాడు. అట్లా రాసిన మొదటి పాట **'ఆపుర రిక్షోడో రిక్షెంట నేనొస్త'**. ఇది 'పిలుపు' పక్షపత్రిక (16 నవంబర్ 1972; పు.10) లో అచ్చయింది. వి.బి.గద్దర్ అనే కలంపేరుతో. **"విప్లవం నడుప నీవు ఉరికొయ్యలోనైనా ఉయ్యాలలూగన్నా"** అంటూ పీడిత ప్రజానీకాన్ని చైతన్యం చేసిన పాటది. 'ఆర్ట్ లవర్స్' శిక్షణ తరగతులతో అతనికి శ్రామికవర్గ దృక్పథం అలవడింది. అది కొత్తచూపు. నక్సల్బరీ వెలుగు. శ్రీకాకుళం గిరిజనం పోరాట బావుటా. అది రక్తసిక్త దారుల్లో ఎగసిన అరుణపతాక. అట్లా ప్రజల పాటను రగల్‌జెండాలా ఎగరేశాడు.

భారతదేశంలో విప్లవోద్యమం సమాజ చరిత్రను మార్చేసింది. మార్క్సిస్టు దృక్పథంతో సమాజాన్ని అధ్యయనం చేసింది. విప్లవ



సాహిత్యోద్యమం తెలుగు సాహిత్య, కళారంగాల్లో వర్గపోరాట భావనను తీసుకొచ్చింది. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం వెలుగులో సమాజ మార్పు కోసం వ్యూహం, ఎత్తుగడల్ని సిద్ధంచేసుకుంది. వీటిని సాహిత్యంలోకి తీసుకొచ్చింది. మాటకు, రాతకు, ఆచరణకు నిబద్ధత నేర్పింది. నిమగ్నతలోకి నడిపించింది. ప్రజా కళలు, సంస్కృతి పునాదిగా సామాజిక వాస్తవికతలోంచి సాహిత్యాన్ని సృష్టిస్తోంది. అట్టడుగు ప్రజల భాష, పలుకుబళ్లు, నుడికారం, పదబంధాలను సాహిత్యంలోకి తీసుకొచ్చింది.

1972 జులైలో 'ఆర్ట్ లవర్స్' సభ్యులతో 'జననాట్య మండలి' ఏర్పడింది. విప్లవ ప్రచార సంస్థగా ఎదిగింది. ప్రజా కళారూపాలను విప్లవీకరించింది. విప్లవ సాంస్కృతిక రంగాన్ని బలోపేతం చేసింది. అనేక నిర్బంధాలు, దాడులను ఎదుర్కొన్నది. విప్లవోద్యమ పురోగమనానికి దారులేసింది. తెలుగు సాహిత్యరంగంలో కొత్త ఆలోచనల్ని రేపింది. గుణాత్మక మార్పులను ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక బృందాలు ఏర్పడ్డాయి. 1974లో విశాఖ నుంచి వంగపండు ప్రసాద్ 'ఏరువాక' పాటల సంకలనంతో విరసంలో చేరాడు. తర్వాత జననాట్య మండలిలోకి వచ్చాడు. హైదరాబాద్ నుంచి సంధ్య, భూపాల్ బృందం 1975లో గుంటూరు జిల్లా గుజ్జనగుండ్లలో ప్రదర్శన ఇస్తున్నపుడు పోలీసులు దాడిచేశారు. ప్రచారం చేస్తుండగా పోలీసులు లాఠీచార్జ్‌చేశారు. జననాట్య మండలి సభ్యులను హింసకు గురిచేశారు. గద్దర్ రాసిన **'ఓరోరి అమీనోడా ఓరోరి సర్కిలోడా...'** అనే పాటను మళ్లీ పాడాలంటూ సంధ్యను కొట్టారు. కొద్దిరోజులకే (1975) ఎమర్జెన్సీ అమలైంది. ఈ కాలంలో దాదాపు అందరూ వెనుదిరిగారు. 1978 తర్వాత జెఎన్ఎంలో ఉండలేకపోయారు. ఎమర్జెన్సీ అనంతర వెల్లువలో గద్దర్ ఒక్కడే కొనసాగాడు. తర్వాత సంజీవ్, రాజనర్సింహ, దయ జననాట్య మండలిలో చేరారు. అనంతరం దివాకర్, రమేష్, పద్మ, ఏసు, కుమారి (గుంటూరు); కెసి., ఇవి. (నెల్లూరు), సుబ్బారావు (విశాఖ), మరికొందరు కామ్రేడ్స్ వచ్చారు.

1975 ఫిబ్రవరిలో రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడింది. 1978-85 మధ్యకాలంలో తెలుగు సాహిత్యంలోనూ సంస్కృతిలోనూ ఒక వెల్లువలా గాయకులు వచ్చారు. వందలాది మంది కవులు. వేలాది మంది గాయకులు. జిల్లా శాఖలు ఏర్పడ్డాయి. కొత్త కళాకారులు వచ్చారు. జననాట్య మండలి వాళ్లకోసం శిక్షణా తరగతులు నిర్వహించింది. 1978 ఫిబ్రవరిలో రాడికల్ విద్యార్థి సంఘం రెండో మహాసభ (వరంగల్) జరిగింది. జూన్ 24-25 మేలో 'రాడికల్ యువజన సంఘం' సభలు (గుంటూరు) జరిగాయి. 1978 తర్వాత ప్రజలను సమీకరించాలనే ఆలోచనతో విప్లవోద్యమం, రాడికల్ విద్యార్థి సంఘం 'గ్రామాలకు తరలండి' అని పిలుపునిచ్చాయి. వందలాదిమంది విద్యార్థులు గ్రామాలకు తరలారు. పల్లెల్లో శ్రామిక వర్గాన్ని కలిశారు. భూసంబంధాలను అధ్యయనం చేశారు.

క్రాంతి ప్రచురణలు 1979 మార్చిలో మొదటిసారి 'జననాట్య మండలి పాటలు' సంకలనం (రెండువేల ప్రతులు) ప్రచురించింది. ఆరేండ్లలో ఆరు ముద్రణలు వచ్చాయి. సెప్టెంబర్ 2004 దాకా పదమూడు ముద్రణలు వచ్చాయి. లక్ష ప్రతులకు పైగా జనంలోకి వెళ్లాయి. ఈ పుస్తకం ప్రభావం గురించి ప్రచురణకర్తలు... **"మాటలు ఒకానొక చారిత్రక అవసరాన్ని తీర్చడానికి భౌతికశక్తిగా మారుతాయి. గొప్ప విజయాలు సాధిస్తాయి. ఈ పరిణామాన్ని తెలుగు నేలమీద ప్రతి పల్లెలోనూ జననాట్య మండలి పాటలు ఋజువు చేశాయి. రాడికల్స్ నీళ్లలో చేపల్లాగా, ప్రజల మధ్య ఒకరుగా నిలపడానికి సాధనంగా పనిచేసింది పాటే. ఆంధ్రదేశం మొత్తం మీద పాటల బాటల మీదనే రాడికల్స్ గ్రామాలకు తరలారు. ఆ పాటే జనాన్ని సంఘటితం చేసింది. నిలబెట్టింది. పోరాడే చైతన్యం ఇచ్చింది. నిర్బంధం నుంచి తేరుకునే స్థైర్యాన్నిచ్చింది. అణచివేతకు జవాబు చెప్పే ధైర్యాన్నిచ్చింది. గెలుస్తామనే విశ్వాసాన్నిచ్చింది. ఈ శక్తి ఒక పాట, ఒక పుస్తకం సాధించడం తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాట కాలాన్ని మినహాయిస్తే మరెప్పుడూ జరగలేదు"** అని ప్రకటించారు. (జననాట్య మండలి పాటలు; 1984, పు.6)

1980 ఏప్రిల్ 20 ఇంద్రవెల్లిలో పోలీసులు ఆదివాసీలపై కాల్పులు జరిపారు. వందమందికి పైగా చనిపోయారు. వందలాది మంది గాయపడ్డారు. ఈ కాల్పుల నేపథ్యంలో జననాట్య మండలి 'రగల్ జెండా బ్యాలే' రూపొందించింది. దీంతో ఈ మారణకాండ గురించి దేశమంతా తెలిసింది. అదే ఏడాది విప్లవోద్యమం దండకారణ్యానికి విస్తరించింది. దీంతో జననాట్యమండలి కళాకారులు ఆదివాసీల వద్దకు వెళ్లారు. వాళ్ల కళారూపాలను, బాణీలను అధ్యయనం చేశారు. ఆదివాసీల జీవితాన్ని పాటలల్లారు. 1981లో రాడికల్ విద్యార్థి సంఘం మద్రాసులో జాతుల సమస్యపై జాతీయ సదస్సు నిర్వహించింది. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల నుంచి అనేకమంది మేధావులు హాజరయ్యారు. ఆ రెండు రోజుల సదస్సులో జననాట్య మండలి అనేక ప్రదర్శనలిచ్చింది. ఎన్టీఆర్ పాలనలో 1985లో విప్లవోద్యమంపై తీవ్ర నిర్బంధం అమలైంది. 'ఆట-పాట-మాట బంద్' అని

ప్రకటించాడు. అది 1989 దాకా కొనసాగింది. జననాట్య మండలి ప్రధాన నాయకుడు గద్దర్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. జననాట్య మండలి కూడా అజ్ఞాతమైంది. కానీ, పాట ఆగలేదు. ఆట ఆగలేదు. మాట ఆగలేదు. అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌లోకి వెళ్లింది. దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లింది. జేఎన్ఎం కళాకారులు గుజరాత్, తమిళనాడు, బెంగాల్, మహారాష్ట్రకు వెళ్లారు. ఆయా భాషల్లో పాటలు రాశారు. ఆయా భాషల కవులను, గాయకులను రూపొందించారు. భిన్న భాషల్లో పాటను సార్వజనీనం చేశారు.

జననాట్య మండలి ప్రేరణతో కర్ణాటక, కేరళ, తమిళ, మహారాష్ట్ర, గోవా, హర్యానా, బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో సాంస్కృతిక సంస్థలు ఏర్పడ్డాయి. ఎనిమిది రాష్ట్రాల్లో 1983లో 'అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి' ఏర్పడింది. 1983-93 దాకా జననాట్య మండలిని తమ ఆదర్శంగా అన్ని రాష్ట్రాల సంస్థలు ప్రకటించాయి. నెల్లూరులో (1981) రైతుకూలీ సంఘం సభ జరిగింది. తన కళా ప్రదర్శనలతో జననాట్య మండలి వందలాది గ్రామాల్లో లక్షలాది మందిని ఆకర్షించింది. ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి నక్సలైట్లపై నిషేధం ఎత్తివేశాడు. 1992లో ఫిబ్రవరి 18 గద్దర్ అజ్ఞాతవాసం నుంచి బయటికి వచ్చాడు. జననాట్య మండలి ఆధ్వర్యంలో నిజాం కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభ జరిగింది. పదిలక్షల మందికి పైగా పాల్గొన్నారు. రాత్రంతా తన పాట-మాట-ఆటలతో గద్దర్ ప్రజల్లో ఉత్తేజం నింపాడు. అదే ఏడాది మేలో రైతుకూలీ సంఘం సభ జరిగింది. అదొక చరిత్ర. ఉజ్వల చరిత్ర. ప్రజలు నిర్మించిన పోరాటాల చరిత్ర.

జననాట్య మండలి భూస్వామ్య సంస్కృతిని, మూఢనమ్మకాల్ని ధ్వంసం చేసింది. రెండుమూడు వేల పాటలు రాసింది. దేశంలోని అనేక భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆయా భాషల్లో స్వతంత్ర పాటలు వచ్చాయి. జననాట్య మండలిది జనం పాట. మట్టిమనుషుల పాట. అది జనం బాట. చెమట చిత్తడి బతుకుల బాట. 1995లో ప్రజా గెరిల్లా సైన్యంతో నడిచింది. సాయుధ దళాలతో కలిసి నడిచింది. 1996-97 నుంచి 2003 దాకా జననాట్య మండలి కార్యకర్తలు సాయుధ దళాలతో కలిసి నడిచారు. జననాట్య మండలి డప్పు డాన్స్, నృత్య నాటిక, దీపాల నృత్యం, నాటిక, స్కిట్స్, నాటకం, బుర్రకథ, ఒగ్గుకథ, గొల్ల సుద్దులు, భజన, ధూలా, బతుకమ్మ, బ్యాలే, కర్రసాము, కోలాటం, లంబాడీ నృత్యం, ఏకపాత్రాభినయం, వీధి నాటిక అనే ప్రజా కళారూపాలను విప్లవీకరించింది. విప్లవ సాహిత్యోద్యమంలో సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం, చినబాబు, అనేకమంది అజ్ఞాత కవులు ప్రజల పాటను సమున్నతంగా నిలబెట్టారు. చెరబండరాజు 1971నాటికే పాట ప్రాధాన్యతను నిరూపించాడు. శివసాగర్ విప్లవ కవిత్వాన్ని అత్యున్నత కాల్పనిక స్థాయికి తీసుకెళ్లాడు. ఆదివాసీ గూడేలు, గిరిజన తండాలు,



వెలివాడల్లో తిరిగాడు. ప్రజల బాణీలో పాటలల్లాడు. గద్దర్, వంగపండు ప్రసాదరావు, జనసేన, రుద్రజ్వాల, హిమజ్వాల, అల్లం వీరయ్య ఆ ఒరవడిని అందుకున్నారు. గద్దర్ ప్రపంచ విప్లవోద్యమాలకు దిక్సూచిలా నిలిచే మార్చింగ్ సాంగ్ రాశాడు. ప్రజల పాటను శిఖరాగ్రస్థాయికి తీసుకెళ్లాడు.

**"సాగిపోదమా**
**మనం కలిసి పోదమా**
**బీదసాద బతుకు కొరకు**
**పోరుజేద్దమా**
**మనం ప్రాణమిద్దమా.." (జననాట్య మండలి పాటలు; 1979, పు.45)** అంటూ శ్రామిక జన విముక్తి కోసం గొంతెత్తాడు. ఇది ప్రజల బాణీ. శ్రమజీవుల జీవభాష. రైతన్నల దుక్కుల్లో మొక్కలవ్వాలన్న ఆశ. శ్రమజీవుల చెమట చుక్కలవ్వాలన్న ఆకాంక్ష. నాట్లల్లో, కోతల్లో కూలితల్లుల పాటలకు కోరసవుదామని పిలుపునిచ్చాడు గద్దర్. **'అడివన్నల కన్నుల్లో కనుపాపలవుదమా'** అంటూ మరోప్రపంచాన్ని వాగ్దానం చేసే దారిలో సాగుదామన్నాడు. ఈ పాటలో ఎక్కడా పండిత పదాల్లేవు. అర్థంకాని పదబంధాల్లేవు. ఉన్నదల్లా ప్రవహించే ప్రజల గుండెతడి. ఈ తడి ఉన్నంత కాలం విముక్తి ఆకాంక్షలకు కాలం చెల్లదని నిరూపించాడు. రెక్కలు ముక్కలు చేసుకొనే గ్యాంగోల్లను కలిశాడు. వాళ్ల కష్టాల్ని పాటలల్లాడు.

**"గ్యాంగోల్లమండి మేము బాబు**
**అయ్యో గరీబోల్లమండి మేము బాబు**
**మా రక్తమంత ధారపోసి రైలుపట్టలేస్తాము..." (జననాట్య మండలి పాటలు; 1979, పు.65)**

అంటూ గ్యాంగోల్ల బతుకుల్ని చిత్రించాడు. ఈ పాటలో రైల్వే కార్మికులు తమ బతుకుల్ని చూసుకున్నారు. తమ రెక్కల కష్టాన్ని దోచే అధికారుల దోపిడీని అర్థం చేసుకున్నారు. ఆ దోపిడీని అంతం చేయాలంటే పోరాటమే మార్గమని నమ్మారు. అట్లా కార్మికులంతా విప్లవంతో నడిచారు. దోపిడీ, పీడన, అణచివేతలపై తిరగబడకపోతే బతుకులేదని గళమెత్తి గర్జించాడు గద్దర్. సమస్త దోపిడీపై ఎదురు తిరగమన్నాడు. రాజ్యాధికారం కోసం రణం తప్పదన్నాడు.

**"బాంచెన్ బాంచేనంటూ – గులాపోన్ని దొర అంటూ**
**ఎన్నాళ్లు బతుకుతావు – మాలన్నా!**
**నువు ఎదురు తిరగవేమిరో – మాదిగన్నా!**
**రాజ్యాధికారానికి మాలన్నా**
**నువు రైఫిలందుకోవరో మాదిగన్నా..." (తరగని గని; 1992, పు.109)** అని సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాడు. ఈ దేశంలో దళితజాతుల విముక్తి భూమితో ముడిపడివుందనే సత్యాన్ని చెప్పాడు. భూస్వాముల చెరలో ఉన్న భూమి కోసం సాయుధ పోరాటం తప్పదన్నాడు. భూస్వామ్య దోపిడీలో నలుగుతున్న శ్రామిక మహిళల వెతల్ని గద్దర్ ఆర్ద్రంగా పాటల్లాడు. శ్రమైకజీవన సౌందర్యాన్ని గుండెను తాకేలా గానంచేశాడు. ప్రతీ మహిళా ఈ పాటతో కనెక్ట్ అయింది. ఈ పాటతో తమ జీవితాన్ని చూసుకున్నారు. తమ కన్నీళ్లకు కారణాలు తెలుసుకున్నారు.

**"సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా**
**నువు చినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మా"** అంటూ కోట్లాది చెమట చిత్తడి మహిళల జీవితాలను కరుణ రసాత్మకంగా మలిచాడు. పల్లెల నిండా రెక్కాడితే గాని డొక్కాడని కూలి తల్లులు. పొద్దంతా పనిచేస్తేనే రాత్రికింత బువ్వ. పనిలేని నాడు పస్తులే. నిరుపేద కూలి తల్లుల బతుకు చిత్రాన్ని దృశ్యకావ్యంగా మలిచాడు గద్దర్.

**"చలికాలమొచ్చింది / సాపసింపులు లేవు**
**బొంతగుడదామన్న / పాత పేల్కలు లేవు**
**అయ్యో! చలికి వొణుకుడుబెట్టి**
**లచ్చుమమ్మో లచ్చుమమ్మా**
**నీ సంటోడు సచ్చిండా**
**లచ్చుమమ్మో లచ్చుమమ్మా". (జననాట్య మండలి పాటలు; 1979, పు.73)**

ఈ పాట విని కన్నీళ్లు రాని మనిషి ఉండరు. తన శిశువు చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళతో మనమూ ఏడ్పుల వాగవుతం. పల్లెల్లో పేదరికం ఎంత దుర్భరంగా ఉంటుందో తెలుస్తుంది. కూలోల్లకు కూడు దొరికే మార్గాన్ని చెప్పాడు గద్దర్. విముక్తి పోరును చూపించాడు. **'కొడవండ్లు నూరుకొని కూలి దండుల కలువు'** అంటూ కోట్లాది లచ్చుమమ్మలకు పిలుపునిచ్చాడు.

గద్దర్ మండే ఎండల్లో బండలపై రాళ్లుగొట్టే వడ్డెరల దగ్గరకు వెళ్లాడు. వాళ్లు–మండే బండపై అరికాళ్లు కాలిన మట్టిమనుషులు. చేతులన్నీ కాయలు కాసినవాళ్లు. తరతరాలుగా నెత్తురంతా ధారపోసి, చరిత్ర నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు. చెరువులు, కుంటలు, బావులు తవ్వారు. భూమిని బువ్వపెట్టే కంచంగా మార్చారు. నింగినంటే మేడలు కట్టినా, నిలువ నీడలేని మనుషులు. మండే ఎండల్లో బండ కొడుతూ రక్తం చిందనిదే బుక్కెడు బువ్వ దొరకని మట్టిమనుషులు. పాలు తాగే పసిపాప నుంచీ పండు ముసలి దాకా బండపైనే. వాళ్ల బతుకంతా. పొద్దు పొడవకముందే బండపై చేరుతారు. సుత్తె, గన్నులతో బండల గుండెల్ని మోగిస్తారు. చిట్లిన రాళ్ల ముక్కలు ఎగిరిపడి కళ్లు పోయిన వాళ్లెందరో. బర్మాలు పేలి కాళ్లూ చేతులూ విరిగినవాళ్లు. ఊపిరొదిలినవాళ్లు. అట్లాంటి మట్టిమనుషులకు కాంట్రాక్టర్ల దోపిడీని అర్థం చేయించాడు. దగాపడ్డ వడ్డెరల జీవితాలపై గద్దర్ రాసిన పాట 'వొడ్డెరోల్లం'. ఈ పాటలో తమ నెత్తురూ చెమటా ధారపోసినా బువ్వే దొరకని శ్రమజీవుల బతుకు వెతలు చెప్పాడు.

**"వొడ్డెరోల్లమండి మేమూ**
**ఇన్నాళ్లూ గుడ్డిగా బతికిన**
**ఎడ్డోల్లం**
**మా కండబలం చూపితేనె**
**కొండలు పిండైపోవు**
**బండమీద కూసుంటే**
**ఎండైనా బెదిరిపోవు..." (తరగని గని; 1992, పుట.82)**

అంటూ నిత్యం దోపిడీకి గురవుతున్న వడ్డెరల జీవితాన్ని చిత్రించాడు. వాళ్ల నెత్తురింకని నేల లేదు. వాళ్ల చెమటతో తడవని భూమిలేదు. కాంట్రాక్టర్ల దోపిడీలో నలిగి పోతున్నారు. విప్లవోద్యమం ప్రభావం వల్ల ఈ దోపిడీని అర్థం చేసుకున్నారు. తిరగబడకపోతే బతుకులేదని తెలుసుకున్నారు. దోపిడీని ఎదిరించేందుకు సిద్ధమయ్యారు. మండే ఎండల్లో కొండల్ని పేల్చే బర్మార్‌తో దోపిడీ రాజ్యాన్ని కూల్చుతామన్నారు. ఈ పాటలో కూడు, గూడు, గుడ్డ కోసం, దోపిడీని అంతంచేసేందుకు తిరగబడాలని పిలుపునిచ్చాడు.

**"నేటి నుండి మా బర్మార్**
**కొండల్లో బెట్టబోము**
**మమ్ము దోచిన మాయమ్మా ఇందిరమ్మా**
**నీ బలగం గుండెల్లో బర్మాలై పేలుతాం..." (తరగని గని; 1992, పు.82)**

అంటూ శ్రామికవర్గాన్ని విప్లవీకరించాడు. ప్రజల బాణీ, మాండలికాలను అద్భుతమైన పాటలుగా మలిచాడు. విప్లవకర ప్రజానీకానికి విప్లవ సందేశాన్ని చేరవేశాడు. ప్రజల పాటల పుట్టు పూర్వోత్తరాల్ని చెప్తూ గద్దర్... **"జననాట్య మండలి పాట వొట్టి ప్రజల పాటే కాదు. అది విప్లవ ప్రజల పాట. అంటే ఒక స్పష్టమైన విప్లవ అవగాహన ఉన్న పాట. స్పష్టమైన విప్లవ భావాలను ప్రజల మధ్య ప్రచారం చేసే పాట. విప్లవాన్ని నడుపుతున్న అన్నల గైడ్‌లో నడుస్తున్న పాట. జననాట్యమండలి పాటల్లో పై విషయాలన్నీ అంతర్లీనమై ఉన్నాయి. కాబట్టి పై వాదనలు లేపే మిత్రులు జననాట్య మండలి పాటను పైపైనే చూసి, దాని లోతుల్లోకి వెళ్లే జ్ఞానంలేక, అనవసరమైన వాదనలు రేపుతూ తమ తప్పును దాటవేస్తున్నారు"** అని రాశాడు. (అదే; పు.94)

తాకట్టులో భారతదేశ నగ్నస్వరూపాన్ని గద్దర్ ఒకే ఒక పాటతో అర్థం చేయించాడు. అది **"భారతదేశం భాగ్యసీమరా"** పాట. అధికార మార్పిడి వెనక ఉన్న అసలైన దోపిడీని కళ్లముందుంచాడు. **"దేశం మీదే సంపద మీదే/ మీరె ఏలుకోండో నాయనా"** అంటూ శ్రామికరాజ్య స్థాపనకోసం సాయుధమవ్వాలని పిలుపునిచ్చాడు.

1985 జులై 17న కారంచేదులో కమ్మ భూస్వాములు మాదిగల్ని నరికి చంపారు. దుడ్డు వందనం, దుడ్డు రమేషు, తేళ్ల మోసెస్, తేళ్ల ముత్తయ్య, ఏవాసన్న, మరికొందర్ని వేటాడి చంపారు. మాదిగపల్లెకు నిప్పు పెట్టారు. గుడిసెల్ని కాలబెట్టారు. మాదిగలకు నిలువ నీడ లేకుండా చేశారు. ఈ దాడుల్లో ప్రాణాలొదిలిన దళితుల్ని స్మరిస్తూ గద్దర్ **'దళిత పులులు'** పాట రాశాడు. ఈ పాట లక్షలాదిమంది ప్రజల్ని కదిలించింది. ఆలోచింపజేసింది. ఈ దేశంలో కులోన్మాదం ఎంత వేళ్లూనుకుందో చెప్పింది. 'పిడికెడు ఆత్మగౌరవం' కోసం ప్రాణాలివ్వాల్సిన ఈ దేశ దౌర్భాగ్యాన్ని చెప్పింది.

**"దళిత పులులమ్మా**
**కారంచేదు భూస్వాముల మీద**
**కలబడి నిలబడి పోరుచేసినా"... (తరగని గని; 1992, పు.206)**

ఈ పాటలో ప్రతీ పదం జన ప్రభంజనమైంది. మంటల్లో నిలువెల్లా కాలిపోతున్న మాదిగల గుడిసెల్ని కనుపాపల్లో ముద్రించింది. సాటి మనుషుల్ని మృగాల్లా వేటాడిన కమ్మదొరతనం క్రౌర్యం కనిపించింది. కాలిన బూడిద రాసుల్లోంచే ఫీనిక్స్ పక్షిలా ఊపిరి పోసుకునే విముక్తి గీతాన్ని ఆలపించాడు.

**"దళిత జీవుల విముక్తి పోరు**
**సాయుధ పోరుతో ముడిపడి వుంది..." (అదే)**

అని విముక్తి మార్గాన్ని చెప్పాడు. ఆనాటి రక్తసిక్త దృశ్యాల్ని కన్నీటి దృశ్యకావ్యంగా మలిచాడు గద్దర్. ఈ దేశంలో కులం ఉన్నంత కాలం, దోపిడీ కులాల దౌర్జన్యాలు కొనసాగినంత కాలం ఈ పాట దళితుల్ని ఏకంచేస్తూనే ఉంటుంది. సున్నితమైన భావాలను గుండెను తాకేలా చెప్పడం గద్దర్ శైలి. పల్లె జనం పదాలతో అద్భుతమైన పాటలల్లడం అతని శిల్పం. గర్జించే కాలి గజ్జెలు, భుజాన గొంగడి, గాలిలో ఎగిరేసిన ఎర్రజెండా. గద్దర్ గళంలోంచి గాలిలో అలలు అలలుగా పోటెత్తే పాట. గుండె గుండెనూ తాకే రక్తచలన సంగీత శ్రుతి. ఈ పాట వేలాది బహిరంగ సభల్లో లక్షలాది మంది ప్రజల్ని కదిలించింది. ప్రపంచ చరిత్ర చిత్రపటంపై చేసిన నిలువెత్తు సంతకం గద్దర్.

'సృజన ప్రచురణలు'గా 1973లో 'వి.బి.గద్దర్ పాటలు' పుస్తకం వచ్చింది. గద్దర్ పాటల కోసం ప్రజల దగ్గరికి వెళ్లాడు. వాళ్ల బతుకుల్లో నెలకొన్న చీకట్లను చూశాడు. వాళ్లు రెక్కలు తప్ప ఏ ఆస్తీ లేనివాళ్లు. చుట్టూ కష్టాలు, కన్నీళ్లు. గద్దర్‌ను నిలువనీయలేదు. వాళ్ల గోసల్ని పాటలుగా అల్లాడు. గద్దర్ కలిసిన మనుషుల్లో... దుక్కులు దున్నే రైతులు. మొక్కలు నాటే కూలీలు. మాదిగలు. మాలలు. మండే ఎండల్లో




తనువంతా కాలి, మాగిన కుండైన వడ్డెరలు. గొల్లలు. కుర్మలు. డ్రైవర్లు. హమాలీలు. సమస్త వృత్తుల జనాన్ని కలిశాడు. గద్దర్ పాటల్లో వాళు తమ బతుకును విన్నారు. ఆ పాటల్ని సొంతంచేసుకున్నారు. అట్లా విప్లవోద్యమాన్ని ప్రేమించారు. తమ బతుకుల్లో అలముకున్న చీకట్లు పోవాలంటే విప్లవం ఒక్కటే మార్గమని నమ్మారు. ఆ నమ్మకం కల్గించింది గద్దర్ పాట. ఏ దిక్కూలేని జనానికి దిక్కుచూపే సుక్కలైన అమరుల్ని తన పాటల్లో అజరామరం చేశాడు.

**"వొలి వోలిలరంగ వోలి సెమ్మ కేలిల వోలి**
**వొలి వోలిలరంగ వోలి సెమ్మ కేలిల వోలి**
**యాడబుట్టి యాడబెరిగి**
**యాడికొచ్చి యాడసచ్చె**
**ఎవరికొరకు వచ్చినారు**
**ఎవరికొరకు సచ్చినారు**
**సక్కనైన కొడుకులమ్మ వోలి సెమ్మకేలిల వోలి**
**సుక్కలల్లో గల్సిరమ్మ వోలి సెమ్మ కేలిల వోలి..." (తరగని గని; 1992, పు.209)**

ఇదో వీరగాథ. ఇది ప్రజల బాణీ. దీన్ని విప్లవ దృక్పథంతో అమరుల చరిత్రగా మలిచాడు. ప్రజల కోసం ప్రాణమిచ్చిన వీరుల పాట ఇది. ఈ పాటను జనం గుండెలకు హత్తుకున్నారు.

దేశంలో తొంభైశాతం శ్రమజీవుల మీద పదిశాతం పాలకవర్గం అధికారం శాసిస్తోంది. రైతులూ, కూలీలూ నానాటికీ దోపిడీకి గురవుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా బుక్కెడు బువ్వ దొరకని పరిస్థితి. ఇంటిల్లిపాదీ పస్తులే. ఆకలితో ఆలమటించే రోజులు. ఉన్నోనికి ఒక న్యాయం. ఏమీ లేనోనికి ఇంకో న్యాయం. అందరి కోసం రాసిన రాజ్యాంగం కొందరి పాలైంది. కూలినాలి జనాలపైనే జులుం పెరిగిపోయింది. అందుకే నిజం తెలుసుకోవాలంటూ గద్దర్ రాసిన పాట 'కూలన్న ! రైతన్న !'. ఇది ఖవాలీ బాణీలో సాగింది.

**"నిజం తెలుసుకోవరో-కూలన్న రైతన్న**
**నీతితో నడువాలిరో-కూలన్న రైతన్న**
**నిజం తెలుసుకోవాలి-నీతితో నడువాలి**
**నిజం తెలుసుకోవాలి-నీతితో నడువాలి**
**ఎర్రజెండకిందరో -కూలన్న రైతన్న**

**కన్నెర్రజేయరో-కూలన్న రైతన్న**
**అందుకె నడుంగట్టి-నడువాలి కూలన్న**
**ఆయుధాల్ చేతబట్టి-కదలాలి రైతన్న...." (సృజన; సెప్టెంబర్ 1973, పు.30)**

అంటూ రైతాంగాన్ని విప్లవోద్యమంలోకి ఆహ్వానించాడు.

జననాట్య మండలి ప్రచురణగా 1981లో 'గద్దర్ పాటలు' పుస్తకం వచ్చింది. 1971-1981 మధ్యకాలంలో రాసిన 26 పాటలతో వచ్చిన పుస్తకమిది. గద్దర్ పాటల పరిచయాన్ని రాస్తూ వర్గీస్... **"ఒక తెలంగాణా మూరుమూల పల్లెటూర్లో జన్మించిన గద్దర్ ఆనాటి స్థాయికి చేరుకోవడానికి ఎన్నో ముళ్లబాటలు పయనించి వచ్చాడు. ఎన్నెన్నో చేదు అనుభవాలను చవిచూశాడు. వివిధ వర్గాల వారితో సంచరించాడు. జీవితం అనే పాఠశాలలో నిరంతరం పాఠాలను అధ్యయనం చేస్తూనే ఉన్నాడు. తన కుటుంబాన్నే కాకుండా విశ్వకుటుంబాన్ని ప్రేమించాడు. తన కవితా స్రవంతిలో మునిగి తేలి తన గొంతుతో ఆలాపించి ఎల్లలు లేని లోకాలను తాకాడు. రాగంతో కోటలు బద్ధలుచేసే శక్తి అతని కంఠానిది. ప్రజల సేవలో, ప్రజా పోరాటాల కోసం రాసే, గానంచేసే ఈ కళాకారుణ్ని ఆలింగనం చేసుకునేందుకు గ్రామసీమలు పరుగెత్తుకొస్తున్నాయి. మా గురించి రాసి, గానంచేసే ఓ కళాకారుడా. రా. నిన్ను మళ్లీ మాలో ఐక్యంచేసుకుంటాం అంటున్నాయి"** అని రాసిన మాటలు అక్షర సత్యం. (గద్దర్ పాటలు; 1978, పు.3)

విప్లవోద్యమంలో అమరులైన వేలాది వీరుల్ని స్మరిస్తూ గద్దర్ 'లాల్ సలామ్' పాట రాశాడు. విద్యార్థి వీరుల్ని స్మరించాడు. వాళ్ల త్యాగాలను గానం చేశాడు.

**"లాల్‌సలామ్ లాల్‌సలామ్**
**లాల్‌సలామ్ సలామ్**
**లాల్‌సలామ్ సలామ్ ఎఎ లాల్ ఎఎ**
**భూమి కొరకు భుక్తి కొరకు**
**మనదేశ విముక్తి కొరకు**
**సాగే ప్రతి పోరులోన**
**సాహసులై పోరాడిన**
**విద్యార్థి వెలుగులార**
**కోట్లాది శ్రమజీవుల**
**లాల్‌సలామ్ లాల్‌సలామ్..." (గద్దర్ పాటలు; 1981, పు.1)**

అంటూ గానంచేశాడు. కామ్రేడ్ రాజారాం ప్రజాయుద్ధ పంథాలో వెలుగై నిలిచాడు. ప్రజల్ని హింసించే శక్తులపై తిరుగుబాటు చేశాడు. జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో అన్యాయాలపై గళమెత్తాడు. గూండాల దాడుల్ని ఎదుర్కొన్నాడు. మతోన్మాదుల చేతుల్లో హత్యకు గురయ్యాడు. బొమ్మారెడ్డి స్నేహలత తెలంగాణలో పల్లెపల్లెనా విప్లవ బీజాలు వెదజల్లింది. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలొదిలింది. ఉద్యమమే జీవితంగా బతికిన జనార్దన్ పోలీసు కాల్పుల్లో చనిపోయాడు. గిరాయిపల్లి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులైన మురళీమోహన్‌రెడ్డి, ఆనందరావు, సుధాకర్. నాగరాజు రేణికుంట కొండల్లో విప్లవాగ్ని రగిలించాడు. జంపాల చంద్రశేఖరప్రసాద్‌ను పోలీసులు కాల్చి చంపారు. శ్రీపాద శ్రీహరి, నర్సింహారెడ్డిలాంటి విద్యార్థి వీరులను స్మరిస్తూ రాసిన ఈ పాట ప్రతిఒక్కరిలో ఉత్తేజం నింపింది.

బిడ్డల్ని కోల్పోయిన తల్లుల కడుపు కోతను గద్దర్ అద్భుతమైన పాటల్లాడు. ఈ పాటంతా బిడ్డల జ్ఞాపకాలే. వాళ్ల అడుగుజాడలే. ఏ వేకువజామునో కలియ కరిగే దుఃఖిత దృశ్యమే. విప్లవోద్యమంలో అమరులైన బిడ్డల్ని స్మరిస్తూ దుఃఖమై పొంగే పాట. ప్రతీ గుండెనూ తాకే పాట.

**"వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు**
**వీరులార వీరులార రాడికల్ల శూరులార**
**రాడికల్ల శూరులార రైతుకూలీల బిడ్డలార**
**ఒక్కరొక్కరు ఒరిగిపోయి సుక్కలల్లో కలిసినారూ**
**సుక్కలల్లో కలిసి మీరు సూర్యులయ్యి మొలిసినారు**
**ఏ దిక్కూ లేనోళ్లకూ మా బిడ్డలు**
**మీరు దిక్కు సూపే సుక్కలయ్యింగ్రా మా బిడ్డలు". (జననాట్య మండలి పాటలు; 1979, పు.169)**

ఇది తల్లుల దుఃఖం. కడుపు కోత. తండ్రుల గుండెకోత. ఈ పాట అందర్నీ ఏడ్పిస్తుంది. శ్రామిక జీవితంతో పెనవేసుకున్న ఉత్పత్తి సంబంధ ప్రతీకల్ని పాటగా అల్లాడు గద్దర్. కాకి, ఊర పిచ్చుక, తల్లిలేని మేకపిల్ల, కోడిపుంజు, తల్లికోడి, ఆవు, లేగదూడ, జొన్నసేను, జొన్నకంకి, పాలపిట్ట, జమ్మి ఆకు... ఇట్లా ప్రకృతిని విప్లవ ప్రతీకలుగా మలిచి అద్భుతమైన పాటల్లాడు.

**"కావు కావున కాకులరిసితె తలుపు తెరిసి పలకరిస్తం**
**ఎవ్వరొస్తరో చెప్పుమాని తొవ్వచూస్తూ నిలుచుంటం**
**మీరు కాకమ్మలయ్యి వొస్తారా మా బిడ్డలూ**
**మా కడుపు తీపి తీర్చిపోతారా..." (అదే)**

ఎక్కడో ఊరిచివరి వెలివాడల గుడిసెల్లో శోకసంద్రమయ్యే తల్లి ఏడ్పు ఇది. ఏ నడిరేయిలోనో కలత నిదురలో, బిడ్డలు గుర్తొచ్చి తల్లడిల్లే తల్లుల శోకమిది. ఇది ఏ ఒక్కరి దు:ఖమో కాదు. వేలాది తల్లుల దు:ఖం. సామూహిక దు:ఖం. ఈ దు:ఖంలోంచే వాళ్లు స్ఫూర్తి పొందుతున్నారు. తమ బిడ్డల ధైర్యాన్ని చెప్తూ గద్దర్...

**"వొద్దురా వొద్దురా కొడుక దొరలతోని యుద్ధమొద్దని**
**నెత్తినోరు మొత్తుకున్న ఎంత చెప్పిన వినకపోతివి**
**మొండివాడవు దండివాడవు సెమలు నిండిన గుండె వాడవు**

**పట్టిన ఆ ఎర్రజెండను ప్రాణముండగ వదల లేదు**
**మీ నెత్తురూ జెండిచ్చి పోతారా మా బిడ్డలూ**
**మేము ఎత్తుకుంటే మురిసిపోతారా మా బిడ్డలూ..." (జననాట్య మండలి పాటలు; 1979, పు.171)**

అని కరుణ రసాత్మకంగా మలిచాడు. అందుకే శ్రీశ్రీ గద్దర్ పాటను అభిమానించాడు. ప్రేమించాడు. **"నేను ప్రజా కవిని కాను. నా కవిత్వం 70శాతం ప్రజల దగ్గరకు వెళ్లడం లేదు. విప్లవ కవిత్వం వారి దగ్గరకు వెళ్లిందా అంటే అనుమానమే. వారి దగ్గరకు వెళ్లాలంటే జానపద కళారూపాలలో గద్దర్, వంగపండు ప్రసాదరావు లాగా రాయాలి. శ్రామికవర్గ సంస్కృతే సజీవ సంస్కృతి"** అన్నాడు. (శ్రీశ్రీ వ్యాసాలు; 1983, పు.206)

కష్టజీవుల రెక్కల కష్టాన్ని దోచుకుంటున్న దొరలపై గద్దర్ రాసిన పాట 'దొరోడో'. దొరలు, జమీందార్లు రైతు కూలీలకు అప్పులిచ్చి, వడ్డీ మీద వడ్డీ గుంజుతూ రక్తం పీలుస్తున్నారు. కష్టం విలువ తెలియని దొరలు పేదలపై జులుం చేస్తున్నారు.

**"రెక్క బొక్క నొయ్యకుండ**
**సుక్క చెమ్ట వొడవకుండ**
**బొర్ర బాగ పెంచావ్‌రో దొరోడో**
**నీ పెయ్యంత మంత్రిస్తం దొరోడో..." (అదే; పు.40)**

అంటూ దోపిడీ స్వరూపాన్ని తెలుసుకున్న రైతాంగం దొరలపై చేసిన పోరాటాన్ని చెప్పాడు. ఇందులో అట్టడుగు ప్రజలు తమ జీవితాన్ని చూసుకున్నారు. కళ్లముందు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తారు. ఈ పాట తెలంగాణ రైతాంగాన్ని పోరాటాల్లోకి కదిలించింది. ఇట్లా గద్దర్ ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాకవిగా నిలబడ్డాడు. జనం గుండెల్లో చిరస్థాయిగా పాటలై పల్లవిస్తున్నాడు. గద్దర్ పాటల గురించి రాస్తూ కేవీఆర్... **"వ్యక్తికి బహువచనం శక్తి' అని సూత్రీకరించిన శ్రీశ్రీ కంటె ఎక్కువ న్యాయం చేకూరుస్తున్న ప్రజా కవులలో ప్రథముడు గద్దర్. శివసాగర్‌లా గూడా విద్యా సంస్కారాలు ఎక్కడా చూపని సహజ కవులలోనూ గద్దర్ ప్రథముడే. 'డీక్లాస్' అయిన కవులలోనూ ప్రథముడే"** అని రాశాడు. (గద్దర్ పాటలు; 1978, పు.33)

1991 ఫిబ్రవరిలో 'ప్రతి పాటకు ఒక కథ ఉందా? ఆ ఉంది' అనే పుస్తకం (123 పేజీలు) ప్రచురించాడు. రెండు వేల ప్రతులు. జనం పాటలు రూపొందడం వెనక నేపథ్యమిది. "ఒక్కరొక్కరె ఒరిగిపోయి, సుక్కలల్లో గల్సినారా" పాట నుంచి లాల్ సలామ్-లాల్ సలామ్" దాకా ముప్పై పాటల నేపథ్యం రాశాడు. ఈ పుస్తకాన్ని ప్రజలకు అంకితమిచ్చాడు. **"అందరికీ నా ఎర్రెర్ర దండాలు. జనం కన్నీటి కథలే జననాట్య మండలి పాటలు. ఆ కన్నీటి కథలను పాటలుగా అల్లిన కవులే జననాట్య మండలి కవులు. గద్దర్ పాటల కథలు కూడా జనం కన్నీటి కథలే. జనం లేకుండా జననాట్య మండలి లేదు.**



**జననాట్య మండలి లేకుండా గద్దర్ లేదు. అందుకే జనం కన్నీటి పాటల కథలు జనంకే అంకితం"** అని ఆంధ్రప్రదేశ్ జననాట్య మండలి తరపున రాసుకున్నాడు. (గద్దర్; 1991, పుట 4)

1992లో ప్రజల పాటల పుట్టుపూర్వోత్తరాలను **'తరగని గని'** పుస్తకంగా ప్రచురించాడు. ఇది జననాట్య మండలి ప్రచురణ. ఇది 290 పేజీల థీసీస్. **'జనం పాట'** ప్రచురణలుగా 1997-98 వరకు రాసిన పాటలతో **'గద్దర్ పాటలు'** పుస్తకం (1999 అక్టోబర్) వచ్చింది. ఇందులో **"అమ్మా నీకు వందనం"** నుంచి **"పొద్దు తిరుగుడు పువ్వు"** దాకా 21 పాటలున్నాయి. ఇది అమరుడు డోలక్ దయకు అంకితమైంది. **'యుగకర్తకు అభివందనం'** అంటూ పొత్తూరి వెంకటేశ్వరరావు... **"లిఖిత కవిత 'ఉయ్యేల మంచం' దిగి, పూజా మందిరాలూ, రాజప్రసాదాలు దాటిరావడానికి తొమ్మిది వందల యేండ్లు పట్టింది. ప్రబంధ కవితను బంధ విముక్తిచేసిన గురజాడను, శ్రీశ్రీని యుగకర్తలన్నాం. అంతకు మించి కవితను జనంలోకి తెచ్చి, బహు జనాదరణకు పాత్రం కావించిన గద్దర్ కూడా యుగకర్తే. గద్దర్ పాటలు విని ఉత్సాహపూరితంగా 'సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మ', 'రేలా రేలా' అంటూ అతడి సభల నుంచి వెళ్లేటప్పుడు పాడుకునే జనాలే యుగకర్తృత్వ ప్రదాతలు. నేను కాదు, మీరు కాదు, పండిత పరిషత్తులూ కావు, పత్రికలూ కావు''** అని రాశాడు. (గద్దర్ పాటలు; 1999, పు.17)

రాజ్య ప్రేరేపిత గూండాలు, నల్లదండు ముఠాలు 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై కాల్పులు జరిపాయి. ఐనా గద్దర్ అదరలేదు. బెదరలేదు. ప్రజలతోనే కలసి నడిచాడు. ప్రజల పాటే తన అంతిమ చిరునామాగా ప్రకటించారు. అనంతరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విస్తృతంగా తిరిగాడు. ప్రజా ఉద్యమాలను నిర్మించాడు. **'తెలంగాణ జనసభ'** నుంచీ **'తెలంగాణా ప్రజా ఫ్రంట్'** దాకా తెలంగాణా అంతటా అతడు తిరగని నేలలేదు. కడదాకా పీడీత ప్రజల పక్షం నడిచిన గద్దర్ గుండె ఆగస్టు 6న అలసిపోయింది. ఆగిపోయింది. పాట నిలిచిపోయింది. గద్దర్ అమరుడు. గద్దర్ పాటకు మరణం లేదు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (54) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# ప్రజా గాయకుని సినీ గేయ ప్రస్థానం

**డా. మాధవీ లత రామరాజు**, ఫోన్ : 837 481 0111

పాటలకు తన చిందుతో వైవిధ్యాన్ని జతచేసి, ప్రజా సమస్యలను వేదికల మీదకు తెచ్చి పోరాడిన యోధుడు, విప్లవ కవి, ప్రజాగాయకుడు, జానపద కళాకారుడు, ప్రతి తెలంగాణ పౌరుడికి సుపరిచితుడు అయిన గద్దర్ ఇటీవల అనారోగ్యంతో అస్తమించారు. కానీ, ప్రజల నాలుకల మీద నాట్యమాడే ఆయన పాటలు, ఆయన సిద్ధాంతాలు, పాటలనే ఆయుధంగా మలచి ఆయన చేసిన పోరాటస్ఫూర్తిని ఎన్నటికీ అస్తమించనివ్వవు. **"ఒకసూర్యుడు సమస్త జీవులకు తానొక్కడై తోచుపోలిక..."** అన్నట్లు గద్దర్ కలం నుండి వెలువడిన ఒక్కో గేయం ఒక కాంతి కిరణంలాగా నలుదిశలా తమ కాంతిని వెదజల్లుతూ గొంతులేని బడుగు జీవుల గాత్రంగా మారి ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ మేలుకొలుపుతూనే ఉంటాయి.

గద్దర్ అనగానే గుర్తొచ్చేది వైవిధ్యమైన, అసలు సిసలైన గ్రామీణుడి ఆహార్యం మాత్రమే కాదు, ప్రజా సమస్యలను బహిర్గతం చేస్తూ, నాయకులను ప్రశ్నిస్తూ సాగిన గాన పోరాటం. అక్షరం, అక్షరం కలిస్తే పదం. అది గొంతులోంచి పాట రూపంలో వస్తే జనమంతా తొక్కుతారు కదం. పాటకు ఉన్న శక్తి అది. నిద్రపోయిన వారిని తట్టి నిద్ర లేపుతుంది, అన్యాయాన్ని ప్రశ్నిస్తుంది, ఎదిరిస్తుంది, నిలదీస్తుంది, జనాన్ని జాగృతం చేస్తుంది. ఒక పాటకే అంత శక్తి ఉంటే, జనం నుంచి, జనం కోసం పుట్టిన మనిషి గుండెల్లోతుల్లోంచి వచ్చిన పాటకు ఇంకెంత శక్తి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆ పాటే శత్రువుల గుండెల్లో దూసుకుపోయే తుపాకీ తూటాగా, తూటానే తనలో దాచుకుని జీవిస్తున్న గద్దర్ గొంతులో కోట్లాది ప్రజల ఆవేదనలను ప్రతిధ్వనించింది. కలమే గద్దర్ ఆయుధం. తన అక్షర సాహిత్యంతో అప్పటి నైజాం నవాబుల గుండెల్లో వణుకు పుట్టించారు. నాటి నుంచి ఆఖరి శ్వాస వరకూ పాటలతోనే సహజీవనం చేశారు. ఆయన రాసి పాడిన ఎన్నో పాటలు విపరీతమైన ప్రజాదరణ పొందాయి. చలన చిత్రాల ద్వారా ప్రాముఖ్యతను పొందిన పాటలు కొన్ని అయితే, ప్రజా నాట్యమండలి ప్రదర్శనల ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిపోయిన పాటలు మరెన్నో ఉన్నాయి.

తొలినాటి నుండి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న గద్దర్, తన భావవ్యాప్తికోసం ఊరూరా తిరిగి ప్రచారం చేసేవారు. దీనికొరకు ఆయన ప్రజలకు సరళంగా అర్థం అయ్యే బుర్రకథను ఒక మాధ్యమంగా ఎంచుకున్నారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి.నరసింగరావు, భగత్ సింగ్ జయంతి రోజున ప్రదర్శనను ఏర్పాటు చేయగా, ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి.నరసింగరావు ప్రోత్సాహంతో మొదటి పాట "ఆపర రిక్షా" రాశాడు. తదనంతరం అయన కూర్చిన మొదటి ఆల్బం పేరు 'గద్దర్'. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది. భారత జాతి స్వతంత్రం కోసం బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించి విదేశాలనుండి పోరాడిన "గదర్ పార్టీ" కు గుర్తుగా ఈపేరును తీసుకోవడం జరిగింది.

సినీ గేయ ప్రస్థానం 'మా భూమి' అనే సినిమాలో గద్దర్ తొలిసారిగా యాదగిరి అనే పాత్రలో నటించటంతో మొదలయ్యింది. ఈ చిత్రం లోనే అయన "బండెనక బండి కట్టి ....." అంటూ తన భావజాలాన్ని గీతంగా రచించి, ఆడి, పాడారు. సామాజిక సమస్యల మీద పోరాటాన్ని ఈ పాటద్వారా చలనచిత్ర వేదికమీద తొలిసారిగా ప్రదర్శిచారు గద్దర్.

**'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లె వస్తవ్ నైజాము సర్కరోడా.. నాజీల మించినవ్రో నైజాము సర్కరోడా'** అంటూ సాగే ఈ పాట సింహగర్జనగా సాగుతుంది.

**"చుట్టూ ముట్టు సూర్య పేట... నల్ల నడుమ నల్లగొండా నువ్వు ఉండేది హైద్రాబాదు...."** అంటూ నిజాము ప్రభుత్వాన్ని నలువైపులా నుండి చుట్టూ ముట్టమని చెబుతూ...?

**"నీ గోరి కడతాం కొడకో.....నైజాము సర్కరోడా.....నీ గోరి కడతాం కొడకో.....నైజాము సర్కరోడా....."** అని ప్రజలను చైతన్య పరుస్తూ నాలుగు పదుల కాలం కిందటే తన తొలిపాటలోనే పోరాట పటిమను ప్రదర్శించారు గద్దర్.

గద్దర్ పాటలను సునిశితంగా విశ్లేషించి చూసినప్పుడు పేదవాడి వేదన, శ్రామికుని గుర్తింపులేకపోవటం, లంచగొండితనంతో నిండిన, అవినీతి ప్రభుత్వ వైఖరి మీద విముఖత, కష్టజీవి అభ్యున్నతి మొదలైన అంశాలు కలిగిన పాటలను ఒక వర్గంగా గుర్తించవచ్చు.

**"భద్రం కొడుకో.. కొడుకో కొమురన్న జరా.. పైలం కొడుకో కొమురన్న జరా.."** అంటూ గద్దర్ పాడుతుంటే రక్తం ఉరుకుతున్నట్టు ఉంటుంది. రంగుల కల సినిమాలోనిది ఈ పాట. పల్లె నుంచి పట్నానికి వలస వచ్చిన రిక్షా కార్మికులకు దిశా నిర్దేశం చేస్తూ పాడిన ఈ పాటకు అప్పట్లో ఒక సంచలనం. అదే విధంగా **'నా రక్తంతో నడుపుతాను రిక్షాను, నా రక్తమే నా రిక్షాకు పెట్రోలు'** అంటూ సాగే ఈ పాట అప్పటి పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై నిరసన జ్వాలను రగిలించింది. ఈ పాట 1995 లో వచ్చిన ఒరేయ్ రిక్షా సినిమాలోది. ఆర్.నారాయణ మూర్తి చిత్రాల్లో, ప్రత్యేకించి వందేమాతరం శ్రీనివాస్ సంగీత సారథ్యంలో గద్దర్ రచించి పాడిన

గీతాలు అత్యంత ప్రజాదరణ చూరగొన్నాయి. మధ్యతరగతి వర్గాన్ని సైతం బడుగు జీవి కష్టాన్ని గురించి ఆలోచించి, చర్చించేలా ఈ గీతాలు పాత్ర వహించాయి.

**'మల్లెతీగకు పందిరివోలె... మస్క సీకటిలో వెన్నెలవోలె నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా... తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మా...'** అంటూ సాగే ఈ పాట అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి బాంధవ్యానికి గుర్తుగా సాగుతుంది. 1995లో ఒరేయ్ రిక్షా సినిమా కోసం గద్దర్ స్వయంగా రాసిన పాట ఇది. ఈ పాటకు లిరిక్ రైటర్ కేటగిరీలో ఉత్తమ లిరిక్ రైటర్‌గా గద్దర్ కు నంది అవార్డు వరించింది. వందేమాతరం శ్రీనివాస్ ఈ పాట పాడగా, ఆర్.నారాయణమూర్తి ఈ పాటకి శరీరంగా నిలిచారు. తనపాటల అంతిమ లక్ష్యం ప్రజలేనని భావించే నిజాయితీ గల కళాకారుడైన గద్దర్ సున్నితంగా ఆ నంది అవార్డును సైతం తిరస్కరించారు.

మలి దేశ తెలంగాణ ఉద్యమంలో జనాన్ని జాగృతం చేసి ప్రత్యేక రాష్ట్ర పోరాటం వైపు నడిపించడంలో ప్రజాకవి గద్దర్ పాత్ర అత్యంత కీలకమైంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్‌ను అనేక వేదికలపై ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా యుద్ధనౌకగా కీర్తించేవారు. **'అమ్మా తెలంగాణమా... ఆకలి కేకల గానమా'** అంటూ గద్దర్ నోట పలికిన మాటలు... పాటయై... ప్రజల్ని ఆలోచింపజేస్తే... **'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా...'** అంటూ పాడిన పాట ప్రజల్లో ఉద్యమ జ్వాల రగిపింపజేసింది. విద్యార్థులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఇలా సకల జనులు పదం పాడుతూ కదం తొక్కుతూ ముందుకు సాగడం జరిగింది. ఆది నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహరహం పరితపించిన గాయకుడు, ప్రజాకవి గద్దర్. ఆయన పాత్ర రాష్ట్ర ఉద్యమంలో ప్రత్యేకమైంది. మరోసారి జై బోలో తెలంగాణ సినిమాలో తెరపైన కనిపించాడు. 'పొడుస్తున్న పొద్దు' మీద పాట ఆయనే రాసి పాడి, అభినయించారు. ఈ పాట పెత్తందారులు, దొరలు, రాజులు వేసిన బానిస సంకెళ్లను తెంచుకుందాం అని అందరిలో తెగింపుని కల్గించింది. ఈ పాటను ఈయనే పాడారు. అలాగే **"అమ్మ తెలంగాణా ఆకలి కేకల గానమా"** అనే పాటను "తెలంగాణా" రాష్ట్ర గీతంగా ఎంపిక చేయడం జరిగింది. ఇది గద్దర్ కలం నుంచి ఉవ్వెత్తున ఎగసిపడ్డ మరో ప్రళయ గీతం.

ఇక గద్దర్‌లోని భావుకతకు, ప్రకృతి మీద ఆయనకున్న మమతకు నిదర్శనంగా ఈ కింద పేర్కొన్న పాటలను చెప్పవచ్చు.

**"పొద్దు తిరుగుడు పువ్వు.. అడవిలో వెన్నెలమ్మ"** అంటూ అడవి తల్లి నేపథ్యంతో పాడిన పాటలో ఎంతో అర్థం ఉంది. **పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడే.. అడవిలో వెన్నెలమ్మ ఆకులను ముద్దాడే.. పిల్లయేరు పారు తల్లిని ముద్దాడే .. సంద్రమమ్మ పొంగి నింగిని ముద్దాడే.. పొత్తిలో నెత్తురు గుడ్డును తల్లి ముద్దాడే.. పాల సేపులను పాపలు ముద్దాడే.. ఆడి ఆడి అలసిన నెమలి కాళ్ళను కోకిల ముద్దాడే, మూగబోయిన కోకిల గొంతును నెమలి ముద్దాడే, యుద్ధములో భలే భలే యోధున్ని తుపాకి ముద్దాడే, ఆ గిచ్చున్న గిరి మల్లెలో...** అంటూ ప్రకృతిని వర్ణిస్తూ రాసిన ఈ పాట గద్దర్ కు ఎంతో ఖ్యాతిని సంపాదించిపెట్టింది. 2016 లో వచ్చిన దండకారణ్యం సినిమాలో అడవి తల్లికి వందనం అంటూ సాగే ఈ పాట ఈయనే స్వయంగా రాసి పాడారు. ఇవన్నీ గద్దర్ సినీ ప్రస్థానంలో కొన్ని కోణాలు మాత్రమే.

ఆఖరి శ్వాస వరకు తన సిద్ధాంతానికి కట్టుబడి, పాటలనే ఆయుధంగా మలచిన నిరంతర యోధుడు గద్దర్. భువి నుండి దిగివచ్చిన గాన గంధర్వుడు కాదు, నేలపై ఉదయించి ప్రజల గుండెల్లో నిలిచిన గానమానవుడు గద్దర్.

**ఆధారాలు :**

1. ప్రజా గాయకుడు గద్దర్, తెలుగు వికీపీడియా పేజీ.

2. "పిల్లల్ని హాస్టళ్లలో పెట్టి అయన ఎల్లిపోయిండు", వ్యాసం, ఆంధ్ర జ్యోతి 12 ఆగష్టు 2023.

3. "మీ పాటనై పోతున్నానమ్మో.." ప్రజా యుద్ధనౌక గద్దర్ అస్తమయం వి6 తెలుగు వార్త ఛానల్ ప్రత్యేక కథనం 7ఆగష్టు2023

4. "ప్రజాగాయకుడు గద్దర్ కన్నుమూత", వ్యాసం, ఈనాడు వార్త పత్రిక, 6 ఆగష్టు 2023.

**'కదంబం'**

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 11 (56) హైదరాబాద్ సెప్టెంబర్ : 2023

# మహిళా చైతన్యపు మేల్కొలుపు గీతాలు – గద్దర్ పాటలు

**సి. అనిత కుమారి,** పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, ఉ.వి. ఫోన్ : 98662 38682

జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల్లో అసంఖ్యాకులు శ్రామిక మహిళలే. చీకటి పడకమునుపే లేచింది మొదలు పాచి పనులు చేసుకోవడం ఎలా? ఏమి వంట చెయ్యాలి? పిల్లలను వదిలి ఎలా వెళ్లాలి? పనికి సమయానికి ఎలా చేరుకోవాలి? ఇలాంటి ప్రశ్నలతో హైరానా పడే శ్రామిక మహిళలు నేటికీ కోకొల్లలే. అలాంటి మహిళలను పట్టించుకునేది ఎవరు? వారి ఆక్రందనలు ఏమిటి? వారి అవసరాలు ఏమిటి? వారి కోరికలు ఎలా పరిష్కారం అవుతాయి?

నిజానికి పై ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మొదటగా స్త్రీ విముక్తి చెందాలి. అడుగడుగునా దోపిడీ పీడనలకు గురవుతున్న శ్రామిక మహిళలు విముక్తి కానిదే స్త్రీ విముక్తికి అర్థం లేదు. శ్రామిక పీడన మొదటగా వర్గపీడనే. లింగ అసమానత వర్గ అసమానత వెంబడే వచ్చింది. అందుకే వర్గ దృక్పథం లేకుండా కేవలం పురుష ద్వేషంతో ఉద్యమిస్తే సరిపోదు. స్త్రీ విముక్తికి అది ఆచరణ యుతమైన మార్గం కానే కాదు. ఈ ఉద్దేశంతోనే పట్టణాలలోని, పల్లెలోనే శ్రామిక మహిళలను లక్షల సంఖ్యలో సమీకరించే పనిని విప్లవోద్యమంలో చూడవచ్చు. ఈ ఉద్యమంలో మహిళా జన బాహుళ్యాన్ని సంఘటిత పరచడం స్త్రీల సామాజిక చైతన్యాన్ని సామాజిక కార్యకలాపాలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించటంలో విప్లవ కవిత్వం ముఖ్యమైనది. విప్లవ సాహిత్యంలోనే గద్దర్ మహాశక్తి. గోచి గొంగడి తప్ప మరే ఆహార్యం లేకుండా తెలుగు ప్రాంతమంతా కలియతిరిగి ప్రజల్ని జాగృతం చేసిన ప్రముఖ విప్లవకారుడు గద్దర్. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాకవి. 1970వ దశకం నుంచి తన చివరి శ్వాస వరకు ప్రజా చైతన్యగీతమై పరితపించారు. ఒక కొత్త యుగకర్తగా ప్రజల గుండెల్లో నిలిచి పోయారు. పోరు తెలంగాణమై కోట్లాది గొంతుల్ని ఒకటి చేశారు. సాంస్కృతిక సైన్యానికే నాయకుడై నిలిచారు. అట్లాంటి కవి రచనల్లో స్త్రీనే ప్రధాన వస్తువుగా ఎంచుకొని పాటలు రాసిన, పాడిన సందర్భాలు యావత్తు ప్రజానీకానికి సుపరిచితాలే. 6 ఆగస్టు 2023 నాడు అమరుడైన తర్వాత అనేకచోట్ల గద్దర్ సంస్మరణ సభ కార్యక్రమాలు జరుపబడుతున్న సందర్భమిది. నేనొక కళాకారిణిగా గత 15 సంవత్సరాల నుండి ప్రత్యక్షంగా అనేక వేదికలు గద్దర్‌తో పంచుకున్న జ్ఞాపకాలు ఉన్నాయి. వారి పాటలకు వంత పాడిన గుర్తులున్నాయి. తెలంగాణ ఉద్యమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో నిబద్ధురాలయి పనిచేస్తున్న చెల్లెగా నన్ను పొగిడిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం నేను ఒక పరిశోధకురాలిగా, ముఖ్యంగా స్త్రీగా, స్త్రీల ప్రతిపత్తిని గద్దర్ పాటల్లో పరిశీలించి కొత్తగా తెలుగు సాహిత్యం వైపు మొగ్గు చూపే మహిళా విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**"సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిచేసే సంస్థల్లోనూ స్త్రీల అణచివేతను ఖండిస్తూ, స్త్రీలు తమను తక్కువగా చూడబడటాన్ని వ్యతిరేకిస్తూ, స్త్రీ విముక్తి కోసం ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థను రూపుమాపడానికి స్త్రీలు, పురుషులు కలిసి చేసే రాజకీయ చర్యగా నిర్వచించవచ్చు".** (భుజంగ రెడ్డి బాణాల, తెలుగు సాహిత్యంలో స్త్రీ వాదం, 2020:3)

పై నిర్వచనం ప్రకారమే విప్లవ కవుల్లో ఒకరిగా ఉంటూ చెరబండ రాజు, శివసాగర్, వరవరరావులతో పాటు స్త్రీ విముక్తిని కోరుతూ ఎన్నో పాటలు రచించారు గద్దర్. కాలయాపన కోసం, అవసరాలు తీర్చుకొనుటకు, గుర్తింపులు తెచ్చుకొనుటకు ఆరాటపడే ఎంతోమంది కవులకు ఏదో ఒక రూపంలో ప్రజల పక్షాన నిలబడే నిబద్ధతను పొందటానికి ప్రేరణగా నిలిచారు. ఇంత సహజంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే గుణం అలవడటానికి గల కారణాలను వారి మాటల్లోనే **'తరగని గని'** పుస్తకంలో వివరించారు. **"జీవితాన్ని చూడడం వేరు, జీవితాన్ని అనుభవించడం వేరు. ఈ అనుభవాన్ని పాటగా అల్లడం వేరు, అల్లిన పాట తిరిగి ఆచరణలోకి తీసుకోవడం వేరు".** (గద్దర్, తరగని గని, 1992: 276) అంతేకాదు మళ్లీ ఏమంటారు అంటే నేను విప్లవ సాంస్కృతిక సంస్థలో (జ.నా.మం) సభ్యునిగా చేరిన తర్వాత నా జీవితాన్ని నేనే అల్లుకోవడం మొదలుపెట్టాను. ఉత్తుత్తిగా చిత్రీకరించడం కాదు, వాస్తవంగా చిత్రీకరించడం జీవితాన్ని చిత్రీకరించి ఊరుకోవడమే కాదు, దాని మార్పు కోరడం. ఉట్టి మార్పు కోరడమే కాదు, మార్పుకు మార్గాన్ని ఎన్నుకోవడం. ఉట్టి మార్గాన్ని ఎన్నుకోవడమే కాదు, ఆ మార్గంలో మెల్లమెల్లగా తాబేలులా పయనించడం మొదలుపెట్టాను. ఇది నాలో విప్లవ సంస్థ తెచ్చిన మార్పు అంటారు. ఈ మార్పు కారణంగానే గద్దర్ రచించిన ప్రతి పాటలో చైతన్యపు మేల్కొలుపు పాదాలు స్పష్టంగా కనిపిస్తాయి.

**'సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో'** ఈ పాట పుట్టుకకి కారణం గద్దర్ తల్లీ లచ్చుమమ్మ. ఆమె అనుభవించిన జీవితాన్ని పాటగా మలిచారు. ఎందరో నిస్సహాయులైన వ్యవసాయ కార్మికులకు ఈ లచ్చుమమ్మ ప్రతీక. వ్యవసాయ కార్మికులుగా స్త్రీలు అనుభవిస్తున్న బాధలకు ఈ పాట అద్దం పడుతుంది.

**" సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో– లచ్చుమమ్మ**
**సిన్న బోయి కూర్చున్నవెందుకమ్మో– ఎందుకమ్మా "**

**(జ.నా.మం. పాటలు, పుట నెం 77)**

తన బతుకు తెరువు అయిన కొడుకు ఇల్లు వదిలి వెళ్ళిపోవడం వల్ల ఈమె చిన్న బోయ కూర్చుంది. బతుకుదెరువు భారమైనప్పుడు తమ గోడును ఎల్ల బోసుకోవడం సహజమే. అందుకే ఆ స్థితిని 'బతుకంతా అమాస'గా వర్ణించారు. ఆనాడు స్త్రీలు సమాజంలో, కుటుంబంలో రెండు రకాలుగా హింసలకు గురవుతున్నప్పుడు వాటినుండి విముక్తి కలగటానికి, కష్టానికి ఫలితం పొందటానికి వారి దృష్టిని విప్లవోద్యమం వైపు మళ్లించేటట్లు ఈ పాటలో ముగింపును చూడవచ్చు. పక్కింటి పోచమ్మను, ఎనుకింటి ఎల్లమ్మను, ముందింటి ముత్తమ్మను, ఎదురింటి ఈరమ్మను కూలోళ్ళకందరికీ కూడు దొరకటానికి పోరాడమని చెప్పారు.

**"ఎన్నాళ్లు ఏడ్చేవు - ఎంతాని ఏడ్చేవు**
**ఏడ్చినా తూడ్చిన - ఏమి సాధించేవు**
**నీ తోటి సెల్లెండ్లు - నీ సాటి తమ్ముళ్లు**
**ఎర్ర దండుల చేరి - ఎత్తిండ్రు కొడవళ్ళు**
**కొడవళ్ళు నూరుకొని - లచ్చుమమ్మ లచ్చుమమ్మ**
**నువ్వు కూలి దండులో చేరు లచ్చుమ్మమ్మా లచ్చుమమ్మ"**

( తరగని గని పుట నెం :53 )

ఈ విధంగా కూలి దండులో చేరడమే కాకుండా ఆ దండులో నీ కొడుకులను కలువు. వారందరూ నీ వారే అంటారు. ఈ విధమైన వర్గ దృష్టిని తల్లిపాట ద్వారా కూడా సమాజానికి అన్వయించి చెప్పే విధానం గద్దర్ ను ఉన్నతంగా నిలబెట్టింది.

**"బావయో ఒక్కసారి చూసి పోవా"** అనే పాట 'చీకటి సూర్యులు' సినిమా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయిందేమోగానీ, గద్దర్ అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు తన భార్య పంపించిన చిన్న ఉత్తరం ఈ పాట పుట్టుకకు కారణం. **'వ్యక్తిగతమైన అనుభూతిని సాధారణీకరణం చేసి రాసిన పాట ఇది'.** ఉద్యమంలోకి వెళ్లిన తమ భర్తలను గురించి స్త్రీలు తలచుకుంటున్న తీరు ఈ పాటలో కనబడుతుంది.

"బావయో ఒక్కసారి చూసి పోవా
బావయో నీ తోడు గుంట తోల్కపోవా"

ఈ పల్లవిని అనుసరించే పాటలోని విషయం ముగింపులు నడుస్తాయి. నేటి సమాజంలో ఒక స్త్రీకి మగ తోడు లేకపోతే ఎటువంటి సమస్యలని ఎదుర్కొంటుందో ఆ కష్టాలు ఈ పాటలో కనబడతాయి. స్త్రీని రౌడీలు, గుండాలే కాదు బాధ్యత కలిగిన పదవిలో ఉన్న నాయకులు సైతం ఎటువంటి మానసిక క్షోభకు గురిచేస్తారో ఈ పాటలో చిత్రించారు. ఈ దుస్థితి నేటికీ కొనసాగడం చూసిన గద్దర్ తన చివరి శ్వాస వరకు కూడా స్త్రీలను విముక్తి చెందించాలనే తపనతో ప్రజా సమూహంలో గళం విప్పారు. సమాజ మార్పు కోరే ఉద్యమంలో భాగమైనందుకు ఎందరో ఉద్యమకారుల భార్యలకు కష్టాలు తప్పవు. లీడర్లు, పోలీసులు, చుట్టాలు, పక్కాలు తలోరకంగా



బాధిస్తుంటారు అలాంటి వారిని 'అన్నలు' (విప్లవకారులు) మాత్రమే ఆదుకున్నారని చెప్పారు. ఈ పాట ద్వారా వర్గ సమాజంలో వర్గ ప్రేమ మాత్రమే ఉంటుందని చెప్పడం విశేషం. రోజు బాధలతో చచ్చే స్త్రీలకు ఉద్యమాలే శరణ్యం. అందుకే తనను కూడా ఉద్యమంలోకి తీసుకుపొమ్మని ఒక స్త్రీ తన భర్తను ప్రాధేయపడినట్లు ఈ పాటలో చూడవచ్చు. కష్టాల జీవితం పట్ల విసుగు చెందిన స్త్రీ ఏమంటుందంటే...

**"రోజు బిస్మ సచ్చే కంటే - రోత బతుకు బతికే కంటే**
**అమరులైన అన్నలబాట - కూలి నాలి బతుకు బాట**
**బావయో నీ బందూకుంటే ఇచ్చి పోవా - బావయో నీ తోడు గుంట తోల్కపోవా"**

సమసమాజ నిర్మాణ స్థాపన కొరకు సాగే ఉద్యమాల్లో స్త్రీలు కూడా పాలుపంచుకున్న నాడే నిజమైన విముక్తిగా ఈ గేయం తెలియజేస్తుంది.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ఏ ఉద్యమాలతో సంబంధం లేకుండా సాధారణంగా జీవించే మహిళలకు కూడా బాధలు తప్ప లేవు. అలాంటి వారి జీవితాలను చిత్రించే పాటను చాలా సహజంగా కూలి తల్లులు సైతం ఆ పదాలను, రాగాన్ని ఆకలింపు చేసుకునే విధంగా పాటను రాయటం అది గద్దర్ కే సాధ్యం.

**“తెచ్చి పెడితే తిని కూసుంటావ్ – తిన్నది అరగక పంతానంటావ్ బావో... ముద్దుల బావో**

**ఒక్క ప్రశ్నడుగూత చెప్పుతావా బావా – చిన్న ప్రశ్న దుగూత చెప్పుతావ బావ”**

‘ఇంట్లో గెలువనిదే రచ్చ గెలువలేం’ అనే సామెత సారంగా పల్లవిలోనే ప్రశ్నల తూటాలను కురిపించారు. వైవాహిక జీవితమంతా ప్రతి పనిలో స్త్రీ భాగమైనా తన శ్రమకి మాత్రం గుర్తింపు లేదు. ఈ చెర నుండి బయటపడటానికి ఏ మతము ఏ ధర్మము సహాయ పడలేదు. ఆధునిక సమాజంలో స్త్రీ సెక్స్ బొమ్మ, కాల్‌గర్ల్ గా దిగజార్చబడింది. అందుకే గద్దర్ ఈ పాటలో చివరిగా ఏం చెప్పారంటే **“నరుకమనుభవించే నారీలోకమంతా పోరు దారుల్లో పోతాం”** ఇప్పుడు చెప్పు తోడుగుంటవో, జోడుగుంటవో, ఆలోచించుకొని అడుగులేస్తవో అంటూ భార్య తన భర్తను ప్రశ్నిస్తున్నట్టు చూపెట్టారు. స్త్రీలోకం విముక్తి చెందటానికి ఆఖరికి తన భర్తను సైతం లెక్క చేయక ఉద్యమాల్లో ముందుకు సాగడమే నిజమైన స్త్రీవిముక్తికి నిదర్శనంగా ఈ పాట వివరిస్తుంది.

ప్రతి పల్లె ప్రతి గుడిసెలో మారుమ్రోగిన పాట ‘ఓ లచ్చ గుమ్మడి’.

**“నిండు అమాస నాడు – ఓ లచ్చ గుమ్మడి**
**ఆడపిల్ల పుట్టినాదో – ఓ లచ్చ గుమ్మడి”**

(అరుణ కిరణాలు -1:95)

ఆడపిల్ల పుట్టగానే శాపంగా భావించే సమాజం అమాస నాడు పుట్టిన ఆడపిల్లలు మరింతగా ఈసడించుకుంటుంది. ఇవన్నీ మనుషులు సృష్టించుకున్న మూఢాచారాలకు నిదర్శనాలు. కానీ ప్రకృతిలో భాగమైన బావి, కుక్కపిల్ల బొంత నల్లపూస దారాలు బాలసేపులు ఇవన్నీ కూడా ఆడపిల్లను కాపాడాలనుకున్నాయి కానీ మానవ సమాజం ఇంత నీచానికి దిగజారింది. ఆ స్థితి దాపురించడానికి గల కారణాలను ప్రతిఘటించాలంటే ఆడబిడ్డలు మరో సమ్మక్క, సారక్కలు కావాలంటూ చైతన్యపరిచారు.

1995లో ఒరేయ్ రిక్షా సినిమా కోసం రాసిన పాట వందేమాతరం శ్రీనివాస్ నోట విస్తృత ప్రచారం పొందింది. అది “నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా”పాట. ప్రేమ వివాహాలను నిరాకరిస్తూ పరువుహత్యలు జరుగుతున్న కాలమిది. కానీ పాతిక సంవత్సరాల క్రితమే గద్దరేమన్నారంటే

**“చదివినంత నిన్ను చదివిస్తానమ్మ – ఎదిగినంత నిన్ను ఎదిగిస్తానమ్మ**

**నీకు పెళ్లిడు వచ్చేనాటికి – పువ్వు పత్రో కూడా పెట్టుత**
**నచ్చినోనికే ఇస్తానమ్మా చెల్లెమ్మా**
**నా కన్నీళ్ళతో కాళ్లు కడుగుతా చెల్లెమ్మా**
**రిక్షా బండి నేనే నా కడతా చెల్లమ్మా**
**మీ అత్తారింటికి సాగనంపుతా చెల్లెమ్మా”**

ఆడపిల్లలు ఎంత చదివినా, ఎంత ఎదిగినా పెళ్లి విషయానికొస్తే కులం గోడలు అడ్డు తగులుతున్నాయి. అంబేద్కర్ సిద్ధాంతాన్ని కూడా ఒక పార్శ్వంగా అనుసరించే గద్దర్ నచ్చినోడికే పెళ్లి చేయటం అనే మాటలతో కుల రహిత సమాజాన్ని చూడడం కలగన్నాడు. ఈ పనిని ప్రతి ఒక్కరూ తమ సొంత ఇంటి నుండే ప్రారంభించడం సమాజ మార్పులో అనివార్యం.

అమరుల స్మృతి గీతాల్లో భాగంగా **“వందనమో వందనమమ్మా – నా చెల్లేల స్వర్ణమ్మ”...** అంటూ పాడిన... మరే గీతం చూసినా యాదృచ్ఛికంగానే స్త్రీలు పడే తపన కనిపిస్తుంది. వారంతా ఆ బాధల్లోనే మగ్గిపోకుండా పోరాట మార్గాన్ని అనుసరించే విధి విధానాలు కూడా ఉంటాయి.

**“పీడిత మహిళలంతా ఏకమై గొంతెత్తిన నాడు విప్లవ వెల్లువ దోపిడీ వర్గాలను ముంచెత్తక మానదు. ఆ మహిళలే మౌనంగా మిగిలితే ఆ వెల్లువ చిరుజల్లుగా దాటిపోక మానదు”.** (డా. నళిని, స్త్రీవాద సాహిత్యం ఒక పరిశీలన, 2010:7)

ప్రజలలో భాగమై, ప్రజల మధ్య నివసించటం, స్వయంగా ఉద్యమాలలో పాల్గొనడం వలన ఒక స్త్రీ సమస్యనే కాదు అనేక సమస్యలను అవగాహన చేసుకుని హృదయానికి హత్తుకునే పాటలు రాయగలిగారు. నూతన సాంకేతిక వస్తువుల వినియోగం కారణంగా ప్రజల పాట వేగంగా విస్తరిస్తుంది. కానీ ఆ పాటల్లో స్త్రీలను బానిసలుగా, విలాస వస్తువుగా, ఆటబొమ్మగా ముద్ర వేసి అవమానపరిచేవిగా ఉంటున్నాయి. అందుకే విప్లవ పాటలను ఆనాడు జననాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య లాంటి సంస్థలు ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలలో స్త్రీల పట్ల గౌరవం వెల్లడయ్యేలా పాటలను రచించి పాడిన పద్ధతిని తిరిగి కొనసాగించేలా నేటి సమాజం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నమే అంతిమంగా గద్దరన్న ఆశయాలకు కొనసాగింపై, అదే నిజమైన నివాళి కాగలదు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం – డా. భుజంగారెడ్డి బాణాల
2. తరగని గని – గద్దర్
3. అరుణ కిరణాలు – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య
4. స్త్రీవాద సాహిత్యం ఒక పరిశీలన – డా. నళిని



# గద్దర్ సూర్యుడు

**డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 83283 33720**

ఒక పర్వతపు పై సరిహద్దును తెలుసుకోవాలంటే దాని ఎత్తును కొలిచి తెలుసుకోవచ్చు. ఒక సముద్రపు అఘాతాన్ని తెలుసు కోవాలంటే దాని లోతును కొలిచి తెలుసుకోవచ్చు. కాని ఒక వ్యక్తి మనస్సును అందులో సంచలనమై సంరచితమవుతున్న భావాల లోతును, వ్యక్తిగా వ్యవస్థను బాగుచేసుకోవాలన్న అగ్నివేశాన్ని దాని అంతరాళాన్ని కొలవడం అసాధ్యం. వ్యక్తిలో వ్యక్తిగా మారి అతని అడుగులో అడుగు వేసి వెంట నడిస్తే తప్ప తెలుసుకోలేం. అటువంటి భావాల విశ్వవిజ్ఞాని, సమసమాజ స్వాప్నికుడు గద్దర్. గుమ్మడి విఠల్ రావ్. అతని శ్వాస సమాజం. అతని ధ్యాస సమాజం. అతని మాట మనిషి కోసం. అతను నడిచింది మనిషి కోసం. అతని మాటలో, పాటలో, సామజిక న్యాయంకోసం ఆరాటం కనిపిస్తుంది. స్త్రీల హక్కులకోసం, మానవ హక్కులకోసం మానవీయ భావాలతో కూడిన పోరాటం కనిపిస్తుంది. ఆయన నడిచిన అడుగులలో అడుగై నడుస్తూ కాసేపు ప్రయాణిద్దాం....

గద్దర్‌గా లోకపరిచయమున్న గుమ్మడి విఠల్ రావ్ 'విబి గద్దర్ పాటలు' పేరుతో 1973 లో తన పాటల సంకలనాన్ని తీసుకొచ్చాడు. ఈ పుస్తకం వచ్చిన తర్వాత తన పుస్తకానికి పెట్టిన పేరు కాస్త ఆయన పేరుగా మారింది. 'గదర్' అంటే తిరుగుబాటు. ఈ పేరుతో స్వాతంత్ర్య సంగ్రామం నడుస్తున్నప్పుడు గదర్ అనే పార్టీ కూడా ప్రజలను ప్రభావితం చేసింది. కమ్యూనిస్టు భావజాలంతో ఈ పార్టీ పనిచేయడం విశేషం. ఈ రెండు రకాల నేపథ్యాలు ఆయన పేరు వెనకాల కనబడతాయి.

తెలంగాణ ప్రాంతం వలసపాలనలో, దొరల దాష్టికంలో, పేదరికం కోరల్లో మగ్గుతూ 1966 నాటికి విప్లవ బాటలో ప్రయాణం చేస్తున్న కాలమది. ప్రత్యేక తెలంగాణ తొలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజులవి. చాపకింద నీరులా తమపట్ల జరుగుతున్న అన్యాయాన్ని పసిగట్టారు ఇక్కడి ప్రజలు. ప్రాంతేతరుల పెత్తనాన్ని సీమదాటివ్వడానికి నిరసన, ఎదిరింపు, పోరాటం వంటివి ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రాతినిధ్యం వహిస్తున్న రోజుల్లో గద్దర్1972లో తొలిపాట రాశాడు. గద్దర్ కున్న ఉద్యమ అనుభవాలు, జనం మనిషిగా వారి పక్షాన నిలబడి స్వయంగా చూసిన దయనీయమైన పరిస్థితులు ఈ గీతంలో కనిపిస్తాయి. ఆగీతమే **"ఆపురో రిక్షోడో రిక్షెంటా నేనొస్తా, నిలుపురా రిక్షోడా రిక్షమీద నేనొస్తా, ఆపురా బండోడా బండిమీద నేనొస్తా నిలుపుర బండోడా బండిమీద నేనొస్తా, సీరగట్టే దాకా సెంగులు జెక్కేదాకా, సింగారించుకోని నీయెంట నేనొస్తా".** ఈ పాటలో పేదల కష్టాలు కళ్ళకు కట్టినట్లు కనబతాయి. భూస్వాముల, పెత్తందార్ల, జాతి, వర్గస్వాముల సామాజిక దోపిడిని నిరసిస్తూ గద్దర్ వాడిన సామాన్యుల భాష ఎందరినో ప్రభావితం చేసింది. పాటంటే పండితులకే కాని పామరులకు అర్థంకాని రోజుల్లో అందరి హృదయాల్లోకి సునాయాసంగా దూసుకుపోయేట్టు పాట రాయడం గద్దర్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

పాటలో బడుగు బలహీన వర్గాల ప్రజల దైన్యస్థితి, ప్రాథమిక హక్కులకు సైతం దూరమై బానిసత్వపు కోరల్లో ఇరుక్కున్న దృశ్యం నేత్రాలకు పంచుతూనే, అన్యాయానికి ఎదురొడ్డి నిలబడమని మానవ జాతికి గుండెధైర్యం ఇస్తుంది. ఈ పాట కొండపల్లి సీతారామయ్య తన 'పిలుపు' అనే పత్రికలో ప్రచురించారు. ఇట్లా గద్దర్ పాటల ప్రస్థానం ప్రారంభమైంది. పల్లె పదాలను గర్భీకృతం చేసుకొని సకల జనులను సచేతనం చేసే జానపద బాణిలో పాటలను రాసి తనలోని సమసమాజ భావనను గద్దర్ జాతిముందుంచారు.

చిన్నతనం నుండి పల్లెతల్లి ఒడిలో పెరిగిన నిష్కల్మషమైన మనసున్న వాడు గద్దర్. జాతిబేధాన్ని, కులవ్యవస్థ పెట్టే విదారకతను ప్రత్యక్షంగా అనుభవించాడు. అందరి మధ్య ఉంటూనే అందరికీ దూరంగా ఉండడం అంటే ఏమిటో తెలిసినవాడు. పైపెచ్చు పేదరికాన్ని తోబుట్టువుగా తెచ్చుకున్న నిమ్నప్రజల సమూహంలో పుట్టినవాడు. తన కుటుంబం దారిద్ర్యపు కోరల్లో ఇరుక్కొని కడగండ్లను ఎదుర్కొన్న తీరును, ఈ స్థితిలో తనతల్లి లచ్చుమమ్మ పిల్లల ఆకలిని తీర్చడానికి రెక్కలు ముక్కలు చేసుకొన్న విధాన్ని సాటి పేదలందరి దుఃఖంగా మార్చి గీతమై వర్ణించాడు. అదే **"సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో/ నీవు సినబోయి కూసున్న వెందుకమ్మో ఎందుకమ్మో/ మోకాళ్ళ మట్టుకు బురదలో దిగబడి/ ఎడ్డోలే ఎనుకకు ఒక్కొక్క అడుగేసి/ నాట్లేసి నాట్లేసి లచ్చుమమ్మో లచ్చుమమ్మో/ నీ నడుములే ఇరిగేన లచ్చుమమ్మో లచ్చుమమ్మో ..."**

ఈ పాటలో పేద ప్రజలు, శ్రమిస్తేనే జానెడు పొట్ట నిండుత దనుకునే అతి సామాన్య, దిగువ, మధ్య, వెనకబడిన ప్రజల వ్యథలు సాక్షాత్కరిస్తాయి. కన్నీళ్లను గుండెల్లోకి మింగి ఖాళీ కడుపులతో ఎండుతూ ఆత్మాభిమానాన్ని రెక్కలకు తొడిగి, ప్రమాదాలను పువ్వుల్లా



భావించే కూలీల హృదయ దిటువును ఈ పాట పట్టిస్తుంది. గర్భంలో సామాన్య ప్రజల, స్త్రీల శోకాన్ని నింపి దోపిడిదారులు చేస్తున్న శ్రమదోపిడిని నర్మగర్భం చేసిన ఈ పాట ఇది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామిక ప్రభుత్వాలు పాలిస్తున్న కాలంలో, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన వేగంగా ఎదుగుతున్న ఈ కాలంలో ఇంకా దారిద్ర్యం ఎందుకున్నది? సంపద సృష్టించేవాడొకడు, లాభాలను పొందేవాడొకడు, దాన్ని అనుభవించే వాడొకడు. ఈ స్థితికి తోడు కార్మిక, కర్షక, వృత్తి జీవుల బ్రతుకులను చిన్నాభిన్నం చేస్తున్న ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, వ్యాపారీకరణ. విపత్కర పరిస్థితులను భారతీయ సమాజం మీదికి నెట్టి గ్రామీణ సమాజాన్ని అతలాకుతలం చేసిన ఈ విధానాన్ని గద్దర్....

**"భారతదేశం భాగ్యసీమరా/ పాడి పంటలకు కొదువలేదురా/ బంగారం పండే భూములున్నవి/ చావు ఎరుగని జీవ నదులురా/ సకల సంపదలు గల్ల దేశమున దరిద్రమెట్లుందో నాయనా..."** అంటూ ఎండగట్టాడు. ప్రపంచీకరణ కోణంతో పాటు పాలక ప్రభుత్వాల వైఫల్యాలను నిరసించిన గీతం ఇది. పార్టీల ప్రయోజనాలు, నాయకుల స్వార్థ విధానాలు, ప్రజల సొమ్ము తమ సొమ్ముగా భావించి ఇష్టారాజ్యంగా పాలన చేసే ప్రభుత్వాల పనితీరును నిరసిస్తుంది ఈ గీతం. ఇక్కడ సులభమైన పదాలతో పాటై వ్యవస్థను ఎదుర్కున్నాడు గద్దర్. రాజ్యాంగ పీఠికలో భారతీయ పౌరులు రాసుకున్న గణతంత్ర, సామ్యవాద, లౌకిక, స్వేచ్ఛా, సమానత్వాలకు నీళ్ళొదిలి స్విస్ బ్యాంకుల్లో తమ నిధుల పెంపుకు ప్రజాధనాన్ని తరలిస్తున్న విధానాలను ఇక్కడ ప్రతిబింబిస్తూనే ప్రజలను చైతన్యపరిచాడు.

ప్రజలు ఎన్నుకున్న పాలకులు ఒక్కసారిగా అత్యంత ధనవంతులు ఎలా అవుతున్నారు? ప్రజల చేత, ప్రజల కోసం ఎంపికైన నాయకుడు నిత్యం ప్రజలను తన కన్నబిడ్డల్లా చూసుకుంటూ ప్రజా సంపదను ఆర్థిక అంతరాలను రూపుమాపడానికి పంపిణి చేస్తున్నాడా? అభివృద్ధికి పాటు పడుతున్నాడా? నెలకు కనీసం ఒక్క పల్లెనైనా సందర్శిస్తున్నాడా? ప్రజా సేవకుడు కదా నాయకుడు! తాను తన భాధ్యతగా చెప్పబడే 'నిరంతర సేవ' చేస్తున్నాడా? తాను ఎండి ప్రజల బతుకులను పండిస్తున్నాడా? అన్న ప్రశ్నలు ఇక్కడ వేసుకోవాలి. అప్పుడు మనలో ఏర్పడే మథనం ఈ పాటకు అర్థాన్ని చెబుతుంది. సామాన్యులను దోచుకునే వారు అడుగడుగునా ఉంటారన్న సత్యాన్ని చెబుతూ ఆర్థికసామ్యం ఏనాడైతే వస్తుందో ఆనాడే సాధించిన ప్రజాస్వామ్యానికి విలువ వస్తుందంటాడు గద్దర్.

సమాజంలో ప్రజలందరి సమస్యల బాధ్యతను తమదిగా భావిస్తామని, విప్లవ పార్టీల, సంఘాల నాయకులతో అలనాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో చర్చల నేపథ్యంగా చేసుకున్న ఒప్పందాలు కొన్ని నెలలకే విఫలమైనప్పుడు ఎంతో ఆర్ద్రతతో రాసిన పాట **"శాంతి చర్చలకు రమ్మని పిలిచి హోంమంత్రి గారు, మీరు శాంతి పావురం కుతికె పిసికితిరి ముఖ్యమంత్రిగారు...."**. మాటమీద నిలబడని ప్రభుత్వాల లోపాయికారిత్వాన్ని, అధికార చపలత్వాన్ని నిలదీస్తాడు ఈ పాటలో కవి.

గద్దర్ ప్రజా సమస్యలకు అద్దం పడుతూ నిర్మించిన సినిమాలలో తన గొంతుతో ఎన్నో పాటలు పాడాడు. కొన్ని సినిమాలకు పాటలు రాశాడు. అందులో.... **"నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా/ తోడబుట్టిన ఋణం తీర్చుకుంటనే చెల్లెమ్మ"** అన్న గీతం అన్న చెల్లెళ్ళ అనుభంధానికి అక్షర నీరాజనం పడుతుంది. 'ఒరేయ్ రిక్షా' అనే సినిమాకు రాసిన ఈ గీతం వందేమాతరం శ్రీనివాస్ సంగీత దర్శకత్వంలో వచ్చింది. **"మల్లెతీగకు పందిరి వోలె/ మస్క సీకటికి వెన్నెల వోలె...."** అంటూ ఆరంభమయ్యే ఈపాటలోని చరణాలు ఒక అన్నయ్య తన చెల్లెమ్మపై తనకున్న ప్రేమ, విశ్వాసాల గూర్చి చెబుతుంటే హృదయం చెరువవుతుంది. **"పెద్ద మనిషివై పూసిన నుండే ఆడపిల్లపై ఆంక్షలు ఎన్నో / చూసేదానిని సూదొడద్దంటరు నవ్వేచోట నవ్వొద్దంటరు/ ఆలువంటి నే అన్ననుగాను చెల్లెమ్మా / నీ చిన్ననాటి స్నేహితుడినమ్మా చెల్లెమ్మా/ అడవిలోన నెమలి వోలె చెల్లెమ్మా / ఆటలాడుకో పాట పాడుకో చెల్లెమ్మా..."** అంటూ సాగే చరణాలు మాటలకు అందని భావాలను అక్షరాల్లో వెలిబుచ్చుతాయి.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిరంతర పోరాట యోధుడిగా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రకటించారు గద్దర్. రాష్ట్రవ్యాప్తంగా మారుమూలలకు సైతం ఉద్యమాన్ని నడిపించాయి ఆయన పాటలు. నిప్పు కణికల్లాంటి పదాలతో మూడు తరాల పోరాట యోధులను మళ్ళీ యుద్ధానికి సిద్ధం చేశాయవి. ఉస్మానియా యూనివర్శిటీలో ఉద్యమ నేపథ్యాన్ని పులుముకున్న గద్దర్ పాటలు ఆ పోరాట గడ్డకున్న జిగిని నింపుకొని ప్రవహించాయి. అందులో **"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా"** అన్న గీతం తెలంగాణ ఘనతను చెబుతూనే రాజ్యహింసలో, దోపిడిలో ఎంతటి దయనీయ స్థితికి చేరుకుందో చెప్పి ఉద్యమకారులకు మాతృరాష్ట్ర ఉద్ధరణకు కంకణం కట్టిస్తుంది. ఇందులోని ఒక్కో చరణాన్ని గనుక పట్టి చూస్తే పరాయి ప్రభుత్వాల

అభూత కల్పనలకు దూరంగా ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కున్న సమాజం, ప్రాంతం, నైసర్గిక స్వరూపాలు దర్శనమిస్తాయి.

**"ఖమ్మం మెట్టు అడవులతోనే/ కట్టుకుంది పట్టుచీర/ ఆదిలాబాదు ఆకు నులిమి/ పెట్టుకుంది నొసట బొట్టు/ నాగారం అడవి తుమ్మతో/ దిద్దుకుంది కనుల కాటిక/ కుసుమ పువ్వులు నూరమ్మో/ పసుపు పుసుకుందవమ్మో/ నిండు ముత్తైదా తెలంగాణము/ ముండ మోసినట్లున్నా దమ్మో...."** అంటూ ప్రకృతి వన్నెకు, పాడి పంటలకు నెలవైన తెలంగాణలో సమాజం దారిద్ర్య రేఖ దిగువకు ఎలా చేరుకుందో ఇక్కడ గోచరమవుతుంది. కొన్ని చరణాల అంతిమ పాదాలు చదివితే గుండె తరుక్కుపోతుంది.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మార్చ్ ఫాస్ట్ గీతంగా నిలిచిన గద్దర్ గీతం **"పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా"** ఈపాటలోని మాటలు ఎవ్వరినైనా కదిలిస్తాయి. రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తాయి. ఉద్యమ రణరంగంలోకి నడిపిస్తాయి. **"ఓ భూతల్లి సూర్యుడిని ముద్దాడిన భూతల్లి / అదిగో చిన్నారి బిడ్డల్ని జన్మనిచ్చింది/ అమ్మా నీవు త్యాగాల తల్లివి త్యాగాల గుర్తువి.."** అంటూ సాగే గీతం ఒక్కసారిగా **"భూతల్లి బిడ్డలు చిగురించే కొమ్మలు/ చిదిమేసిన పువ్వులు త్యాగాలు గుర్తులు/ మా భూములు మాకేనని/ మర్లబడ్డ రాగమా/ తిర్గబడ్డ గానమా...."** అంటూ వలస పాలకుల పాలనా దౌర్జన్యాన్ని ఎదిరిస్తాయి. ఎప్పటికీ ఈ పాట సాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుంది. ఉద్యమం గురించి మాట్లాడాలంటే ఈ పాటను ప్రస్తావించుకోకుండా ముందుకుపోలేం అన్నది నిజం.

ఇట్లా గద్దర్ తెలంగాణ తల్లిని తన పాటలతో గీతాభిషేకం చేశాడు. బడుగు బలహీన వర్గాల గొంతుకై నిలిచాడు. పేద బతుకులలో పాటల వెలుగై ప్రసరించాడు. న్యాయాక్రోశానికి పాట అనే అగ్నిని పులిమి ఆగ్నేయాస్త్రంగా అన్యాయంపై తిరగబడ్డాడు. తాను కదిలాడు, అందరినీ కదిలించాడు. అంబేద్కర్ సూర్యుడిలా గద్దర్ ఒక సూర్యుడై ప్రజల మనిషిగా ప్రభవించాడు. అతనికి మరణం లేదు. పాటై ప్రతినిత్యం ఉదయిస్తూనే ఉంటాడు. అతని పాటకు రణమే కాని మరణం లేదు.

# సమరశీలమైన పాటకు చావులేదు.

**గద్దర్ మనకున్న ఒకేఒక పాప్ సింగర్. పాల్ రాబ్సన్ వంటి పాప్‌సింగర్ల మాదిరే గద్దర్ కూడా తాను పాడే పాట తానే రాసుకుంటాడు. మన త్యాగయ్య, రామదాసుల మాదిరి. అందుకే ఆయన వాగ్గేయకారుడు. పాట పుట్టుకపై, దానికున్న చారిత్రిక ప్రాధాన్యతపై, ప్రజానీకానికి పాటతో వున్న అనుబంధంపై గద్దర్ మాట్లాడుతున్నారు. వినండి.**

**పాట ఎలా ఆవిర్భవించింది?**

+ లిపి రాకముందు, అసలు సాహిత్యం అంటేనే పాట. మౌఖిక సాహిత్యంలో ప్రధానమైంది పాట. ఆ తర్వాత ఇతర ప్రక్రియలు. మానవ జీవనంలో మైలురాయి అయిన పాట ఉబుసుపోక పుట్టింది కాదు. శ్రమ జీవులు తమ కష్టాన్ని మరచిపోయి మరింత ఉల్లాసంగా పని చేయడానికి పాట ఆవిర్భవించింది. ప్రజల ఆశలకు, ఆశయాలకు ప్రతిరూపమై వెలిసింది. జన జీవితాన్ని సజీవంగా చిత్రీకరించేవి ప్రజసల పాటలే. అవి శ్రమలో భాగమై, దాని **'లయను అనుసరించి పనిపాట'** అయింది. దైనందిన జీవితంలో విడదీయలేని భాగమైంది.

**పాటకు ప్రాణం పోసి పోషించేది ఎవరు?**

+ పని, పాట విడదీయలేనివి. పని అంటే శ్రమతో పాటే పాట ఉంది. అంటే శ్రమజీవులే పాటకు ప్రాణం పోశారని అర్థం. తాము చేసే పనికి దాని అయకు అనుగుణంగా పాటను మలుచుకున్నారు ప్రజలు. మోట మీద పాడే పాట బాణీ ఒక విధంగా ఉంటే నాట్లు, కలుపుల మీద పాడే పాటల బాణీ మరో విధంగా ఉంటుంది. ఆ విధంగా శ్రమజీవులు పాటకు ప్రాణం పోయడమే కాదు పోషిస్తున్నారు కూడా. పనితో సంబంధం లేని వానికి పాటతోనూ సంబంధం లేదు.

**పాటకు అంత ప్రాముఖ్యం ఎలా వచ్చింది?**

+ సమస్త సాహిత్య ప్రక్రియల్లో పాట చాలా పదునైన ఆయుధం. మనిషి సొంతం చేసుకోగల లక్షణం ఒక్క పాటకు తప్ప మరే ఇతర సాహిత్య ప్రక్రియకు లేదు. పాటకు పని అడ్డురాదు. వేష భూషణాలు, వేదికలూ అవసరం లేవు. స్థల కాలాదులు ఆటంక పరచలేవు. శ్రావ్యం, సంగీతంతో కూడుకొన్న పాట మనిషిలో స్పందనకు కారణమవుతుంది. ప్రజల భావాలకు, అనుభవాలకు ప్రతిరూప మవుతుంది. ఆశలకు, ఆశయాలకు ప్రాణమై నిలుస్తుంది. మన జీవితాన్ని మరింత సజీవంగా చిత్రీకరించే ప్రజల పాట వారి కష్టాలకు కారణాలు చెబుతుంది. కన్నీళ్లకు కర్తవ్యం బోధిస్తుంది. అన్నీ కోల్పోయామని నిస్సత్తువతో ఉన్న జనాన్ని ఉత్తేజ పరుస్తుంది. ఉద్యమోన్ముఖుల్ని చేస్తుంది. అందుకే పాటకు అంత ప్రాముఖ్యం వచ్చింది. అంతేకాదు ఏడ్చే పసిబిడ్డకు పాటపాడి వినిపిస్తే హాయిగా ఆడుకుంటుంది. పాటలోని రాగం ఆ బిడ్డకు అనురాగమై అలరిస్తుంది. తక్షణ ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది. అందుకే పాటకు అంత ప్రాముఖ్యం.

**పాట ప్రయోజనం గురించి చెబుతారా?**

+ సమాజంలో ప్రతి వస్తువుకూ ఓ ప్రయోజనం ఉన్నట్లే పాటకూ ఉంది. చారిత్రక నేపథ్యంలో సామాజికావసరాలు, ఉపయోగం

వచ్చినప్పుడే ఒక్కో వస్తువుకు ఒక్కోసారి గుర్తింపు, విలువ ఉంటుంది. కానీ పాటకు ఉన్న సామాజిక ప్రయోజనాలు అనేకం. ఏడ్చే పాపను ఊరడించడానికి పాడే ఊయల పాట ప్రయోజనం ఒకటైతే, నాట్లేసేటప్పుడు పాడే పాట ప్రయోజనం ఆ పని వేగాన్ని పెంచడం. అందుకే పాటకు అన్ని వేళల ఆధారం లభిస్తుంది. జనపథాన్ని ప్రగతి పథంలో నడిపించడమే పాట ప్రయోజనం. అడవిలో గిరిజనుల జీవితాల్లో ఆటపాటలు భాగమయ్యాయి. అక్కడ పాట లేకపోతే అన్నమే లేదు. ఇలా పాట ప్రయోజనం గురించి చెప్పుకుంటూ పోతే పుటలే కాదు సంపుటాలు నిండుతాయి.

**వివిధ చారిత్రక దశల్లో పాట నిర్వర్తించిన పాత్ర?**

+ సాహితీ జగత్తులో ప్రప్రథమమైన పాట వివిధ చారిత్రిక దశల్లో నిర్వర్తించిన పాత్ర అనుపమానమైనది. పాటల్లోని బిడీకృతమైన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలంటే ఏ చారిత్రక నేపథ్యంలో ఆ పాట ఆవిర్భవించిందో ముందు అర్థం చేసుకోవాలి. ఉదా: **"తేనె పూసిన కత్తి నెహ్రూయో! తెలిసింది నీ గుట్టు"** అనే పాట 1946-52 మధ్య కాలంలో తెలంగాణలో పుట్టింది. తెలంగాణా రైతాంగ పోరాటాన్ని విరమింప చేయడంలో నెహ్రూ పాచికలు పారాయి. కానీ నెహ్రూ కుట్రను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించాలన్న ఉద్దేశంతోనే ఆనాటికవి నెహ్రూను తేనె పూసిన కత్తితో పోల్చాడు. తెలంగాణా పోరాటాన్ని విరమింప చేయడంలో నెహ్రూ పాత్రను అర్థం చేసుకోకపోతే ఈ పాటలో నిబిడీకృతమైన ఉద్దేశం అర్థం కాదు.

**ఒక పాట రాయడానికి మీరు పడే శ్రమ**

+ ప్రజల పాటల్ని, బాణీని విప్లవీకరించి పోరాట పాటలు రాస్తాం. ఆశేష జనవాహినికి అర్థమయ్యే విధంగా ప్రజల బాసలో, మాండలిక యాసలో పాటలు రాయడం నిజంగా ఓ యజ్ఞం. పాట రాసే ముందు ప్రసవ వేదనను అనుభవించాల్సి వస్తుంది. ప్రజల్లో బాగా పలుకుబడిలో ఉన్న బాణీలను సేకరించి వాటిని నెమరువేస్తాం. ఆ బాణీని, ఆ బాణీలో ఉన్న పాట సందర్భాన్ని (చారిత్రిక నేపథ్యాన్ని) కూడా అధ్యయనం చేస్తాం.

**ప్రజల బాణీల్లో విప్లవ పాటలు రాసేది ఎక్కువగా కింద వర్గాల నుంచి వచ్చిన కవులే కదా!**

+ ప్రజల కష్ట సుఖాలను ప్రత్యక్షంగా చూసిన వాళ్ళు కింది వర్గాల నుంచి వచ్చినవాళ్లే. ప్రజల్లోంచి వచ్చినవాళ్లే ఆ బాణీలను, ప్రజల యాసను పట్టుకోగలుగుతారు. అంతేకాదు, ఉన్నత వర్గాల నుంచి వచ్చిన విప్లవ కవులకు ప్రజల భాషలో పాటలు రాయడం కన్నా కవితలో, కథలో, నవలలో రాయడం తేలిక. అందుకే వాళ్ల పాటకూ దూరమవుతున్నారు. ప్రజలకూ దూరమవుతున్నారు. విప్లవ పాటలు రాసిన చెరబండరాజు, శివసాగర్, గద్దర్, అంజయ్య, శశి, మిత్ర, వంగపండు, మల్లిక్, సాంబశివరావు, నూతన్ తదితరులు సామాన్య కుటుంబాల్లోంచి వచ్చినవాళ్లే. అయితే వీళ్లలోనూ ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్న కవుల పాటలే ప్రజా జీవితాన్ని, ఉద్యమాన్ని చాలా సజీవంగా చిత్రీకరించాయి.

**పాట కాలగర్భంలో కలిసి కనుమరుగయ్యే ప్రమాదం ఉందా?**


జన జీవితాల్లోని మూఢ నమ్మకాలకు, భక్తికి, ప్రేరణకు, ప్రకృతికి, ప్రేమ పురాణాలకు సాధనమైన పాట ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటుంది. సమరశీలమైన పాటకు చావులేదు.

(5 మే 1992, సుప్రభాతం పత్రికలో గద్దర్ ఇంటర్వ్యూ)


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్: 934 7971177


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా


సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.


చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642,
IFS Code : SBIN0020083

editormusi@gmail.com

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



**ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....**

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma